RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




19 అక్టోబర్ 2024 శనివారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:119

## యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి అదానీ ఫౌండేషన్ రూ.100 కోట్ల విరాళం - సీఎం రేవంత్‌రెడ్డి

వార్తా 2 లో



## నవంబర్ 13 వయనాడ్ పార్లమెంటరీ ఉపఎన్నికకు ప్రియాంక గాంధీ నామినేషన్



న్యూఢిల్లీ, అక్టోబర్ 18(భారత్ సమాచార్)అక్టోబరు 23న లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో కలిసి ప్రియాంక గాంధీ నవంబర్ 13 వయనాడ్ పార్లమెంటరీ ఉపఎన్నికకు నామినేషన్ దాఖలు చేసే అవకాశం ఉన్నందున కాంగ్రెస్ భారీ ప్రదర్శనకు సిద్ధమవుతోంది. వాయనాడ్ ఉప ఎన్నిక నవంబర్ 13న జరగనుంది. నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ అక్టోబర్ 25, అభ్యర్థిత్వ ఉపసంహరణకు చివరి తేదీ అక్టోబర్ 30. ఫలితాలు నవంబర్ 23న వెలువడనున్నాయి.

ఉప ఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థిగా సీనియర్ నేత రాకను ప్రకటించడానికి నామినేషన్ దాఖలు రోజు రోడ్‌షో ప్లాన్ చేస్తున్నట్లు పార్టీ అంతర్గత సమాచారం. రాహుల్ ప్రధాన లోక్‌సభ ఎన్నికలలో వయనాడ్ నుండి రెండవసారి లోక్‌సభకు గెలిచారు, అయితే ఉత్తరాది రాష్ట్రంలో పార్టీని పునరుద్ధరించాలని

మిగతా 2లో



ప్రజాబలం

19 అక్టోబర్ 2024 శనివారం

# మూసీకి ఇది పునర్జీవనం..

మూసీ నది ప్రక్షాళన అభివృద్ధిని వ్యతిరేకించే వాళ్లు ఒక్కసారి...మూసీ పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న వాళ్ల జీవితాలను గూర్చి మనసుతో ఆలోచించండి. వాళ్లను అలానే మురికి కూపంలోనే వదిలేసి, మనం మాత్రం ఏసీ బంగ్లాలో నివసిస్తూ, రాజకీయ పబ్బం గడపడటం ఎంతవరకు సమంజసమో..? దీనిపై విమర్శించే వారు మానవతా కోణంలో ఆలోచించాలి. అధికార పార్టీపై పగ, ప్రతీకారం కోసం అమాయక ప్రజల భవిష్యత్తును ఫణంగా పెట్టడం ఎంతవరకూ సమంజసమో.. బీఆర్ఎస్ పార్టీ నేతలు తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. మూసీనది కాలుష్యం ఉమ్మడి నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్ పరిసర ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. మూసీ అంటే.. ఒక్కప్పుడు రంగారెడ్డి, హైదరాబాద్, నల్లగొండ జిల్లాలకు జీవనాడి. కానీ ఇప్పుడు మూసీ అంటే ఓ కాలకూట విషం అన్న అభిప్రాయం నేడు ప్రబలంగా ఉంది. ఈ నదిలో కేన్సర్ కారకాలైన ఆర్సెనిక్, క్రోమియం, కాపర్, నికిల్, లెడ్ తదితర భార లోహాలున్నట్లు ఎన్‌జీఆర్ఐ తన పరిశీలనలో గుర్తించింది. ఈ కలుషితమైన నీరు ప్రజల ఆరోగ్యానికి భారీగా హాని చేస్తోందనీ ముఖ్యంగా వివిధ రకాలైన కేన్సర్‌లు, మూత్రపిండాల వ్యాధులు, చర్మ వ్యాధులు, అబార్షన్లు, కీళ్ల నొప్పులు, కడుపు నొప్పి, గొంతు నొప్పి తదితర రోగాల బారిన పడతారని, వ్యవసాయ భూములు పంటలకు పనికి రాకుండా పోతాయనీ. చెరువుల్లో చేపలు, గడ్డిమేసే పశువులు, నీళ్లు తాగే పక్షులు సైతం పునరుత్పత్తి శక్తిని కోల్పోయే ప్రమాదముందని పరిశోధనలు తేల్చాయి.నల్గొండ ఫ్లోరైడ్ కష్టం చెప్పుకుంటే తీరేది కాదు.. ఇక్కడ భూగర్భ జలాలనే కాకుండా, ఉపరితల జలాలను కూడా శుద్ధి చేసి వాడాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ, కేంద్ర జలశక్తి సంస్థ చెప్పింది. కానీ గతంలో పాలించిన ప్రభుత్వాలు దాన్ని అమలు చేయలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ నిర్లక్ష్యానికి గురైనట్లే, నాటి టీఆర్ఎస్ ప్రభుత్వం కూడా నల్గొండ సమస్య పరిష్కారానికి ఏ మాత్రం చొరవ చూపలేదు. మూసీ నది కాలుష్యం ఉమ్మడి నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్ పరిసర ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. ఈ మధ్యనే వచ్చిన నదులనీటి నాణ్యతా ఇండెక్స్‌లో మూసీ రివర్ నీటిలో ఆక్సిజన్ స్థాయిలను ప్రభావితం చేసే టర్బిడిటీ స్థాయిలు 1- 4 మధ్యన ఉండాల్సిన స్థానే, దామరచర్ల దగ్గర 15 గా, వలిగొండ దగ్గర 13 గా, వాడపల్లి దగ్గర 13గా ఉంది. బీఓడీ (బయోలాజికల్ ఆక్సిజన్ డిమాండ్) స్థాయిలు 3 మిల్లీ గ్రాముల కంటే తక్కువ ఉండాలి. కానీ వలిగొండ దగ్గర 10.01 శాతం ఉంది. డయేరియా, జ్వరం, చర్మ వ్యాధులకు కారణమయ్యే భయంకరమైన కోలిఫాం బ్యాక్టీరియా తాగునీటిలో అసలే ఉండకూడదు. కానీ, దామరచర్లలో 1400గాను, వలిగొండ ప్రాంతంలో 2200 గాను, వాడపల్లి దగ్గర 1500గాను ఉంది. మూసీ నీటితో సాగు చేసే పంటలు, కూరగాయలను మేడ్చల్ మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, హైదరాబాద్ వాసులు దశాబ్దాలుగా వాడుతున్నారు.ఈ నదిలో కాలుష్యానికి కారణం నిత్యం వందలాది పరిశ్రమలు, ఔషధ కంపెనీలు తమ వ్యర్థాలను నదిలోకి వదులుతుండటం. కాటేదాన్, పటాన్‌చెరు, జీడిమెట్ల, కూకట్‌పల్లి, సనత్‌నగర్, ఆజామాబాద్, ఉప్పల్, మల్లాపూర్, నాచారం ఇండ్రస్ట్రియల్ ఏరియాల నుండి విషరసాయనాలు నేరుగా మూసీలో వదిలేయడం అతి ప్రధాన సమస్యగా మారింది. హెచ్ఎండీఏ పరిధిలోని ఇళ్ల నుండి వచ్చే డ్రైనేజీ నీళ్లు, వ్యర్థ పదార్థాలన్నీ ఇప్పుడు మూసీలోనే కలుస్తున్నాయి. ఈ విషపు నీళ్లు ఉమ్మడి నల్లగొండ జిల్లా మీదుగా కృష్ణాలో కలుస్తూ విషాన్ని పంచుతుంది. హైదరాబాద్‌లో నిత్యం 2000 ఎంఎల్‌డీల వరకు మురుగు, రసాయనాలతో కూడిన వ్యర్థజలాలు మూసీలో కలుస్తున్నాయి. ఇందులో కేవలం 800 ఎంఎల్‌డీల నీటినే ఎస్‌టీపీల ద్వారా శు ద్ధి చేస్తున్నారు. మిగతాది శుద్ధి లేకుండానే మూసీకి వదులుతున్నారు. ఫలితంగా మూసీ డంపింగ్ యార్డుగా మారిపోతోంది. రెండేళ్ల కిందట మూసీలోకి 350 మిలియన్ లీటర్ల కాలుష్యం మాత్రమే వెళ్లగా ఇప్పుడది 1,625 మిలియన్ లీటర్లకు పెరిగింది.

మూసీ అభివృద్ధి ప్రాజెక్టు పనులు ప్రారంభమవ్వాలంటే ముందుగా మూసీ వెంట వివిధ ప్రాంతాల్లో ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోని అక్రమణలన్నీ తొలగించాలనీ మూసీ రివర్ ఫ్రంట్ డెవల్‌పమెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్ఎఫ్‌డీసీఎల్) నిర్ణయించింది. ఇందుకు వివిధ శాఖల అధికారులతో పశ్చిమాన ఔటర్ రింగ్ రోడ్డు నుంచి తూర్పున కొర్రెముల వద్ద ఉన్న ఔటర్ వరకు సర్వేను పూర్తిచేశారు. నార్సింగ్ నుంచి నాగోల్ బ్రిడ్జి వరకు దాదాపు 25 కిలోమీటర్ల మేర ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో 12 వేలకు పైగా అక్రమణలు ఉన్నట్లు గుర్తించింది. చాలావరకు 30, 40, 60 గజాల్లోనే పేద ప్రజలు ఇళ్లు కట్టుకున్నారు. మధ్యలో 10 అడుగుల దారి కూడా లేకుండానే నిర్మించుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఏకంగా కాలనీలే వచ్చేశాయి. కొందరు గోదాములు, షెడ్‌లు ఏర్పాటు చేసి పెద్దఎత్తున వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. సర్వం కోల్పోయిన కుటుంబాలకు ఉచిత వసతి గృహాలు, ఉచిత రవాణా సౌకర్యం కల్పించి వాళ్లను సంతృప్తి పరిచిన తర్వాతనే మూసీ నది ప్రక్షాళన అభివృద్ధి చేపట్టాలి. లేకపోతే అమాయకులకు అన్యాయం చేసిన వారిగా చరిత్రలో నిలిచిపోయే అపవాదు ఉంటుందని ప్రభుత్వంలోని పెద్దలు గ్రహించాలి. ఇప్పటికైనా మూసీ నదిని ప్రక్షాళన, అభివృద్ధి చేయకుండా ఇలానే వదిలేస్తే.. రాబోయే రోజుల్లో మరింత తీవ్రమై ఉమ్మడి నల్గొండ, హైదరాబాద్ జిల్లా ప్రజల మనుగడ ప్రశ్నార్థకం అయ్యే అవకాశం ఉంది. మూసీ అభివృద్ధి ఫోరం పేరుతో గత ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి హరీష్ రావు జపాన్ వద్ద రూ.1000 కోట్లు తీసుకువచ్చి ఎలాంటి అభివృద్ధి పనులు చేయకపోగా నేడు రాజకీయ పబ్బం కోసం మూసీ పరివాహక ప్రాంత గృహ నిర్మాణదారులకు అండగా ఉంటామని మాట్లాడటం విడ్డూరంగా ఉంది. ఆనాడు సాక్షాత్తు నాటి సీఎం కేసీఆర్ మూసీ నది ప్రక్షాళనకు అందరూ సహకరించాలని మీడియాతో మాట్లాడిన మాటలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కాబట్టి మూసీ నది ప్రక్షాళన ప్రయత్నాలకు, ప్రతిపక్షాలు రాజకీయ ప్రయోజనాలు ఆశిస్తూ అడ్డు పడవద్దని, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అవకాశవాద రాజకీయాలు మానుకోవాలని బీఆర్ఎస్ పార్టీ అధినేతలను తెలంగాణ సమాజం ప్రార్థించుతున్నది.

# వ్యాక్సిన్ రాజధానిగా భారత్...

న్యూఢిల్లీ, అక్టోబరు 18,(న్యూస్ పల్స్) గత సంవత్సరంలో ప్రపంచంలో అందించిన సగం వ్యాక్సిన్‌లను భారతదేశం ఉత్పత్తి చేసింది. మొత్తం ఎనిమిది బిలియన్ డోస్‌లలో నాలుగు బిలియన్ డోస్‌లు భారతదేశంలో తయారు చేయబడ్డాయి. యుఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్ ఫోరమ్ నిర్వహించిన ఇండియా లీడర్‌షిప్ సమ్మిట్ 2024లో కేంద్ర ఆరోగ్య కార్యదర్శి పుణ్య సలీల శ్రీవాస్తవ ఈ సమాచారాన్ని అందించారు. ఫార్మాస్యూటికల్స్ రంగంలో భారతదేశం గ్లోబల్ లీడర్‌గా ఆవిర్భవించిందని, జెనరిక్ ఔషధాల ఉత్పత్తి, ప్రధాన సరఫరాదారుగా ప్రపంచంలోనే మూడవ స్థానంలో ఉందని ఆయన అన్నారు. ప్రపంచం మొత్తం కరోనా మహమ్మారితో పోరాడుతున్నప్పుడు కూడా భారతదేశం.. మన దేశంలో తయారు చేసిన వ్యాక్సిన్‌ను ప్రపంచానికి అందజేసింది. భారతదేశం అనేక దేశాలకు ఉచిత వ్యాక్సిన్‌ను అందించింది. ప్రపంచ ఆరోగ్య వ్యవస్థకు భారతీయ ఔషధ పరిశ్రమ భారీ పొదుపును అందించిందని పుణ్య సలీల శ్రీవాస్తవ అన్నారు. 2022 సంవత్సరంలో భారతీయ కంపెనీలు ఉత్పత్తి చేసే ఔషధాల వల్ల అమెరికా ఆరోగ్య వ్యవస్థకు 219 బిలియన్ డాలర్లు ఆదా అవుతాయి. 2013 నుండి 2022 వరకు ఈ పొదుపు 1.3 ట్రిలియన్ అమెరికన్ డాలర్లు.గత ఏడాది ప్రపంచవ్యాప్తంగా 8 బిలియన్ల వ్యాక్సిన్ డోస్‌లను తయారు చేసి పంపిణీ చేయగా.. వాటిలో సగం భారత్‌లోనే తయారయ్యాయని కేంద్ర ఆరోగ్య శాఖ సెక్రటరీ పుణ్య సలీల శ్రీవాస్తవ తెలిపారు. గురువారం యుఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్ ఫోరమ్ నిర్వహించిన వార్షిక ఇండియా లీడర్‌షిప్ సమ్మిట్ 2024లో ఆమె ఈ మేరకు ప్రసంగించారు. భారత్ ఫార్మాస్యూటికల్స్‌లో గ్లోబల్ లీడర్‌గా అవతరించిందని, మూడవ అతిపెద్ద ఉత్పత్తిదారుగా, జనరిక్ మెడిసిన్ కీలక సరఫరాదారుగా నిలిచినట్లు పుణ్య తన ప్రసంగంలో తెలిపారు. ఈ రంగంలో భారత్ ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలకు గణనీయమైన సహకారం అందించేందుకు దారితీస్తుందన్నారు. ఇందులో యూఎస్ హెల్త్‌కేర్ సిస్టమ్ సహకారం కూడా ఉన్నట్లు పేర్కొన్నారు.యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా వెలుపల అత్యధిక సంఖ్యలో యూఎస్ ఎఫ్డీయే - ఆమోదించబడిన ఔషధ కర్మాగారాలు కలిగి ఉండటమే అందుకు నిదర్శనం. అమెరికా వెలుపల ఉన్న యూఎస్ ఎఫ్డీయే- ఆమోదించబడిన ప్యాంట్‌లలో వీటి సంఖ్య దాదాపు 25 శాతంగా ఉంది. భారత్ కంపెనీల్లో తయారు చేసిన మందుల పంపిణీ ద్వారా 2022లో యూఎస్ హెల్త్‌కేర్ సిస్టమ్‌కి 219 బిలియన్ డాలర్లు పొదుపును అందించాయి. 2013 ? 2022 మధ్య మొత్తం 1.3 ట్రిలియన్ డాలర్ల పొదుపును అందించాయని ఆమె పేర్కొన్నారు. మందులు మాత్రమే కాకుండా వ్యాక్సిన్ ఉత్పత్తిలో కూడా భారత్ ముందుంది. ప్రపంచ వ్యాక్సిన్ల తయారీలో గణనీయమైన వాటాతో ముందుగు సాగుతుంది. భారత్ 'ప్రపంచ ఫార్మసీ'గా దాని పాత్రను నొక్కి చెబుతుందని ఆమె చెప్పారు. ప్రపంచంలో తయారయ్యే వ్యాక్సిన్‌లలో 50 శాతం ఒక్క భారత్‌లోనే తయారవుతున్నట్లు పుణ్య తెలిపారుగత ఏడాది ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది బిలియన్ల వ్యాక్సిన్ డోస్‌లను తయారు చేసి పంపిణీ చేయగా, నాలుగు బిలియన్ డోస్‌లు భారత్లోనే తయారు చేసినట్లు ఆమె చెప్పారు. పటిష్టమైన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను నిర్ధారించడానికి భారత్ మెడికల్ ఎడ్యుకేషన్‌ను సంస్కరించిందని, జాతీయ వైద్య కమిషన్ చట్టం, ఇతర సంబంధిత చట్టాలలో కాలం చెల్లిన నియంత్రణ ఫ్రేమ్‌వర్క్‌లను భర్తీ చేసిందని ఆమె పేర్కొన్నారు. ఇది వైద్య, నర్సింగ్ కాలేజీల సంఖ్య, నమోదులో గణనీయమైన పెరుగుదలకు దారితీసిందన్నారు. ఇది ఆరోగ్య సంరక్షణలో వృత్తిపరమైన లభ్యతలో అసమానతలను పరిష్కరిస్తుందని ఆమె చెప్పారు. పర్యవసానంగా జాతీయ, ప్రపంచ అవసరాలను తీర్చగల ఆరోగ్య శ్రామిక శక్తిని ఉత్పత్తి చేయడానికి భారత్ సిద్ధంగా ఉందని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రయత్నాలు భారత్‌లో ఆరోగ్య సంరక్షణ నాణ్యత, స్థోయి, ఖర్చు క్రమంగా మెరుగుపరిచాయని పుణ్య పేర్కొన్నారు.2013-2014.. 2021-2022 మధ్య కాలంలో మొత్తం ఆరోగ్య వ్యయం వాటా 25 శాతం తగ్గడమే మా విస్తరించిన ఆరోగ్య సంరక్షణ సేవలకు నిదర్శనమని ఆమె చెప్పారు. హెల్త్ కేర్ సెక్టార్‌లో ఇండో-యుఎస్ భాగస్వామ్యంపై పుణ్యా మాట్లాడుతూ.. కోవిడ్ వంటి మహమ్మారిని ఎదుర్కోవడంలో సంసిద్ధత, యాంటీ-మైక్రోబయల్ రెసిస్టెన్స్‌లలో.. నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ ( ఎన్సీడీసీ), యూఎస్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సిడిసి ) మధ్య ఉన్న బలమైన భాగస్వామ్యాన్ని తెలుపుతుంది. యూఎస్ సిడిసి సహకారంతో నిర్వహిస్తున్న ఎన్సీడీసీ, ఎఅఓఖీ ఫీల్డ్ ఎపిడెమియాలజీ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లను భారత్ అభినందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ఇప్పటివరకు 200 మందికి పైగా ఎపిడెమిక్ ఇంటెలిజెన్స్ సర్వీసెస్ అధికారులు ట్రైనింగ్ పొందారని, మరో 50 మంది శిక్షణ పొందుతున్నారని ఆమె అన్నారు. బయో-ఫార్మాస్యూటికల్ సప్లై చైన్, ప్రపంచ సరఫరా గొలుసులను ఆప్టిమైజ్ చేయడానికి, బలోపేతం చేయడానికి బయో-5 కూటమి ద్వారా సింగిల్-సోర్స్ సరఫరాదారులపై ఆధారపడటాన్ని తగ్గించనున్నట్లు తెలిపారు.ఉమ్మడి వ్యూహాత్మక ఫ్రేమ్‌వర్క్‌ను ప్రారంభించడానికి భారత్-యుఎస్ కూడా అంగీకరించాయి. 2023లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు జో బిడెన్ క్యాన్సర్‌పై పోరాటానికి కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. యూఎస్-భారత్ క్యాన్సర్ మూన్‌షాట్ డైలాగ్ ఆగస్టులో ప్రారంభించినట్లు తెలిపారు. యుఎస్-ఇండియా బయోమెడికల్ పరిశోధన సహకారాన్ని పెంపొందించడం, గర్భాశయ క్యాన్సర్‌పై దృష్టి సారించడం దీని ప్రధాన లక్ష్యమని పుణ్య పేర్కొన్నారు. ఇది ఎయిమ్స్, టాటా మెమోరియల్ హాస్పిటల్ వంటి సంస్థలతో భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నట్లు ఆమె తెలిపారు. ఇది 'వన్ వరల్డ్, వన్ హెల్త్' విజన్‌ను ప్రతిబింబిస్తుందన్నారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో క్యాన్సర్ పరీక్షలు, రోగనిర్ధారణకు 7.5 మిలియన్ డాలర్ల నిధులు కేటాయించామన్నారు. రేడియోథెరపీ, క్యాన్సర్ నివారణకు గవి, క్వాడ్ ప్రోగ్రామ్‌ల కింద ప్రపంచ దేశాలకు భారత్ 40 మిలియన్ల వ్యాక్సిన్లు అందిస్తుందని తెలిపారు. ఆరోగ్య సంరక్షణలో భారత్-యుఎస్ ఉమ్మడి భాగస్వామ్యం ఆరోగ్య సవాళ్లను పరిష్కరించడానికి సహకారం అందిస్తుందని పుణ్య తన ప్రసంగంలో స్పష్టం చేశారు.

# నవంబర్ 13 వయనాడ్ పార్లమెంటరీ ఉపఎన్నికకు ప్రియాంక గాంధీ నామినేషన్

మొదటి పేజీ తరువాయి

అయితే ఉత్తరాది రాష్ట్రంలో పార్టీని పునరుద్ధరించాలని కోరుకున్నందున ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ పార్లమెంటరీ స్థానాన్ని హౌస్‌లో నిలబెట్టుకోవడానికి రాహుల్ దానిని వదులుకున్నారు.

గాంధీ కుటుంబంతో వాయనాడ్ ఓటర్లకు ఉన్న భావోద్వేగ అనుబంధం మరియు 2026 కేరళ అసెంబ్లీ ఎన్నికలకు ముందు దాని ప్రయోజనం కారణంగా రాహుల్ స్థానంలో ప్రియాంక పేరు పెట్టారు. లోక్‌సభలో అలప్పుజా స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎఐసిసి సంస్థ ఇన్‌ఛార్జ్ కెసి వేణుగోపాల్ కీలక పోటీని వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్న వాస్తవాన్ని బట్టి వయనాడ్ ఉపఎన్నికకు కాంగ్రెస్ అత్యంత ప్రాధాన్యతనిస్తోంది.

వేణుగోపాల్ మరియు కేరళ ఏఐసిసి ఇన్‌ఛార్జ్ దీపా దాస్‌మున్షీ నేతృత్వంలో, కాంగ్రెస్ సెప్టెంబర్ 25న ఆ ప్రాంతంలో స్థానిక నాయకులతో సమావేశాలు నిర్వహించడం ద్వారా వయనాడ్ లోక్‌సభ ఉపఎన్నికకు సన్నాహాలు ప్రారంభించింది, ఆ తర్వాత అండూర్ మరియు తిరువంబాడి అసెంబ్లీ నియోజకవర్గాల్లో అక్టోబర్ 3న సమావేశాలు నిర్వహించింది. .అక్టోబర్ 17న కోజికోడ్‌లోని ముక్కమ్‌లో ప్రియాంకకు భారీ మెజార్టీని కట్టబెట్టేందుకు వేణుగోపాల్ అధ్యక్షతన యుడిఎఫ్ నేతల సమావేశం జరిగింది.

“వయనాడ్ కాంగ్రెస్‌తో లోతైన అనుబంధాన్ని కలిగి ఉన్న ప్రత్యేక ప్రదేశం. పార్లమెంటులో తమ గొంతుకగా ప్రియాంక గాంధీని ఎన్నుకునేందుకు ప్రజలు ఉత్సాహం చూపుతున్నారు. రాష్ట్రంలో కొత్త అధ్యాయం ఆవిష్కృతం కానుంది. ప్రియాంక గాంధీ లోక్‌సభలో మన వాణిగా అడుగులు వేయడానికి సిద్ధంగా ఉన్నారు, మా హక్కుల కోసం పోరాడటానికి మరియు మా ఆందోళనలను పరిష్కరించడానికి అండగా నిలిచారు. ఆమెతో, మా ఆకాంక్షలు గట్టిగా మరియు స్పష్టంగా వినిపిస్తాయి. మనం ఏకమై రాహుల్ గాంధీకి ఎప్పటి నుంచో అందించిన అదే సానుభూతిని, మద్దతును ఆమెకు అందిద్దాం. కలిసి వాయనాడ్‌కు ఉజ్వల భవిష్యత్తు కోసం కృషి చేద్దాం' అని కేరళ ఇన్‌చార్జ్ సెక్రటరీ మన్సూర్ అలీ ఖాన్ అన్నారు.

తన సోదరికి మద్దతు ఇవ్వాలని కోరుతూ జూన్ 24న తన మాజీ నియోజకవర్గం ఓటర్లకు భావోద్వేగంతో లేఖ రాసిన రాహుల్‌తో వాయనాడ్ ప్రజలకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. తాను రాయ్‌బరేలీని ఎంచుకున్నప్పటికీ, వాయనాడ్ ప్రజల కోసం తన తలుపులు ఎప్పుడూ తెరిచి ఉంటాయని రాహుల్ గాంధీ చెప్పారని అన్నారు.ఈ ఉప ఎన్నికల్లో ప్రియాంకపై సీపీఐ నేత సత్యం మొకేరిని అధికార ఎల్‌డీఎఫ్ రంగంలోకి దింపింది. ప్రధాన లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ గాంధీ 3.6 లక్షల ఓట్ల తేడాతో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి అన్నీ రాజాపై విజయం సాధించారు. బీజేపీ కేరళ అధ్యక్షుడు కే సురేంద్రన్ 1.41 లక్షల ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థి పీపీ సునీర్‌పై రాహుల్ రికార్డు తేడాతో విజయం సాధించారు.

# యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి అదానీ ఫౌండేషన్ రూ.100 కోట్ల విరాళం - సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 18(భారత్ సమాచార్)తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి అదానీ గ్రూప్ భారీ విరాళం ప్రకటించింది. అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ హైదరాబాద్‌లో సీఎం రేవంత్?ను కలిసి రూ.100 కోట్ల చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఎస్ శాంతి కుమారి, దానకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర యువతకు నైపుణ్యాలు నేర్పించడం కోసం రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలోని బేగరికంచెలో స్కిల్ యూనివర్సిటీ నిర్మాణానికి సీఎం ఇటీవల శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. స్కిల్ యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ ఛైర్మన్‌గా ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రాను ప్రభుత్వం నియమించింది. స్కిల్ యూనివర్సిటీ ద్వారా 17 రకాల కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. ఏటా లక్షమందికి శిక్షణ ఇచ్చేలా స్కిల్?యూనివర్సిటీని విస్తరించనున్నారు. బేగరికంచెలో భవనం పూర్తయ్యే వరకు గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా భవనంలో స్కిల్?యూవర్సిటీ శిక్షణ ఇస్తుంది.స్కిల్ యూనివర్సిటీని దేశానికే ఆదర్శం అని అన్నారు తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం సంకల్పించింది. ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, సంస్థలు ఇందులో భాగమై యువతకు ఉపాధి దొరికేలా నైపుణ్యాల కోసం సహాయం చేయాలని సీఎం రేవంత్ తెలిపారు. ప్రభుత్వం తరుపున 150 ఎకరాల భూమితో పాటు రూ.100 కోట్ల నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు.200 ఎకరాల్లో స్పోర్ట్స్ యూనిర్శిటీ : యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి పెడుతుంది. దాదాపు 200 ఎకరాల్లో స్పోర్ట్స్ యూనివర్సిటీ నెలకొల్పి, 2028 ఒలింపిక్స్‌లో ఇండియాకు గోల్డ్ మెడల్ తీసుకురావాలనే లక్ష్యంతో క్రీడాకారులకు శిక్షణను అందిస్తామని తెలిపారు. ఆ యూనివర్సిటీ అభివృద్ధిలో పారిశ్రామికవేత్తలు పాలుపంచుకోవాలని సీఎం తెలిపారు. ప్రభుత్వానికి నిధులు ఇవ్వడంలో ఎలాంటి ఇబ్బంది లేదని రూ.3 లక్షల కోట్ల బడ్జెట్లో రూ.1000 కోట్లు ఖర్చు అయినా భరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

## ప్రభుత్వ ఉద్యోగం వచ్చినా చేరడం లేదు.. ఏమిటీ పరిణామం.. ఎందుకీ దుస్థితి?

హైదరాబాద్, అక్టోబరు 18,సర్కార్ ఉద్యోగం కోసం గ్రామీణ ప్రాంత అభ్యర్థులు సిటీకి వచ్చి మరీ కష్టపడుతుంటారు. ఏళ్లుగా ఖర్చులు చేస్తూ.. నిద్రాహారాలు మాని కష్టపడి చదువుతారు. అయితే.. ప్రభుత్వ కొలువు దక్కినా కొందరు గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగం చేసేందుకు అభ్యర్థులు అంతగా ఆసక్తి చూపడం లేదు. దేశంలో ప్రభుత్వ ఉద్యోగం కోసం లక్షలాది యువత ఎదురుచూస్తూనే ఉంది. డిమాండుకు అనుగుణంగా ప్రభుత్వాలు ఉద్యోగాలు కల్పించకపోవడంతో నానాటికీ నిరుద్యోగం పెరుగుతూనే ఉంది. అయితే.. ఇక్కడ మాత్రం వింత పరిస్థితి కనిపించింది. ప్రభుత్వ ఉద్యోగం వచ్చినప్పటికీ జాయిన్ కాకుండా కొంత మంది దూరంగా ఉండిపోయారు. అది అక్కడో ఇక్కడో కాదు.. తెలంగాణ రాష్ట్రంలోనే కనిపించిన పరిస్థితి. ఉద్యోగానికి ఎంపికై కూడా పదుల సంఖ్యలో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు రాకపోవడంపై ఆశ్చర్యం నెలకొంది.సర్కార్ ఉద్యోగం కోసం గ్రామీణ ప్రాంత అభ్యర్థులు సిటీకి వచ్చి మరీ కష్టపడుతుంటారు. ఏళ్లుగా ఖర్చులు చేస్తూ.. నిద్రాహారాలు మాని కష్టపడి చదువుతారు. అయితే.. ప్రభుత్వ కొలువు దక్కినా కొందరు గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగం చేసేందుకు అభ్యర్థులు అంతగా ఆసక్తి చూపడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో చేయడం ఇష్టం లేకనో.. ఆ కొలువులు లేకనో కానీ నియామక పత్రాలు అందుకున్న చాలా మంది ఇప్పటికీ జాయిన్ కాకపోవడం ఆందోళన కలిగించే అంశం.టీజీపీఎస్సీ ద్వారా రాష్ట్ర నీటి పారుదల శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ)ల భర్తీ కోసం నోటిఫికేషన్ ఇచ్చారు. అందులో భాగంగా మొత్తంగా 687 మంది ఎంపికయ్యారు. 674 మంది మాత్రమే సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. వారంతా నియామకపత్రాలు అందుకున్నారు. మిగిలిన 13 మంది మాత్రం సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరవ్వలేదు. నియామకపత్రాలు అందుకున్న వారు ఈనెల 25 నాటికి పోస్టింగ్ వచ్చిన చోట రిపోర్టింగ్ చేయాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు కేవలం 310 మంది మాత్రమే రిపోర్టు చేశారు. గత నెల 26న నియామక పత్రాలు అందజేయగా.. రిపోర్టు చేయడానికి 8 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. యువ ఇంజినీర్లకు తొలి పోస్టింగును గ్రామీణ ప్రాంతాల్లోని ఇస్తామని, ఎలాంటి ఒత్తిళ్లు తీసుకురావద్దని రాష్ట్ర నీటిపారుల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పోస్టింగ్ ఇచ్చే సమయంలో చెప్పారు. అన్ని రకాల సదుపాయాలు ఉంటాయని భరోసా ఇచ్చారు.ఇక. హైదరాబాద్ చీఫ్ ఇంజినీర్ పరిధిలో 10 మంది ఏఈఈలకు పోస్టింగ్ ఇస్తే ఇప్పటికీ 9 మంది రిపోర్టు చేశారు. మహబూబ్‌నగర్ సీఈకి 48 మందిని కేటాయిస్తే కేవలం 8 మంది రిపోర్టు చేశారు.

# అణు భౌతికశాస్త్ర పితామహుడు

ఎర్నెస్ట్ రూథర్‌ఫోర్డ్ (ఆగస్టు 30 1871 – అక్టోబరు 19 1937) న్యూజీలాండ్ కు చెందిన ఒక రసాయన శాస్త్రజ్ఞుడు. ఆయనకు అణు భౌతిక శాస్త్ర పితామహుడు అనే బిరుదు గలదు. రసాయన శాస్త్రంలో నోబెల్ బహుమతి (1908) పొందాడు. అణువులలో శక్తితో కూడిన కేంద్రకం వుంటుందని కనిపెట్టాడు. పరమాణువులో ఎలక్ట్రాన్, ప్రోటాన్, న్యూట్రాన్ అనే మూడు ముఖ్యమైన మూలకణాలున్నాయి. ఈ కణాలు పరమాణువులో ఏ విధంగా అమరి ఉన్నాయో తెలియ జెప్పేదే పరమాణు నిర్మాణం. దీనికి సంబంధించి శాస్త్రవేత్తలు ఎన్నో నమూనాలను ప్రవేశ పెట్టారు. అందులో రూథర్ ఫర్డ్ నమూనా ఒకటి. తను చేసిన ఖ-కణ పరిక్షేపణ ప్రయోగ పరిశీలనల ఆధారంగా ఈ నమూనాని ప్రతిపాదించాడు. అణువు యొక్క రూథర్‌ఫోర్డ్ నమూనా (లేదాగ్రహ మండల నమూనా, ఇదే సిద్ధాంతం ఆ తరువాత బోర్ నమూనా లేదా కక్ష్యా నమూనాగా ఏర్పడడానికి దోహద పడింది) ను ప్రతిపాదించాడు. ఆయన రూథర్‌ఫోర్డ్ ఖ-కణ పరిక్షేపణ ప్రయోగాన్ని బంగారు రేకు గుండా ఖ-కణ పరిక్షేపణ ప్రయోగంచేసి కెంద్రకం యొక్క ఉనికిని కనిపెట్టాడు. 1908లో రసాయనిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది. న్యూజిలాండ్ లోని నెల్సన్ లో 1871 ఆగస్టు 30న జన్మించిన రూథర్‌ఫర్డ్ కు చిన్నతనం లోనే సైన్స్ పట్ల అభిరుచి కలిగింది. పదేళ్లకే ఎలిమెంటరీ ఫిజిక్స్ పుస్తకాన్ని క్షుణ్ణంగా చదివేశాడు. న్యూజిలాండ్ విశ్వ విద్యాలయంలో స్కాలర్‌షిప్‌తో చేరిన అతడు బీఏ, ఎమ్ఏ, బీఎస్సీ డిగ్రీలు సాధించాడు. ఇంగ్లండ్ లోని కేంబ్రిడ్జి విశ్వ విద్యాలయంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేస్తూనే అత్యంత వేగంగా ప్రయాణించే విద్యుదయ స్కాంత తరంగాలను కనిపెట్టి ప్రపంచ రికార్డు సాధించాడు. ఇరవై ఏడేళ్ల వయసులోనే కెనడా లోని మెగిల్ విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్‌గా చేరి పరిశోధనల్లో నిమగ్న మయ్యాడు. అక్కడే యురేనియం, థోరియంలాంటి రేడియోధార్మిక పదార్థాలు వెలువరించే ఆల్ఫా, బీటా వికిరణాలను ఆవిష్కరించాడు. రేడియో ధార్మిక విఘటనం నియమాలను ప్రతిపాదించాడు. ఒక రేడియో ధార్మిక పదార్థంలో ఉండే సగం పరమాణువులు విఘటనం చెందడానికి పట్టే 'అర్థ జీవిత కాలం' ను నిర్వచించాడు. ఈ సూత్రం ప్రకారం రేడియో డేటింగ్ పద్ధతి ద్వారక్వ భూమి వయస్సును కూడా కనుగొనవచ్చని చెప్పాడు. అలాగే కృత్రిమ మూలకాల పరివర్తన ద్వారా నైట్రోజన్‌ను, ఆక్సిజన్‌గా మార్చవచ్చని తెలిపాడు. ఈ పరిశోధనలకు 1908లో నోబెల్ బహుమతి అందుకున్నాడు. కెనడా నుంచి ఇంగ్లండ్ తిరిగి వచ్చిన తర్వాత పలుచటి బంగారు రేకుపై ధనావేశమున్న ఆల్ఫా కిరణాలను ప్రసరింప చేసినప్పుడు 20000 కణాలలో ఒకటి వెనక్కి తిరిగి రావడాన్ని గమనించాడు. అందుకు కారణం పరమాణువులో ధనావేశమున్న కేంద్రకం ఉండటం కారణంగా కేంద్రకంలో ఉండే ప్రోటాన్లు వాటిని వికర్షించడమేనని కనుగొన్నాడు. సూర్యుడి చుట్టూ గ్రహాలు తిరుగుతున్నట్టే, పరమాణువు ల్లోని కేంద్రకం చుట్టూ ఎలక్ట్రాన్లు తిరుగుతూ ఉంటాయని ప్రతిపాదించాడు. ఇదే రూథర్‌ఫర్డ్ పరమాణు నమూనాగా పేరొందింది. దీనినే గ్రహమండల నమూనా అంటారు. ఆ తర్వాత కేంద్రకంలో ప్రోటాన్లతో పాటు న్యూట్రాన్లు ఉంటాయని ఊహించాడు. రసాయన చర్యలతో ఒక మూలకాన్ని వేరొక మూలకంగా మార్చలేం. కానీ కేంద్రక చర్యలతో ఒక మూలకాన్ని మరొక మూలకంగా మార్చవచ్చు. స్థిరమైన మూలక కేంద్రకాలను ఖ – కణం లేదా ప్రోటాన్‌తో తాడించడం వల్ల వాటిని వేరొక మూలకాలుగా మార్చొచ్చు. ఈ ప్రక్రియను కృత్రిమ పరివర్తనం అంటారు. రూథర్‌ఫర్డ్ మొదటిసారిగా నత్రజనిని ఆక్సిజన్‌గా మార్చాడు. ఆ విధంగా ఏర్పడిన మూలకాలు కొన్ని రేడియో ధార్మికతను ప్రదర్శిస్తాయి. వాటిని రేడియో ఐసోటోపులు అంటారు. వాటిని మనం వైద్య రంగంలో, వ్యవసాయ రంగంలో, పరిశ్రమల్లో ఉపయో గిస్తున్నాం .ఆయన శిష్యుల్లో చాలా మంది నోబెల్ బహుమతులు సాధించడం విశేషం. అనేక అవార్డులు సాధించిన ఆయన గౌరవార్థం 104 అణుసంఖ్య ఉన్న మూలకానికి రూథర్ ఫోర్డియం అని పేరు పెట్టారు.

# జర్నలిస్టులకు ఆదర్శం విద్వాన్ విశ్వం

రాజకీయం, సాహిత్యం, పత్రికా రచనల మూర్తిమంతం విద్వాన్ విశ్వం. తరిమెల నాగిరెడ్డి, నీలం రాజశేఖరరెడ్డి వంటి వామపక్ష రాజకీయ వాదుల సాహచర్యంతో కమ్యూనిస్టుగా తన రాజకీయ జీవితం ఆరంభించిన స్వాతంత్ర్య సమరయోధుడు విశ్వం. సంస్కృతం, ఆంగ్లం, తెలుగు భాషల్లో పండితులు. చిలుకూరి నారాయణరావు వంటి భాషా శాస్త్రజ్ఞుల శిష్యులుగా మద్రాసులో విద్వాన్ విశ్వం అయ్యారు. ఉన్నత విద్యాభ్యాసం కోసం బెనారస్ వెళ్ళిన విశ్వానికి మదన మోహన మాలవ్యా లాంటి ప్రముఖుల ప్రశంసలకు పాత్రుడైనాడు. బళ్ళారిలో "ఆకాశవాణి" రహస్య పత్రికను నడిపినందుకు జైలు శిక్ష అనుభవించారు. మీజాన్, ప్రజాశక్తి, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి పత్రికల్లో వివిధ హోదాల్లో పనిచేశాడు.విద్వాన్ విశ్వం (అక్టోబర్ 21, 1915 –అక్టోబర్ 19, 1987) 1915, అక్టోబర్ 21న అనంతపురం జిల్లాలో తరిమెల గ్రామంలో ఒక విశ్వ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. ఆయన పూర్తి పేరు మీసరగండ విశ్వరూపాచారి. విశ్వం స్వగ్రామంలో చిన్నతనంలో రామాయణం శంకర శాస్త్రి వద్ద సంస్కృతం నేర్చుకున్నాడు. సంప్రదాయ పద్ధతిలో కర్నూలు, ప్రొద్దుటూరులలో సంస్కృత కావ్య నాటక అలంకారాలను, తర్క శాస్త్రాన్ని ఆభ్యసించాడు. మద్రాసు విశ్వ విద్యాలయం నుండి సంస్కృతం లో, ఆంధ్రంలోనూ విద్వాన్ పట్టా పుచ్చుకున్నాడు. అనంతపురంలో చిలుకూరు నారాయణ రావు వద్ద శిష్యరికం చేశాడు. కాశీ విశ్వ విద్యాలయంలో పరిశోధన చేస్తూ అనారోగ్యం వలన పూర్తి చేయలేక పోయాడు. కాశీ నుండి అనంతపురం తిరిగి రాగానే తరిమెల నాగిరెడ్డితో కలిసి రాజకీయ కార్యకలాపాలు ప్రారంభించాడు. ప్రజలను చైతన్య పరచటానికి గ్రంథ ప్రచురణ అవసరమని భావించి నవ్య సాహిత్యమాల అనే ప్రచురణ సంస్థ ఏర్పాటు చేసి నవ్యసాహితి అనే పత్రికకు సంపాదకత్వం వహించాడు. ఫాసిజం మొదలైన అంశాలపై పుస్తకాలను ప్రచురించాడు. దానితో బ్రిటీషు ప్రభుత్వం రాజద్రోహం క్రింద తరిమెల నాగిరెడ్డిని, విద్వాన్ విశాన్ని అరెస్టు చేసి మొదట బళ్ళారిలోని అల్లీపూర్ జైల్లోనూ ఆ తర్వాత తిరుచిరాపల్లి జైలు లోనూ నిర్బందించింది. తిరుచిరాపల్లి జైలులో విశ్వం బెజవాడ గోపాలరెడ్డి వద్ద బెంగాలీ నేర్చుకున్నాడు. ఈ జైలులో రాజాజీ, టంగుటూరి ప్రకాశం వంటి నాయకుల సాహచర్యం లభించింది. ఈయన అనంతపురం జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా, రాయలసీమ కాంగ్రెస్ కమిటీ కార్యాలయ కార్యదర్శిగా, అనంతపురం జిల్లా జాతీయ సభకు, జిల్లా లోక జన సంఘానికి, మండల క్షామ నివారణ సభకు, జిల్లా ఆంధ్ర మహాసభకు ప్రధాన కార్యదర్శిగా,జిల్లా రైతు మహాసభకు ఉపాధ్యక్షుడుగా పనిచేశాడు. ఉద్యమం, ఉపన్యాసం మాత్రమే కాకుండా మరింత లోతుగా రాజకీయాలు శాస్త్ర పద్ధతిలో వివరించడానికి పత్రికారంగం వైపు దృష్టి సారించాడు. అడవి బాపిరాజు ఆహ్వానించడంతో మీజాన్ పత్రికలో 1945లో అసిస్టెంట్ ఎడిటర్‌గా చేరి కొంతకాలం పనిచేశాడు. తరువాత విజయవాడలో ప్రజాశక్తి దినపత్రికలో అసిస్టెంట్ ఎడిటర్‌గా సుమారు మూడు సంవత్సరాలు పనిచేశాడు. "మీజాన్" పత్రికలో రచనా వ్యాసంగం, "ప్రజాశక్తి"లో సంపాదకత్వం పాండితీ భాషలోనే సులభ శైలిని సాధించ గలిగినా, పరిపాలనా యంత్రాంగపు నిర్బంధాలకు గురయ్యాడు. తర్వాత మద్రాసుకు తరలి వెళ్ళి అక్కడ బాల భారత్ విద్యాలయంలో సంపాదకుడిగా కొన్నాళ్ళు పనిచేశాడు. 1952 ఆగష్టు 15న ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక ప్రారంభమైనపుడు దానిలో ఎడిటర్ ఇన్‌చార్జ్‌గా చేరి 1959 వరకు పనిచేశాడు. 1959లో ఆంధ్రపత్రిక దినపత్రికలో అసిస్టెంట్ ఎడిటర్‌గా కొంతకాలం పనిచేసి 1960లో విజయవాడకు వచ్చి ఆంధ్రజ్యోతి దినపత్రికలో అసోసియేట్ ఎడిటర్‌గా పని చేశాడు. మళ్ళీ 1963లో ఆంధ్రప్రభ దినపత్రికకు అసోసియేట్ ఎడిటర్ చేరాడు. 1967లో ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికకు సంపాదకుడిగా మారాడు. ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో పదవీ విరమణ చేసిన తరువాత 1981నుండి తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణల విభాగానికి ప్రధాన సంపాదకునిగా వ్యవహరించాడు. ఈ సమయంలో విశ్వం కథా సరిత్సాగరాన్ని 12 సంపుటాలుగా తెనుగించాడు. "చందమామ"లో ద్విపద కావ్యం రూపంలో వ్రాసిన పంచతంత్ర కథలను బాపు బొమ్మలతో తి.తి.దే.ప్రచురణగా వెలువరించాడు. బ్రహ్మసూత్రాలు శంకరభాష్యం నాలుగు సంపుటాలను, అధర్వణ వేదాన్ని అనువాదం చేసి ప్రచురించాడు. శ్రీసాధన పత్రిక 1938–1939లో "విశ్వభావన"బీ ఆంధ్రప్రభ వారపత్రిక 1952–1959లో తెలుపు – నలుపుబీ ఆంధ్రపత్రిక దినపత్రిక 1958–1959లో "అవీ – ఇవీ"బీ ఆంధ్రజ్యోతి దినపత్రిక 1960–1962లో "ఇవ్వాళ"బీ ఆంధ్రజ్యోతి దినపత్రికలో టీకా–టిప్పణిబీ ఆంధ్రప్రభ దినపత్రిక 1962–1966, ఆంధ్రప్రభ వారపత్రిక 1967–1987లో మాణిక్య వీణ తదితర శీర్షికలను నిర్వహించారు. 1987 అక్టోబర్ 19వతేదీన తుది శ్వాస వదిలాడు. పత్రికారంగంలో ఉన్నత విలువలు నిలబెట్టిన విశిష్ట పాత్రికేయులుగా నేటి తరం పాత్రికేయులకు విద్వాన్ విశ్వం ఆదర్శప్రాయుడు. విశ్వం గురించి ప్రముఖుల అభిప్రాయాలు దాశరథి...మనస్సు విప్పి మాట్లాడి సాటి రచయితలను తన వాళ్ళుగా భావించి సాటివారి శ్రేయస్సుని కోరేవారు అరుదు. ఆ సద్గుణం మేము విశ్వంగారిలో చూశాము. డాక్టర్ సి. నా. రె...కన్నీటి సుడులెన్నో కూర్చి 'పెన్నేటి పాట'గా తీర్చి రాళ్ళలో మేల్కొల్పినావు రసదిగ్ధ భావామృతార్చి 'మాణిక్యవీణ'పై నీవు మత్యంగుళులు సాచినావు పదునైన లోకవృత్తాలు అదునెరిగి పలికించినావు! మిక్కిలినేని....విశ్వం నిండుకుండ. తొణకరు, బెణకరు. భావాల్లో అతివాది. మాటల్లో మితవాది. నిగర్వి. మందహాసంతో అందర్నీ హుందాగా పలకరించే విశాలతత్వం. మెరమెచ్చుల కోసం ఎవర్నీ ఆకాశానికెత్తి పొగడరు. తాను నమ్మిన సత్యాన్ని నమ్రతగా అందలమెక్కిస్తారు

# గ్రూప్–1 పరీక్షపై తీర్పు జాప్యం

# అభ్యర్థులకు అన్యాయం!

గ్రూప్–1 అనేది రాష్ట్ర స్థాయిలో ఒక ఉన్నత స్థాయి ఉద్యోగం. ఈ ఉద్యోగాన్ని సాధించాలని నిరుద్యోగి నుంచి చిరుద్యోగి వరకు కలలు కంటారు. స్వరాష్ట్రంలో ఈ పరీక్ష రెండుసార్లు రద్దయి ఈ ఏడాది ఫిబ్రవరిలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పాత గ్రూప్–1 నోటిఫికేషన్ రద్దు చేసి కొత్తగా జారీ చేశారు. అనంతరం జూన్ 9, 2024న ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించారు. అయితే, తదుపరి ఈ పరీక్ష కీ విషయంలో అనేక తప్పులు దొర్లాయి. వీటినీ టీజీపీఎస్సీ సరిచేయకుండా మెయిన్స్ రాసే అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. దీంతో చాలామంది అభ్యర్థులు అర్హత కోల్పోయారు. ఈ నేపథ్యంలో ప్రిలిమ్స్ పరీక్షను సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టులో పిటిషన్లు దాఖలైనవి. వీటిపై గత నెల రోజులుగా అటు అభ్యర్థులు... ఇటు టీజీపీఎస్సీ న్యాయవాది వాదనలు వినిపించారు. ఈ సుదీర్ఘ వాదన తర్వాత జడ్జి గారు తీర్పును రిజర్వులో పెట్టి ఈ నెల 15వ తేదీన కేసును కొట్టివేసారు. న్యాయవ్యవస్థలో జరిగిన ఈ జాప్యం వల్ల గ్రూప్–1 ప్రిలిమ్స్ క్వాలిఫై అయినా క్వాలిఫై కానీ అభ్యర్థులు గందరగోళంలో పడ్డారు. అభ్యర్థుల పక్షాన న్యాయం జరగవచ్చని ఎంతోమంది ఆశపడ్డారు. న్యాయం గెలిస్తే మరికొంత మందికి మెయిన్స్ రాసే అవకాశం లభించేది. కోర్టు కేసు నేపథ్యంలో క్వాలిఫై అయిన అభ్యర్థులు సైతం చదువును పక్కన పెట్టి పోరాడారు. కోర్టు తీర్పు అభ్యర్థుల పట్ల సానుకూలంగా రావచ్చని ఎంతోమంది భావించారు. వాస్తవంగా అభ్యర్థుల పక్షాన న్యాయం ఉందనేది న్యాయ నిపుణుల వాదన. టీజీపీఎస్సీ గ్రూపు –1 ప్రిలిమ్స్ పరీక్షలో తప్పుడు కీ విషయంలో తెలుగు అకాడమీని రిఫరెన్స్‌గా చూడలేమని, ఇవి పరిశోధన లేకుండా రాసిన గ్రంథాలని అఫిడవిట్ ఇవ్వడమే దీనికి నిదర్శనం. ఈ నేపథ్యంలో కనీసం గౌరవ హైకోర్టు అయినా జోక్యం చేసుకుని తెలుగు అకాడమీ పుస్తకాల ప్రామాణికతను నిర్ధారించి, అభ్యర్థుల పక్షాన నిలబడుతుందని అనుకున్నారు.

తప్పుడు సమాధానాల విషయంలో కోర్టు తుది తీర్పులో మరోసారి నిపుణుల కమిటీకి సిఫార్సు చేస్తుందని మెజార్టీ అభ్యర్థులు భావించారు. మరోవైపు ప్రధాన సమస్యగా ఉన్న రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను ఉల్లంఘించే జీవో 29 పై ఊసే లేదు. ఎస్టీ రిజర్వేషన్, స్పోర్ట్స్ కోట, ఈడబ్ల్యూఎస్ వంటి కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. కానీ వీటినీ కాదని కోర్టు తీర్పు ఏకపక్షంగా ఉండడంతో గ్రూప్–1 ఆశావాహుల్లో అసంతృప్త జ్వాలలు రగులుతున్నాయి. ఇప్పటికే గ్రూప్ –1 అభ్యర్థులు అశోక్ నగర్, ఆర్టీసీ క్రాస్ రోడ్ దగ్గర పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలకు దిగారు. తెలంగాణ గ్రూపు –1 పై జరుగుతున్న అన్యాయాన్ని తెలియజేస్తూ అభ్యర్థులు భారత ప్రధానికి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖలు కూడా రాశారు. వాస్తవంగా గ్రూప్–1 ప్రిలిమ్స్ కీ విషయంలో అభ్యర్థులు పలు మార్లు టీజీపీఎస్సీకీ వినతి పత్రం ఇచ్చారు. కానీ బోర్డు ఆ దిశలో ఆలోచించకుండా ముందుకెళ్లడంతో అభ్యర్థులు న్యాయం కోసం కోర్టు చుట్టూ తిరిగారు. కోర్టు సుదీర్ఘ వాదనలు విని మెయిన్స్ ఎగ్జామ్‌కు ముందు కేసును కొట్టివేసింది. న్యాయమైన ఈ కేసులో ప్రతికూల తీర్పు నిజాయితీ గల అభ్యర్థులకు పాలిట శాపంగా మారింది. ఇదే తీర్పును నెల రోజులు కిందటే ఇచ్చుంటే అభ్యర్థుల గందరగోళానికి తెరపడేది. చదువుపైన దృష్టి పెట్టేవారు. న్యాయంలో జాప్యం వలన న్యాయం తిరస్కరణ అనే వాస్తవం ఈ కేసులో స్పష్టంగా కనబడుతుంది. హైకోర్టు తన తీర్పులో విద్యా సంబంధిత విషయాల్లో నిపుణుల అభిప్రాయాలే కీలకంగా ఉంటాయని, కోర్టులు జోక్యం చేసుకోవడానికి అవకాశం ఉండదని తేల్చి చెప్పింది. టీజీపీఎస్సీ నియమించిన నిపుణుల కమిటీ జవాబుల పరిశీలన సరిగాలేదని అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. అలాంటప్పుడు కోర్టు మరొక నిపుణుల కమిటీకి సిఫార్సు చేసే అవకాశం లేకపోలేదు. దీంతో మరింత పారదర్శకత, స్పష్టత రావచ్చు కదా. గతంలో పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు విషయంలో కోర్టు ఇలా చేసిన సందర్భాలున్నాయి. అయినా గ్రూపు –1 పై ఇప్పటికి చాలా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని పరిష్కరించకుండా టీజీపీఎస్సీ మెయిన్స్ పరీక్ష నిర్వహిస్తే ఎంతోమంది ఆశావహులు అర్హత కోల్పోవచ్చు. మరోవైపు ఈ కేసు రేపు ఉన్నత న్యాయస్థానంలో నిలుస్తుందా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. నిలిస్తే మాత్రం గ్రూప్–1 మెయిన్స్ 2.%
ా% కూడా రాయాల్సి వస్తుంది. గతంలో 2011 గ్రూప్ –1 ప్రిలిమ్స్ కీ విషయంలో సుప్రీంకోర్టు జోక్యంతో మెయిన్స్ పరీక్షలు ఆరు సంవత్సరాల తర్వాత రద్దయి, మళ్లీ 2016లో నిర్వహించారు. ఇప్పుడు ఒకవైపు టీజీపీఎస్సీ మెయిన్స్ పరీక్షకు ఏర్పాట్లు, మరోవైపు అభ్యర్థుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ సంకట పరిస్థితుల్లో అభ్యర్థులు పరీక్ష రాయడం కష్టంగా మారింది. కావున ఇప్పటికైనా ప్రభుత్వం ,టీజీపీఎస్సీ పునరాలోచన చేసి కొన్ని నెలల పాటు పరీక్ష వాయిదా వేసి గ్రూప్–1 పై ఉన్న సమస్యలన్నీ పరిష్కరించాలి. బలహీన వర్గాల రిజర్వేషన్లకు గండి కొట్టే జీవో 29 రద్దు చేయాలి. ప్రిలిమ్స్ కీ లోని తప్పులను సరిదిద్ది మరోసారి అభ్యర్థుల జాబితా ప్రకటించాలి. ఇటీవల ప్రభుత్వం రెండు నెలల గడువుతో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కమిటీ వేసింది. దీన్ని ప్రస్తుత గ్రూప్–1 నోటిఫికేషన్‌లో అమలు చేయాలి. అప్పుడే రాజ్యాంగం కల్పించిన సామాజిక సమానత్వం సహకారమవుతుంది.

## సెకండ్ లెవల్ లీడర్లపై దృష్టి

కడప, అక్టోబరు 18, సజ్జలకు పోలీసులు నోటీసులివ్వడంతో జగన్ అలర్ట్ అయ్యారా? కీలక నేతలకు ఇబ్బందులు తప్పవని ముందుగానే అధినేత ఊహించారా? సీనియర్లను పక్కనపెట్టి కొత్తవారికి ఛాన్స్ ఇస్తున్నారా? రాబోయే ఐదేళ్లు పార్టీ నడిపేందుకు ఈ విధంగా స్కెచ్ వేశారా? అందుకోసమే అనుబంధ సంఘాలతో భేటీ అవుతున్నారా? అవుననే సమాధానం వస్తోంది.వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ మాటల్లో మార్పు వచ్చినట్టు పైకి కనిపిస్తోంది. కొద్దిరోజులపాటు నేతలకు, కేడర్‌కు దూరంగావున్న ఆయన, క్రమంగా యాక్టివ్ అవుతున్నట్లు కనిపిస్తోంది. ఏదో విధంగా నిత్యం వార్తల్లో ఉండేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతీ చిన్న విషయాన్ని అద్దంలో చూపించే ప్రయత్నం చేస్తున్నారు కూడా. నెగిటివ్‌ని అనుకూలంగా మలచుకునే ప్రయత్నం చేస్తున్నారాయన.గడిచిన వంద రోజులు ప్రశాంతంగా ఉన్న మాజీ సీఎం, టెన్షన్ పట్టుకున్నట్లు కనిపిస్తోంది. ఓ వైపు చంద్రబాబు సర్కార్ కేసులను సీఐడీకి ఇవ్వడం, మరోవైపు నేతలకు నోటీసులు తదితర పరిణామాలతో మాజీ సీఎం కలవరం పడుతున్నట్లు కనిపిస్తోంది. లేటెస్ట్‌గా గురువారం జిల్లా అధ్యక్షులు, అనుబంధ సంఘాల నేతలతో భేటీ అయ్యారు జగన్.వైసీపీ నేతలకు జగన్ పలు అంశాలపై కీలక దిశానిర్దేశం చేశారు. గ్రామస్థాయిలో కూడా నిర్మాణాత్మకంగా ఎలా ఉండాలనేది వివరించారు. పని తీరుపై పరిశీలన, మానిటరింగ్ ఉంటుందని గుర్తు చేశారు. గతంలో మాదిరిగా సోషల్ మీడియాలో నేతలంతా యాక్టివ్‌గా ఉండాలన్నది ప్రధాన ఉద్దేశం.జిల్లా అధ్యక్షుల పనితీరు ఆధారంగా ప్రమోషన్లు ఉంటాయని చెప్పకనే చెప్పారు జగన్. బాగా పని చేసేవారికీ రేటింగ్స్ ఇస్తామని, రిపోర్టుల ప్రకారం నిర్ణయాలు కూడా ఉంటాయని చెప్పకనే చెప్పేశారు. కష్టానికి తగిన ప్రతిఫలం ఉంటుందన్నది అధినేత మాట. ఈ సమావేశానికి సీనియర్ నేతలు సైతం హాజరయ్యారు.జగన్ వ్యవహారశైలిని కొందరు నేతలు క్షుణ్ణంగా గమనిస్తున్నారు. నాయకుడు అనేవాడు ప్రజల్లో నుంచి రావాలని గతంలో జగన్ పదే పదే చెప్పిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఈ సమావేశానికి ముందు జగన్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు టీడీపీకి చెందిన ఓ నేత. తూర్పు గోదావరి ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ముదునూరి మురళీకృష్ణంరాజు వైసీపీ కండువా కప్పుకున్నారు.

### ఆర్థిక ఇబ్బందులతో హోంగార్డ్ అత్మహత్య

హైదరాబాద్ ఉప్పల్ పోలిస్ స్టేషన్ పరిధి వెంకట్ రెడ్డి నగర్ లో నివాసం ఉండే హోం గార్డు వెంకట రమణయ్య(39) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పంజగుట్ట ఏసీపీ కార్యాలయంలో వెంకట రమణయ్య హోంగార్డుగా పనిచేస్తున్నాడు. కేసు నమోదు చేసిన పోలీసులు, బాడీని పోస్ట్ మార్టం కి పంపి, దర్యాప్తు చేస్తున్నారు...

## 3 రోజులు... 15 బెదిరింపు కాల్స్

ముంబై, అక్టోబరు 18, (న్యూస్ పల్స్)బాంబు పెట్టాం.. పేల్చిపారేస్తాం.. దమ్ముంటే కాపాడుకోండి..! అంటూ ఒక అజ్ఞాతవాసి నుంచి బెదిరింపు స్వరం. తీరాచూస్తే అంతా తూచ్. ఇదీ వరస. ఇంటర్నేషనల్, డొమెస్టిక్ ఫ్లైట్లన్న తేడా లేదు. ఉత్తుత్తి బెదిరింపులతో వేలాదిమంది ప్యాసింజర్లు బెంబేలెత్తిపోయారు. ప్రాణాలు గుప్పిట పట్టి ప్రయాణించాల్సిన పరిస్థితి. అటు.. ఏవియేషన్ యంత్రాంగానిక్కూడా చుక్కలు కనిపించాయి.గత మూడు రోజుల్లోనే మొత్తం 15 బాంబ్ థ్రెట్స్ నమోదయ్యాయి. అక్టోబర్ 16, బుధవారం.. ఈ ఒక్కరోజులోనే ఆరు విమానాలకు బాంబు బెదిరింపులొచ్చాయి. కాకపోతే అన్నీ ఫేకే..! అందరూ క్షేమం. మూడు ఇండిగో, రెండు స్పైస్‌జెట్.. ఒకటి ఆకాశ ఎయిర్.. మొత్తం ఆరు ప్లేన్లలో ప్రయాణికుల్ని బెంబేలెత్తించాయి బోగస్ ఫోన్‌కాల్స్.ఢిల్లీ నుంచి చికాగో వెళ్లాల్సిన ఎయిరిండియా విమానం.. అగంతకుల బెదిరింపు కారణంగా దారిమళ్లించాల్సి వచ్చింది. సీక్రెట్‌గా ఒక రిమోట్ ఎయిర్‌పోర్ట్‌లో దింపి.. అందులోని 200 మంది ప్రయాణికుల్ని కాపాడారు. వీళ్లను ఎయిర్‌లిఫ్ట్ చేయడం కోసం.. రాయల్ కెనడియన్ ఎయిర్‌ఫోర్స్‌కి చెందిన అఅ–330 యుద్ధ విమానాన్ని వాడారు.ఇటీవలే తిరుపతి విమానాశ్రయానికే బెదిరింపు లేఖ వచ్చింది. ఈ–మెయిల్ ద్వారా సీఐఎస్ఎఫ్ అధికార వెబ్‌సైట్‌కు పంపిన లేఖను గోప్యంగా ఉంచింది ఎయిర్‌పోర్టు అథారిటీ. పోలీసులకు ఫిర్యాదు చేసి, ఈ–మెయిల్ ఆధారంగా నిందితుడ్ని పట్టుకునే ప్రయత్నం జరుగుతోంది.ఒకవైపు ప్యాసింజర్లకు అసౌకర్యం.. మరోవైపు ఫ్లయిట్ షెడ్యూల్స్ మార్చాల్సి రావడం..! ఫేక్ కాల్స్‌తో ఈ హైరానా పడలేకున్నాం అంటూ ప్రైవేట్ ఎయిర్‌లైన్ సంస్థల నుంచి కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి పెరుగుతోంది. అందుకే.. మినిస్ట్రీ ఆఫ్ సివిల్ ఏవియేషన్.. ప్లస్ హోమ్ మినిస్ట్రీ.. కలిసి కూర్చుని.. హైలెవల్ మీటింగ్ పెట్టుకుని.. వాట్‌టు డూ.. వాట్‌నాట్ టూడూ అని చర్చించాయి. అగంతకుల్ని పసిగట్టి.. వాళ్లపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిసైడయ్యాయి.ఫేక్ గాళ్లందరికీ అడ్డా సోషల్ మీడియానే. ఎక్కువగా ట్వీట్ల ద్వారానే అగంతకులు ఓవరాక్షన్‌కు పాల్పడుతున్నట్టు తేలింది. వీలైతే వీళ్లను మళ్లీ విమానమెక్కనివ్వకుండా నో–ఫ్లై లిస్టులో చేర్చాలని, ఆర్థికంగా నష్టపోయిన విమానయాన సంస్థలకు వాళ్లతోనే పరిహారం ఇప్పించాలని.. ఐదేళ్ల జైలు శిక్ష వేయాలని ప్రపోజల్స్ వస్తున్నాయి. ఎయిర్‌క్రాఫ్ట్ చట్టం, 1934 సబార్డినేట్ చట్టాలకు సవరణలు చేసేందుకు కేంద్రంలోని ఉన్నత అధికార వర్గాలు తెలిపాయి. దీనికి సంబంధించి న్యాయనిపుణులతో మాట్లాడి లీగల్ ఒపీనియన్ తీసుకుంటోంది కేంద్ర సర్కార్. అటు.. వరుస బెదిరింపుల వెనక ఏదైనా విదేశీ హస్తం ఉందా అనే అనుమానాల్ని పరిశీలిస్తోంది కేంద్ర ప్రభుత్వం.

# ఏపీలో కొత్త పింఛన్లు... మార్గదర్శకాలు సిద్ధం!

తిరుమల, అక్టోబరు 18,కొత్త పింఛన్ల కోసం లక్షల మంది ఎదురుచూస్తున్నారు. గత కొన్నేళ్లుగా పింఛన్ల మంజూరు ప్రక్రియ నిలిచిపోయింది. అదే సమయంలో వైసీపీ హయాంలో అనర్హులకు ఇచ్చినట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ తరుణంలో కొత్త పింఛన్ల మంజూరు తో పాటు అనర్హుల పింఛన్లను తొలగించనున్నట్లు తెలుస్తోంది.ఏపీ ప్రభుత్వం సంక్షేమ పాలనకు ప్రాధాన్యం ఇస్తోంది. అందులో భాగంగా కీలక సంక్షేమ పథకాలను ప్రకటిస్తోంది. తాజాగా మరో నిర్ణయం తీసుకుంది. అర్హత ఉండి పెన్షన్ కోసం ఎదురుచూస్తున్న వారికి గుడ్ న్యూస్ చెప్పింది. వచ్చే జనవరి నుంచి కొత్త పింఛన్లు అందించాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలను సైతం అధికారులు సిద్ధం చేశారు. అయితే అదే సమయంలో అనార్హుల పెన్షన్లు కూడా తొలగించనున్నారు. వారికి పింఛన్లు రద్దు చేస్తూ.. అర్హత ఉన్నవారికి అమలు చేసే కసరత్తు చేస్తోంది ప్రభుత్వం. తాము అధికారంలోకి వస్తే పింఛన్ మొత్తాన్ని పెంచుతానని చంద్రబాబు హామీ ఇచ్చారు. అన్నట్టుగానే పింఛన్ మొత్తాన్ని నాలుగు వేల రూపాయలకు పెంచారు. ఏప్రిల్ నుంచి పాత బకాయిలతో సహా జూలైలో చెల్లించారు. అక్కడ నుంచి పెంచిన మొత్తాన్ని నెలనెలా అందిస్తూ వచ్చారు. ఇప్పుడు తాజాగా అర్హత ఉన్న వారికి పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం డిసైడ్ అయ్యింది. దీనికి ముహూర్తంగా జనవరిని నిర్ణయించింది. దీంతో వేలాదిమంది లబ్ధిదారులకు మేలు జరగనుంది. అదే సమయంలో అర్హత లేని వారి పింఛన్లు తొలగించనున్నారుకూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత జన్మభూమి కార్యక్రమాన్ని పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జనవరి నుంచి జన్మభూమి 2 ప్రారంభించాలని సీఎం చంద్రబాబు భావిస్తున్నారు. అదే సమయంలో గ్రామ సభల్లో కొత్త పింఛన్ల పంపిణీ మొదలు పెట్టాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. ఈ కొత్త పింఛన్ల పంపిణీకి సంబంధించి అధికారులు మార్గదర్శకాలు సిద్ధం చేస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వం అనర్హులకు సైతం పింఛన్లు మంజూరు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.గత నాలుగు నెలల టిడిపి కూటమి పాలనలో అనర్హుల పింఛన్ల అంశం తెరపైకి వచ్చింది. ఎక్కడికక్కడే ఫిర్యాదులు వెల్లువెత్తాయి. వాటన్నింటినీ పరిశీలించి తొలగించనున్నట్లు తెలుస్తోంది.వైసిపి ప్రభుత్వం కొత్త పెన్షన్ దరఖాస్తులను పక్కన పెట్టింది. తాము మరోసారి అధికారంలోకి వస్తే పింఛన్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చింది. అయితే అనూహ్యంగా ఆ పార్టీ ఓడిపోయింది. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చింది. కొత్త పింఛన్ల మంజూరు తో పాటు అనర్హుల ఏరివేత కోసం ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయనుంది. అధికారులు ఇచ్చిన నివేదికపై ఈ ఉప సంఘం అధ్యయనం చేయనుంది. ప్రభుత్వానికి సిఫార్సులు చేయనుంది. మొత్తానికి అయితే ఏపీలో పింఛన్ల పంపిణీ ప్రక్రియపై ప్రభుత్వం దృష్టి పెట్టడంతో.. దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

# పార్టీ ప్రక్షాళన పనిలో జగన్



విజయవాడ, అక్టోబరు 18, వైఎస్ఆర్‌సీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి పార్టీ ప్రక్షాళనలో భాగంగా కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత వరుసగా నేతలతో సమావేశం అవుతున్న ఆయన మార్పులు చేర్పులు చేస్తున్నారు. ఇప్పటికే పలు జిల్లాల్లో అధ్యక్షులను మార్చిన జగన్ ఇప్పుడు కోఆర్టినేటర్లను మార్చారు. సీనియర్లకు ఆ బాధ్యతలు అప్పగించారు. విజయసాయి రెడ్డికి మళ్లీ ఉత్తరాంధ్ర బాధ్యతలు అప్పగించారు. పార్టీ కీలక నేతలతో జగన్ వర్క్ షాప్ నిర్వహించారు. ఈ భేటీకి పార్టీ జిల్లా అధ్యక్షులు, అనుబంధ సంఘాల నేతలు హాజరయ్యారు. తాడేపల్లిలోని జగన్ నివాసంలో సాగిందీ సమావేశం. బూత్ లెవల్‌లో పార్టీ ప్రక్షాళనకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కేడర్‌ను మళ్లీ ఉత్సంగా కార్యక్రమాల్లో పాల్గొనేలా చేసేందుకు ప్రణాళిక రచించారు. ఇప్పటికే మంగళగిరి, రేపల్లె నియోజకవర్గాలపై సమీక్ష నిర్వహించి కొత్త ఇన్‌ఛార్జ్‌లను జగన్ నియమించారు. ఇకపై మిగతా నియోజకవర్గాలపై ఫోకస్ చేయాలని పార్టీ నేతలు కోరారు. దీనికి సంబంధించిన ప్రణాళికను కూడా విడుదల చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలను సెంట్రిక్‌గా చేసుకొని కోఆర్డినేటర్లను జగన్ నియమించారు. కొందరు సీనియర్ లీడర్‌కు రెండు జిల్లాలు మరికొందరికి మూడు జిల్లాల బాధ్యతలు అప్పగించారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలకు ఎంపీ మిథున్ రెడ్డి, ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు జిల్లాల బాధ్యతలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అప్పగించారు. ఆళ్ళ అయోధ్య రామిరెడ్డికి మాత్రమే ఒక్క ఉమ్మడి కృష్ణా జిల్లా కోఆర్డినేషన్ ఇచ్చారు. ఉమ్మడి ఈస్ట్, వెస్ట్ గోదావరిని బొత్స సత్యనారాయణకు, ఉమ్మడి విశాఖ, శ్రీకాకుళం జిల్లా బాధ్యతలు విజయసాయిరెడ్డికి, కడప, అనంతపురం, కర్నూలును వైవీ సుబ్బారెడ్డికి అప్పగించారు. ఇప్పటి వరకు వైసీపీ నుంచి బయటకు వెళ్లే వాళ్లనే చూశాం. ఇన్ని నెలల తర్వాత తొలిసారి అధికార పార్టీ నుంచి ఓ నేత వైసీపీలో చేరారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణ వైసీపీలో చేరారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శిసహా అన్ని పదవులకు రాజీనామా చేసి జగన్ సమక్షంలో పార్టీలో చేరారు. జగన్ మోహన్ రెడ్డి మురళీకృష్ణకు పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓడిపోయిన తర్వాత కేడర్‌లో ఒక్కసారిగా నిస్తేజం ఏర్పడింది. అప్పడప్పుడు జగన్ బయటకు వస్తున్నప్పటికీ మునుపటి జోష్ కనిపించడం లేదు. మరోవైపు కేసుల్లో ఇరుకున్న వాళ్లు జైలుపాలు అవుతున్నారు. ఇది కూడా పార్టీలో ఓ విధమైన నిరాశకు కారణం అవుతుంది. అందుకే ఇప్పటి వరకు జిల్లా పార్టీని ప్రక్షాళన చేసిన జగన్... ఇప్పుడు నియోజకవర్గాలపై ఫోకస్ పెట్టారు. ఇప్పటి వరకు బాధ్యతలు అప్పగించిన నేతలందా ప్రజల్లో ఉండాలని జగన్ సూచించారు. వారి పని తీరుపై ఎప్పటికప్పుడు రిపోర్టులు తీసుకుంటామని అన్నారు. వాటి ఆధారంగానే ఆ నేతల భవిష్యత్ ఆధార పడి ఉంటుందని చెప్పుకొచ్చారు.

# ఇసుక, లిక్కర్ లో జోక్యంపై ఆగ్రహం

కాకినాడ, అక్టోబరు 18,ప్రభుత్వంపై వ్యతిరేకత ఎక్కువగా ఎమ్మెల్యేల వల్లే వస్తుంది. సంపాదన కోసం వారు నియోజకవర్గంలో ప్రతి దాంట్లో కమిషన్లు తీసుకోవడం.. ప్రతి పని తమ కనుసన్నల్లో జరగాలని కోరుకోవడం వల్ల ఇలాంటి పరిస్థితి వస్తుంది. గత అనుభవాలతో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఈ సారి రూటు మార్చారు. ఎమ్మెల్యేలను మొదటి నుంచి కట్టడి చేసి సరైన మార్గంలో వెళ్లేలా చేయాలనుకుంటున్నారు. అందుకే సమయం, సందర్భం వచ్చినప్పుడల్లా హెచ్చరికలు జారీ చేస్తూనే ఉన్నారు. తాజాగా కేబినెట్ భేటీలోనూ అదే చెప్పారు. ప్రత్యేకంగా టీడీఎల్పీ సమావేశం ఏర్పాటు చేసి అవే హెచ్చరికలు వినిపించబోతున్నారు. గత ప్రభుత్వం ఇసుక దోపిడికి పాల్పడిందని టీడీపీ ఆరోపిస్తూ వచ్చింది. అందుకే తాము రాగానే ఉచిత ఇసుక పాలసీ ఇస్తామని హామీ ఇచ్చింది. అన్నట్లుగానే ఉచిత ఇసుక పాలసీ తెచ్చింది. కానీ చాలా చోట్ల నుంచి విమర్శలు వస్తున్నాయి. దీనికి కారణం ఎమ్మెల్యేల జోక్యమేనని ఆరోపణలు వచ్చాయి. తాజాగా లిక్కర్ పాలసీ విషయంలో కొంత మంది ఎమ్మెల్యేలు జోక్యం చేసుకున్నారని నివేదికలు చంద్రబాబుకు వచ్చాయి. సిండికేట్ అయ్యారని.. లాటరీల్లో దుకాణాలు వచ్చిన వారిని బెదిరించారని ఇలా పలు రకాలుగా చెప్పుకున్నారు. దీంతో చంద్రబాబు నేరుగా ఇంటలిజెన్స్ నుంచి నివేదికలు తెప్పించుకుని ఇలాంటి పనులు చేస్తున్న వారికి హెచ్చరిక సంకేతాలు పంపించారు. ఎమ్మెల్యేలు ఇలా అక్రమ సంపాదనకు అలవాటు పడకుండా చేసేందుకు చంద్రబాబు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మొదట్లోనే వారిని అడ్డుకుంటే సమస్య ఉండదని అనుకుంటున్నారు. నిజానికి ఇసుక, లిక్కర్ అనేది ఎమ్మెల్యేలకు ప్రధాన ఆదాయ వనరుల్లో ఒకటిగా ఉండేది. గత ప్రభుత్వంలో ఇది కేవలం పై స్థాయిలో ఉన్న వారికి మాత్రం ఆదాయవనరుగా మారిందని అందుకే వైసీపీ కార్యకర్తలు ఆ పార్టీకి వ్యతిరేకంగా పని చేశారని చెబుతారు. ఇప్పుడు టీడీపీ ప్రభుత్వంలో పాత విధానాలే తీసుకు వచ్చినా నిజాయితీగా లిక్కర్ దుకాణాలను వేలంపాటలో దక్కించుకునే పర్వాలేదు కానీ దందాలు చేయాలనుకుంటే మాత్రం సాధ్యం కాదని సంకేతాలు పంపుతున్నారు. ఇలా ఎమ్మెల్యేలు లిక్కర్, ఇసుకల్లో పదే పదే జోక్యం చేసుకుంటే ప్రజా వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంది. అందుకే చంద్రబాబు వారిని కట్టడి చేస్తున్నారు. అయితే ఎమ్మెల్యేలు తమకు ఆదాయ మార్గాలేమిటని మథనపడే అవకాశం ఉంది. ఎందుకంటే రాజకీయాలు చేయాలంటే ఎంతో ఖర్చు అవుతుంది. పార్టీ క్యాడర్ ను చూసుకోవాలి. పార్టీ కార్యక్రమాలు నిర్వహించుకోవాలి. మరి వీటికి ఆదాయం ఎక్కడి నుంచి వస్తుందన్న ఆవేదన ఎమ్మెల్యేల్లో కనిపించే అవకాశం ఉంది. నిజాయితీగా వ్యాపారాలు చేసుకుంటే ప్రభుత్వం తరపున పార్టీ నుంచి సహకారం అందుతుంది కానీ.. అక్రమ వ్యాపారాలకు సహకరించే ప్రశ్నే లేదని చంద్రబాబు స్పష్టం చేయనున్నారు.ఇందు కోసం టీడీపీ ఎల్పీ సమావేశాన్ని శుక్రవారం ఏర్పాటు చేస్తున్నారు. ఈ సమావేశంలో చంద్రబాబు ఎమ్మెల్యేలకు తన పాలసీని స్పష్టం చేయనున్నారు. గీత దాటిదే ఎవర్నీ వదిలేది లేదని హెచ్చరించే అవకాశం ఉంది.

# నాకు న్యాయం చేయండి..

తాండూరు బషీరాబాద్ పోలీస్ స్టేషన్ నందు పెట్రోల్ డబ్బాతో గిరిజన మహిళ ఆత్మహత్యయత్నం చేసింది. నాకు న్యాయం చేయండీ అంటూ ఓ గిరిజన మహిళ పోలీస్టేషన్ మెట్లు ఎక్కింది. పెట్రోల్ డబ్బా వెంట తెచ్చుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ సంఘటన బషీరాబాద్ పోలీస్టేషన్ వద్ద చోటు చేసుకుంది. బాధితురాలి కథనం మేరకు.. బషీరాబాద్ మండలం కొత్లాపూర్ గ్రామానికి చెందిన దేవీబాయికి ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. చాలా ఏళ్ల క్రితం దేవీబాయి భర్త చనిపోయాడు. అయితే దేవీబాయి నాలుగు నెలల క్రితం తన పెద్ద కూతురును అదే గ్రామానికి చెందిన యువకుడితో పెళ్లి జరిపించింది. అప్పటికే కూతురుకు కంసాన్పల్లి తాండాకు చెందిన యువకుడితో ప్రేమ వ్యవహారం కొనసాగుతోంది. పెళ్లి అయిన కొన్ని రోజుల తరువాత కూతురు ప్రేమికుడితో వెళ్లిపోయింది. ఆ తరువాత కూతురు, ప్రేమికుడిని పిలిపించి ఇరు కుటుంభ సభ్యులతో కుల పంచాయతీని పెట్టారు. ఈ పంచాయతీలో భర్త కుటుంబికులు ప్రేమికుడి నుంచి రూ. 14లక్షల పరిహారం ఇవ్వాలని ఒప్పందం చేసుకున్నారు. ఇందుకు ప్రేమికుడు రెండు నెలల గడువులో భర్త కుటుంబానికి ఇస్తానని అంగీకరించారు.

ఇచ్చిన సమయం దాటినా కూడా ప్రేమికుడు డబ్బులు ఇవ్వక పోవడంతో కూతురు భర్త కుటుంభీకులు దేవీబాయిపై ఒత్తిడి తీసుకవచ్చారు. ఈ క్రమంలో తనకు న్యాయం చేయాలంటూ దేవీబాయి బషీరాబాద్ పోలీస్టేషన్కు వచ్చింది. వెంట పెట్రోల్ బాటిల్ తీసుకవచ్చి ఆత్మహత్యాయత్నానికి యత్నించింది. గమనించిన పోలీసులు డబ్బా తీసుకుని దేవీబాయిని సముదాయించారు. ఇరు కుటుంబ సభ్యులను పిలిపించి మాట్లాడుతామని ఎస్ఐ గఫార్ చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

# సజ్జలకు మద్దతు ఇవ్వని నేతలు



గుంటూరు, అక్టోబరు 18, సిపి కీలక నేత, పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఆల్మోస్ట్ నెంబర్ 2 స్థానంలో చక్రం తిప్పిన సజ్జల రామకృష్ణారెడ్డి ప్రస్తుతం అదే పార్టీలో ఒంటరి వారు అయ్యారా అనే చర్చ ఏపీ రాజకీయాల్లో జరుగుతోంది. రెండు రోజుల క్రితం ఆయన విదేశాల నుండి తిరిగి వస్తున్న సమయంలో ముంబై ఎయిర్పోర్టులో పోలీసులు ఆపారు. సజ్జల విదేశాలకు పారిపోతున్న సమయం లో పోలీసులు అడ్డుకున్నారంటూ వార్తలు గుప్పుమన్నాయి. నిజానికి జరిగింది వేరు. ఆయన బాలీ నుండి తిరిగి వస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. తర్వాత ఆయనకు సుప్రీంకోర్టు ప్రొటెక్షన్ ఉందన్న విషయం తెలిసి ఆయనను వదిలేసారు.నిజానికి సజ్జలకు ఒక విధంగా ఇది పాజిటివ్ న్యూసే. కానీ విచిత్రంగా వైసిపి నుండి కీలక నేతలు ఎవరూ సజ్జల పై వచ్చిన వార్తలను ఖండించే ప్రయత్నం చేయలేదు. మరోవైపు ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు ఇంకా సజ్జలపై లుక్ అవుట్ నోటీస్ అమలు లో ఉన్నట్టు కూడా చెప్పారు. తర్వాత మంగళగిరి పోలీసులు సజ్జలను తమ ముందు హాజరు కావాలంటూ నోటీసులు అందజేశారు. 2021 అక్టోబర్ 19న జరిగిన టిడిపి కార్యాలయం పై దాడి ఘటన లో విచారించేందుకు సజ్జల రామకృష్ణారెడ్డికి ఈ నోటీసులు అందాయి. దీనిపై కూడా సజ్జల రామకృష్ణారెడ్డి ఒక్కరే ప్రెస్ మీట్ పెట్టి తనను తాను సమర్థించుకోవలసి వచ్చింది.వైయస్ జగన్మోహన్ రెడ్డి చెల్లెలు, ప్రస్తుత ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు పదేపదే చెప్పే మాట జూఖీ కాంగ్రెస్ లో జ అంటే వై.వి సుబ్బారెడ్డి, గా అంటే విజయసాయిరెడ్డి, ఖీ అంటే సజ్జల రామకృష్ణారెడ్డి అనీ .పార్టీ అధికారంలో ఉన్నప్పుడు నిజంగానే పవర్ అంతా ఈ ముగ్గురి మధ్య నడిచేది అనే ప్రచారం బలంగా ఉండేది. దానివల్ల వీళ్ళ మధ్య ఈగోలు కూడా పెరిగిపోయాయని అందువల్ల పవర్ సెంటర్ అనేది వీళ్ళ ముగ్గురి మధ్య మారుతూ వచ్చేది అనేది వైసిపి నేతల మధ్యే నడిచిన చర్చ. ఈ ముగ్గురిలోనూ సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డితో చాలా క్లోజ్ గా ఉండేవారు. ఉద్యోగుల పిఆర్సి సమస్య అయినా,ఇతర కీలక అంశాలైనా సజ్జల ద్వారానే జగన్ వరకు వెళ్లేదనేది ఆ టైంలో జరిగిన కాదనలేని నిజం. అందుకే అప్పట్లో విపక్షాలు సజ్జలను "సకల శాఖల మంత్రి " అంటూ విమర్శించేవారు. బహుశా ఆ ప్రయారిటీ నే సజ్జలను వైసీపీలోని ఇతర కీలక నేతల కోపానికో, అసూయకో గురి చేసిందంటారు ఎనలిస్ట్ లు. 2024లో ఎప్పుడైతే పార్టీ ఓడిపోయిందో చాలామంది వేళ్ళు సజ్జల వైపే గురి పెట్టాయి. జగన్ కు పార్టీకి మధ్య సజ్జల అడ్డుగోడలా మారారు అనేది వారి ఆరోపణ. దానికి తగ్గట్టే ఇటీవలి కాలంలో సజ్జల పార్టీ కార్యక్రమాల్లో కాస్త నెమ్మదిగానే ఉంటున్నారు. ఇక ఎన్నికల ముందు బాగా యాక్టివ్ గా ఉన్న ఆయన కుమారుడు సజ్జల భార్గవ్ కూడా ఓటమి తర్వాత ఎక్కడా కనిపించడం లేదు.టిడిపి కార్యాలయం పై దాడి కేసులో ఇప్పటికే దేవినేని అవినాష్, లేళ్ళ అప్పిరెడ్డి, తలశిల రఘురాం లాంటివాళ్ళు కేసులు ఎదుర్కొంటుండగా తాజాగా అదే కేసు లో సజ్జల కూడా విచారణకు హాజరు కావలసి వచ్చింది. అయితే సజ్జల స్థాయి వ్యక్తి ఇలాంటి ఆరోపణలు ఎదుర్కొంటున్నప్పుడో లేక కనీసం "ముంబై ఎయిర్‌పోర్టులో అరెస్ట్ అయ్యారు " లాంటి వార్తలు వైరల్ అయినప్పుడో వాటిని ఖండిస్తూ పార్టీ లోని ఇతర నేతలు ఒక ప్రకటన జారీ చేయడమో లేక ప్రెస్ మీట్ పెట్టడమో చేస్తారని అందరూ భావించారు. అయితే విచిత్రంగా అలాంటి సూచన ఏది ఇప్పటివరకూ కనిపించలేదు. దానితో సజ్జల రామ కృష్ణారెడ్డిని వాళ్లు లైట్ తీసుకుంటున్నారా లేక గతంలో అచల పాటించిన ఒంటెద్దు పోకడలు ఆయనను ఇతర నేతలకు దూరం చేసాయా అన్న చర్చ ఏపీ రాజకీయాల్లో జోరుగా సాగుతోంది. మరి ఇప్పటికైనా సజ్జలకు మద్దతుగా వైసిపి నుండి ఎవరన్నా కీలక నేతలు బయటకు వస్తారో లేదో అన్నదానిపై ఈ చర్చ క్లైమాక్స్ ఆధారపడి ఉంది.

# 3 విభాగాలుగా అమరావతి

అమరావతి, అక్టోబరు 18, అమరావతిలో నిర్మాణ పనులు పునః ప్రారంభించి పరుగులు పెట్టించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అమరావతి నిర్మాణానికి సంబంధించిన ఏడు అంశాలకు అథారిటీ ఆమోదం తెలిపింది. నిర్మాణాలు పునః ప్రారంభించిన తర్వాత అన్నింటికీ ఓ కాలపరిమితితో ముందుకెళ్లాలని నిర్ణయించారు.సీఆర్డీఏ చట్టం 2014 ప్రకారం అథారిటీ అకౌంట్స్‌ను ఏటా జులై 31లోగా అకౌంటెంట్ జనరల్‌కు ఇవ్వాలి. 2014 నుంచి 2017 సంబంధించిన రిపోర్టలను 2018లోనే ఏజీకి సమర్పించారు. 2017-18 నుంచి ఆడిటింగ్ జరగలేదు. 2017-18, 2018-19, 2019-20, 2020-21 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన ఆడిట్ రిపోర్ట్ ఏజీ ఇవ్వాలని తీర్మానం చేశారు. అమరావతి నిర్మాణంలో భాగంగా చేపట్టే నిర్మాణాలకు సామాజిక, పర్యావరణ అనుమతులు అవసరం అవుతాయి. కేంద్ర,రాష్ట్ర, స్థానిక సంస్థల నుంచి అనుమతులు తీసుకోవాలి. ప్రపంచ బ్యాంకు,ఆసియా అభివృద్ధి బ్యాంకు నిధులు వస్తున్నందన ప్రతి విషయంలో జాగ్రత్త తీసుకోవాల్సి ఉంటుంది. ఈ అనుమతులు త్వరగా వచ్చేందుకు ప్రత్యేకంగా ఎన్విరాన్ మెంటల్ అండ్ సోషల్ మేనేజ్ మెంట్ యూనిట్ ఏర్పాటు చేయాలని డిసైడ్ అయింది. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఆలిండియా సర్వీస్ అధికారుల భవనాల పాత టెండర్ రద్దు చేసి కొత్త టెండర్లు పిలవాలని నిర్ణయించింది. 524.70 కోట్లు ఖర్చు చేస్తే పెండింగ్ పనులు పూర్తి అవుతాయని తెలిపింది.

ఈ భవనాల నిర్మాణాన్ని సీడ్ యాక్సిస్ రోడ్డు, ఈ3- ఔ11, ఈ3-ఔ12 జంక్షన్ సమీపంలో 2017లో ప్రారంభించారు. అప్పట్లో ఎన్ సీ సీ సంస్థ ఈ కాంట్రాక్ట్ దక్కించుకుంది.15.65 ఎకరాల విస్తీర్ణంలో స్టిల్ట్ ప్లస్ 12 అంతస్తులతో మొత్తం 18 టవర్లలో 432 ఫ్లాట్ల నిర్మాణం 444 కోట్లతో ప్రారంభించారు. ఆర్కిటెక్చరల్ ఫినిషింగ్ పనులు, ఇంటీరియర్స్, ఎలక్ట్రికల్, మెకానికల్, హెచ్వీఏసీ, ఎంఈపిఎఫ్, ఐసీటీ వర్క్స్ పెండింగ్‌లో ఉన్నాయి. డిజైన్, బిల్డ్, ఐటెమ్ రేట్ కాంట్రాక్ట్ సిస్టమ్‌పై టెండర్లు పలువనున్నారు. రెండు మూడు రోజుల్లో టెండర్ పిలిచి 20 రోజుల్లో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటారు.సీడ్ యాక్సిస్ రోడ్,ఈ3-ఔ11 జంక్షన్ వద్ద సీఆర్డీఏ ప్రాజెక్ట్ ఆఫీస్ నిర్మాణాన్ని 2017లో ప్రారంభించారు. మొత్తం 3.62 ఎకరాల విస్తీర్ణంలో జీ ప్లస్ 7 భవనాన్ని 2 లక్షల 42వేల 481చదరపు అడుగుల విస్తీర్ణంలో పనులు స్టార్ట్ చేశారు. అదనంగా పార్కింగ్,ల్యాండ్ స్కేపింగ్ 2.51 ఎకరాల విస్తీర్ణం ఉంది. ఇప్పటికి 61.48 కోట్లు ఖర్చు పెట్టారు. ఆర్కిటెక్చరల్ ఫినిషింగ్స్, ఇంటీరియర్స్, ఎలక్ట్రికల్, మెకానికల్ సిస్టమ్స్, ఇతర వర్క్స్ బ్యాలెన్స్ ఉన్నాయి. వాటిని పూర్తి చేసేందుకు 160 కోట్లు పెట్టాలి. దీనికి టెండర్లు పిలిస్తే నాలుగు కంపెనీలు పోటీ పడ్డాయి. పోటీలో ఒ1గా నిలిచిన హైదరాబాద్‌కు చెందిన కేపీసీ ప్రాజెక్ట్స్‌కు పనుల అప్పగించబోతున్నారు. నాలుగైదు రోజుల్లో పనులు స్టార్ట్ అవుతాయిఅమరావతి నిర్మాణంలో 3 కీలక విభాగాలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఒకటి అమరాతి ప్రభుత్వ సముదాయం, రెండోది ల్యాండ్ పూలింగ్ స్కీమ్ మౌలిక సదుపాయాలు, మూడోది ట్రంక్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్. మొత్తం రెండు దశల్లో అభివృద్ధి పనుల పూర్తికి అంచనాలు సిద్ధం చేశారు. మొత్తం 15 వేల కోట్లు ప్రపంచ బ్యాంక్, ఆసియన్ డెవలప్ మెంట్ బ్యాంక్ నుంచి తీసుకుంటారు. ట్రంక్ ఇన్ ఫ్రా పనుల కోసం డీపీఆర్ తయారీకి కన్సల్టెంట్ నియమించనున్నారు. ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పనులన్నీ అమరావతి డెవలప్ మెంట్ కార్పొరేషన్ (ఏడీసి)చూస్తోంది. ఇందులో కేపిటల్ సిటీలో 34 రోడ్లు, మురికినీటి కాలువలు, నీటిసరఫరా నెట్ వర్కులు ఉన్నారు. వీటితోపాటు పవర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్, వరద నివారణ పనులు, పాలవాగు, కొండవీటి వాగు, గ్రావిటీ కెనాల్, శాఖమూరు, నీరుకొండ,కృష్ణయ్యపాలెం రిజర్వాయర్‌ల విస్తరణ కూడా దీని కిందికే వస్తుంది. ఐదేళ్లగా అమరావతి పనులు నిలిచిపోవడంతో జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు టెక్నికల్ స్టడీ చేస్తారు. దీని టెండర్లను ఆర్వీ అసోసియేట్స్ సంస్థ ఎల్ వన్‌గా నిలిచి టెండర్ దక్కించుకుంది. వివిధ పనుల ప్రస్తుత పరిస్థితి, పెండింగ్ పనుల ఖర్చులను అంచనా వేస్తుందీ సంస్థ. వరద పనులు కోసం టెండర్ డాక్యుమెంట్‌ల రూపకల్పన వంటి అంశాలతో డీపీఆర్ సిద్ధం చేయనుంది. 2015 వరకూ అందుబాటులో ఉన్న వర్షపాతం డేటా ఆధారంగా అమరావతిలో వరద నివారణ పనుల కోసం బ్లూ మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారు. 2015 నుంచి 2024 వరకూ ఉన్న వర్షపాతం డేటాతో అప్ డేట్ చేయాల్సి ఉంది. వైకుంఠపురం వద్ద 5650 క్యూసెక్కుల నీటిని పంప్ చేసేలా పంపింగ్ స్టేషన్ నిర్మాణం చేపట్టాలి. రెండో దశ డీపీఆర్ తయారీకి సలహాదారును నియమించేందుకు సీఆర్డీ అథారిటీ ఓకే చెప్పింది.

# త్వరలో దువ్వాడ బయోపిక్

శ్రీకాకుళం, అక్టోబరు 18, త్వరలో దువ్వాడ బయోపిక్ తెరపైకి రానుందా? ఆ ప్రయత్నాలు జరుగుతున్నాయా? టాలీవుడ్ ప్రముఖ నిర్మాత ఒకరు ఆ ప్రయత్నాల్లో ఉన్నారా? ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది.గత మూడు నెలలుగా దువ్వాడ ఫ్యామిలీ వివాదం తెలుగు రాష్ట్రాల ప్రజలకు వినోదాన్ని పంచింది. ప్రతిరోజు ఇదో రచ్చగా మారింది. విజయవాడ వరదల సమయంలో కాస్త తగ్గుముఖం పట్టింది. లేకుంటే మీడియాకు సైతం ఇదే ప్రధాన అస్త్రంగా మారిపోయింది. ఆయనపై భార్య, కుమార్తెలు చేసిన ఆరోపణలు,చేసిన నిరసనలు, చూపించిన వాట్సాప్ మెసేజ్ లు, ఆస్తుల వ్యవహారాలు, పార్టీ ఆఫీస్ పంచాయితీలు ఇలా ఒకటేమిటి.. ప్రతిరోజు ఏదో ఒక అంశం బయటపడుతూనే ఉంది. అన్నింటికీ మించి దివ్వెల మాధురితో ఆయన లవ్ ట్రాక్ మరింత ఆకట్టుకుంది. ఎవరేమనుకున్నా తాను దువ్వాడ తోనే ఉంటానని.. దీనిని లివ్ ఇన్ టుగెదర్ అన్నారని.. అడల్ట్రీ అంటారని.. దాని అర్థం డిక్షనరీలో కనిపించేది కాదని.. సుప్రీంకోర్టు సైతం ఇదే విషయాన్ని పేర్కొందని గుర్తు చేస్తూ మాధురి చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయితొలుత దువ్వాడపై దూకుడుగా వ్యవహరించిన ఆయన భార్య వాణి స్వరంలో మార్పు వచ్చింది. దువ్వాడ శ్రీనివాస్ ఎలా ఉన్నా పర్వాలేదు.. ఎవరితో ఉన్నా పర్లేదు.పిల్లల కోసం అయినా తమతో కలిసి ఉంటే చాలు. మాతో పాటు ఒకే ఇంట్లో ఉంటే చాలు అనే స్థాయిలో భార్య వాణి కోరుకుంది. అయితే ఈ వివాదం కోర్టులో ఉంది కనుక.. విడాకులే శరణ్యం అన్నట్టు తేల్చి చెప్పారు దువ్వాడ శ్రీనివాస్. తన భార్య దువ్వాడ వాణి తో కలిసే ప్రసక్తి లేదని తేల్చి చెప్పారు. పిల్లల బాధ్యత మాత్రం తాను చూసుకుంటానని చెప్పుకొచ్చారు.ప్రస్తుతం దువ్వాడ శ్రీనివాస్, మాధురి జంట టీవీ ఛానల్ కార్యాలయాల చుట్టూ తిరుగుతోంది. ప్రముఖ మీడియా ఛానళ్లకు వరుస ఇంటర్వ్యూలు ఇస్తోంది. తిరుపతిలో ప్రత్యక్షమైన ఈ జంట భక్తులకు కనువిందు చేసింది. ఇందులో మాధురి పై కేసు కూడా నమోదు అయ్యింది. మరోవైపు దువ్వాడ ఎపిసోడ్ కు సంబంధించి కీలక విషయం ఒకటి బయటపడింది. త్వరలో దువ్వాడ శ్రీనివాస్ బయోపిక్ తెరకు ఎక్కనుందని తెలుస్తోంది.

# బయటకొస్తున్న విడుదల రజనీ అక్రమాలు

గుంటూరు, అక్టోబరు 18,మొన్న జగనన్న కాలనీలు.. నిన్న క్రషర్ యజమానులు.. నేడు పాఠశాల ఉపాధ్యాయులు ఎవరు చూసినా కూడా ఆ జిల్లాలో ఆమె బాధితులే.. డైరెక్ట్ గా ఆమె ఎటాక్ చేయొచ్చు. లేకపోతే ఆమె పేరు చెప్పి మరొకరైనా బెదిరించవచ్చు. మంత్రి హోదాలో ఆమె చేసిన పెత్తనం, ఆమె టీమ్ చేసిన దౌర్జన్యాలతో వివిధ వర్గాల వారు తీవ్రంగా నష్టపోయారంట. ప్రభుత్వ, ప్రజల ధనాన్ని దోచుకోవటమే ఎజెండాగా ఆమె చెలరేగారని అంటున్నారు ఫిర్యాదుదారులు.. వైసీపీ ప్రభుత్వ హయాంలో పాలన ఎంత నిర్లక్ష్యంగా, దౌర్జన్యపూరితంగా సాగిందో చెప్పటానికి ఎన్నికల ఫలితాలే ప్రత్యక్ష ఉదాహరణ. రాష్ట్ర నలుమూలల్లో ప్రజలు ఆ పార్టీ అభ్యర్థులను చిత్తుచిత్తుగా ఓడించారు. మళ్లీ అధికారంలోకి వస్తామన్న ధీమాతో ఇష్టానుసారం అరాచకాలకు పాల్పడ్డారన్న ఆరోపణలున్నాయి. ప్రజలకు మంచి చేస్తారని ఆలోచనతో ఓటు వేసి ప్రజాప్రతినిధులను గెలిపించుకుంటారు ప్రజలు.. కానీ వైసీపీ ప్రజా ప్రతినిధులు ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి సొంత ఇల్లు చక్కదిద్దుకోవడానికే ప్రాధాన్యమిచ్చారన్న విమర్శలు వెల్లువెత్తాయి. ఆ క్రమంలో పల్నాడు జిల్లాలో గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలే నిదర్శనమని చెప్పాలి.గత ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన విడుదల రజనికి సంబంధించి వెలుగులోకి వస్తున్న కేసులను పరిశీలిస్తే ప్రతి ఒక్కళ్ళు ముక్కున వేలు వేసుకోవాల్సిందే.. రైతుల నుంచి పారిశ్రామికవేత్తల వరకు ఎవరినీ వదిలిపెట్ట లేదంట మన మాజీ మంత్రి. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచే రజినిపెత్తనం మొదలైందంటారు. ఇక మూడేళ్ల తర్వాత ఆ ఫస్ట్ టైం ఎమ్మెల్యేని మంత్రిని చేశారు జగన్.. ఇక అప్పటి నుంచి లేడీబాస్ తరహాలో చెలరేగిపోయారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఆఖరికి ప్రభుత్వ పాఠశాల పనుల్లో కూడా రజని వర్గం అక్రమాలకు పాల్పడిన ఉదంతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి.. ఆమే కాదు రజని బంధువులు, అనుచరులు, తెలిసిన వాళ్ళు ఇలా ప్రతి ఒక్కరు ఆమె పేరు చెప్పి అక్రమాలకు పాల్పడినట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. జగనన్న కాలనీల పేరుతో పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేయడంతో.. ప్రభుత్వం మారగానే బాధితులు బయటికి వచ్చి ఆమెపై ఫిర్యాదులు చేశారు.. దీంతో చేసేదేమీ లేక వారికి రజనీ వర్గీయులు డబ్బు తిరిగిచ్చారువారిది ముగిసింది అనుకునే లోపే స్టోన్ క్రషర్స్ యజమానులు తమ నుంచి కోట్ల రూపాయలు అక్రమంగా వసూలు చేశారంటూ పోలీసులను ఆశ్రయించారు. దీంతో విడుదల రజనీకి సంబంధించి మరో అక్రమం బయటకు వచ్చింది. ప్రస్తుతం స్కూలు రెన్యువేషన్ కి సంబంధించి చేపట్టే నాడు నేడు కార్యక్రమంలో పెద్ద ఎత్తున అక్రమం జరిగిందని.. దానికి కారణం విడుదల రజనీకి సంబంధించిన బంధువులేనని ప్రధాన ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయులు బయటికి వచ్చి ఫిర్యాదులు చేస్తున్నారు. నాడు నేడు పనుల కోసం విడుదలైె నిధుల్లో 40 లక్షల రుపాయలు దుర్వినియోగమయ్యాయని వారు చిలకలూరిపేట టీడీపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావుకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.ప్రస్తుతం బయటకు వస్తున్న ఫిర్యాదులను బట్టి రజని ఏ స్థాయిలో అధికారం చెలాయించారో అర్థమవుతుంది.. తనకు అనుకూలురైన అధికారుల్ని నియమించుకుని.. తన మాట వినని వారిని బదిలీ చేయించి.. తన మాటే శాసనం అన్నట్లు వ్యవహరించేవారని బాధితులు అంటున్నారు .. వైసీపీ ప్రభుత్వంలోనూ విడుదల రజనీపై పలు ఫిర్యాదులు చేసినా అవన్నీ బుట్టదాఖలు అయ్యాయంటున్నారు .. అప్పుడు నిస్సహాయంగా ఉండిపోయిన బాధితులంతా ఇప్పుడు బయటకు వస్తూ ఆమె ముఠా అక్రమాలను బయట పెడుతున్నారు. ఇవే కాదు భయపడి బయటికి రాలేని వాళ్ళు చాలామంది ఉన్నారంటున్నారు.రజిని అన్ని అక్రమాలకు పాల్పడబట్టే చిలకలూరిపేట నియోజకవర్గంలో ఆమెపై వ్యతిరేకత పెరిగిపోయింది. ఆ విషయం సర్వేల్లో తేలడంతో వైసీపీ అధ్యక్షుడు జగన్ ఆమెను గుంటూరు వెస్ట్ ఇన్చార్జ్‌గా పంపించారు. గుంటూరు వెస్ట్‌లో గెలవడానికి రజని ఘనంగానే ఖర్చు పెట్టారు. అయినా ఫలితం లేకుండా పోయింది. టీడీపీ నుంచి పోటీ చేసిన గల్లా మాధవి రాజకీయాలకు కొత్త అయినప్పటికి రజని 51 వేల పైచిలుకు ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. ఓటమి తర్వాత రజని వైసీపీ కార్యకలాపాల్లో ఎక్కడా కనిపించడం లేదు. వరుసగా తనపై వస్తున్న ఫిర్యాదులతో మీడియాకు, జనానికి ముఖం చూపించడమే మానేశారు. దాంతో వైసీపీ వర్గాలే ఆమెపై భగ్గు మంటున్నాయి.విడుదల రజినిపై వస్తున్న ఫిర్యాదులకు సంబంధించి పార్టీ వర్గాలు సైతం ఎక్కడా ఖండిస్తున్న పరిస్థితి లేదు కనీసం ఆమె చుట్టూ ఉన్న కార్యకర్తలు కూడా ఇప్పటివరకు దీనిపైన ఎక్కడ మాట్లాడిన పరిస్థితులు లేవు.. అయితే ఫిర్యాదులు అయితే అందుతున్నాయి కానీ.. వాటిపై ఇంత వరకు ఎలాంటి చర్యలు లేకపోవడం విమర్శల పాలవుతుంది. మరి కూటమి సర్కారు ఆవిమర్శలకు ఎలా రిప్లై ఇస్తుందో చూడాలి.

# దిగుమతుల నుంచి ఎగుమతుల స్థాయికి....

ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా వైరస్ మహమ్మారి ఆర్థిక వ్యవస్థలను చిన్నాభిన్నం చేసింది.. ఇప్పుడిప్పుడే పలు దేశాలు కోలుకుంటుంటుండగా.. మరికొన్ని దేశాలు అలానే ముందుకు సాగుతున్నాయి.. అయితే.. భారతదేశం అలా కాదు.. ఆర్థిక వ్యవస్థే కాదు.. ఎన్ని అవాంతరాలు వచ్చినా ధీటుగా ఎదుర్కొనేందుకు సిద్ధమవ్వడంతోపాటు.. మరింత బలంగా మారింది.. దానికి ప్రధాన కారణం కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే.. కరోనా తర్వాత.. ప్రధాని మోదీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంది.. ఆర్థిక వ్యవస్థను గట్టెక్కించేందుకు పలు సంస్కరణలు తీసుకువచ్చింది. దీంతో విదేశీ పెట్టుబడులు సైతం భారీగా పెరిగాయి.. మేక్ ఇన్ ఇండియా.. ఆత్మనిర్భర్ భారత్, సబ్ కా సాత్ సబ్ కా వికాస్.. లాంటి నినాదాలతో పెట్టుబడులను ఆకర్షించింది. అంతేకాకుండా.. పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా సంస్కరణలు, మార్గనిర్దేశం, సహాయ సహకరాలను పెంచడం కూడా వ్యాపార వర్గాలను ఆకట్టుకునేలా చేసింది.. దానికి నిదర్శనం సెమీ కండక్టర్స్ రంగంలో భారీ పెట్టుబడులు.. మొబైల్ తయారీ యూనిట్లు పెరగడం.. ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీలు), బ్యాటరీలు వాటి సంబంధిత పరిశ్రమలు పెరగడం..మోదీ 2.0 కి మించి? ఇప్పుడు 3.0 సర్కార్ పాలన అన్ని వర్గాలను ఆకట్టుకోవడంతోపాటు.. ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా దూసుకెళ్తోంది.. స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే నాటికి అంటే.. 2047లో భారత్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలని.. వికసిత్ భారత్ నినాదంతో భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మక నినాదంతో ముందుకు సాగుతోంది.. ఆర్థిక శ్రేయస్సు, సామాజిక పురోగతి, పర్యావరణ స్థిరత్వం ఇలా అన్ని విషయాలతోపాటు.. తిరుగులేని శక్తిగా మార్చాలన్నదే ప్రధాని మోదీ నినాదం.. సంకల్పం.. దానికోసం ఇప్పటికే.. దూరదృష్టితో రోడ్ మ్యాప్ ను సిద్ధం చేస్తున్నారు.ముఖ్యంగా ఎంఎస్ఎంఈ (స్టార్టప్‌లు) సెక్టర్‌లను విస్తరించడం, ప్రోత్సాహకాలను అందించడం నుంచి వ్యాపార రంగానికి మరింత ఉత్సాహాన్ని ఇచ్చేలా నిర్ణయాలను తీసుకుంటోంది.. అలాగే ప్రతి రంగంలో కూడా ఆవిష్కరణలను ప్రోత్సహిస్తోంది.. డిజిటల్ ఇండియా నినాదంతో డిజిటల్ కనెక్టవిటీ, యూపీఐ పేమేంట్స్ పెరగడం, టెలికాం రంగంలో మార్పులు.. ప్రతి మూలకు ఇంటర్నెట్ సౌకర్యం.. ఇలా అన్ని రంగాల్లో సంస్కరణలు భారత ఆర్థిక వ్యవస్థకు దోహదపడుతున్నాయి.భారతదేశం గత దశాబ్దంలో మొబైల్ ఫోన్స్ ను దిగుమతి చేసుకుంటే.. ఇప్పుడు ఎగుమతి చేసే స్థాయికి ఎదిగింది. ఇప్పుడు మొబైల్ ఫోన్ల యూనిట్లు 200పైగా ఉన్నాయి.. ప్రస్తుతం ఏకంగా ఆరు రెట్లు మొబైల్స్ను ఇండియాలోనే తయారు చేస్తున్నాం.. ఎగుమతి చేస్తున్నాం.. మేక్ ఇన్ ఇండియా అని చాటిచెబుతున్నాం.. అంటే.. మన సాంకేతిక పరిజ్ఞానం ఎంతలా పెరిగిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు..ప్రపంచ ఉఆఖ ర్యాంకింగ్ 2024 జాబితా ప్రకారం.. భారతదేశం ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది.. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా, చైనా, జపాన్, జర్మనీ తర్వాత భారత్ ఉంది.. కరోనా నష్టం నుంచి దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కోలుకోవడానికి 12 ఏళ్లు పడుతుందని భారతీయ రిజర్వు బ్యాంకు నివేదిక తెలిపింది.. అయితే.. ఈ నివేదికలు, అంచనాల మధ్య ఆర్థిక వ్యవస్థలో భారత్ మరింత ముందుకు చేరుకుంటుందని.. వ్యాపార రంగంతోపాటు.. అన్ని రంగాల్లో ఇదే దూకుడును ప్రదర్శిస్తుందని వ్యాపార దిగ్గజాలు పేర్కొంటుండం ఆసక్తికరంగా మారింది.భారతదేశం బలమైన ఆర్థిక వృద్ధిగా కొనసాగుతుందని ఒపెక్ అంచనా వేసింది.. ఒపెక్ తన తాజా నెలవారీ అప్‌డేట్‌లో అక్టోబరులో భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధిలో స్వల్ప క్షీణతను చవిచూసిందని అయినప్పటికీ.. తిరుగులేని శక్తిగా అవతరిస్తుందని తెలిపింది. 2024-25లో 6.8 శాతంతో వృద్ధిని సాధిస్తుందని పేర్కొంది. భారతదేశ ఆర్థిక వ్యవస్థ 2024 రెండవ త్రైమాసికంలో స్వల్పంగా మందగమనాన్ని ఎదుర్కొంది.. మొదటి త్రైమాసికంలో 7.8% నుంచి 6.7% వార్షిక వృద్ధిని నమోదు చేసింది. ఈ మందగమనానికి ప్రధానంగా ఎన్నికల సీజన్‌లో ప్రభుత్వ వ్యయం తగ్గుముఖం పట్టింది. మందగమనం ఉన్నప్పటికీ, 2021 నుండి ఆర్థిక వ్యవస్థకు సగటున 54% సహకారం అందించిన సేవల రంగం, గత త్రైమాసికంలో 6.7%తో పోలిస్తే, 2ఖ24లో వృద్ధి 7.2%కి వేగవంతమై, స్థితిస్థాపకతను కనబరిచింది. సెప్టెంబరులో నిరుద్యోగం రేటు ఆగస్ట్‌లో 8.5% నుంచి 7.8%కి తగ్గడంతో కార్మిక మార్కెట్లో సానుకూల ధోరణిని నివేదిక హైలైట్ చేసింది. 2024 పూర్తి సంవత్సరానికి భారతదేశ ఆర్థిక వృద్ధి దాని మునుపటి అంచనాలకు అనుగుణంగా 6.8% వద్ద బలంగా ఉంటుందని ౯ఖఇఅ అంచనా వేసింది. ప్రభుత్వ మద్దతు, ఎన్నికల తర్వాత పునరుద్ధరించబడిన వ్యయం, నిరంతర వినియోగదారుల వ్యయం సంవత్సరం ద్వితీయార్థంలో వృద్ధిని పెంచుతాయని భావిస్తున్నట్లు తెలిపింది.మోదీ ప్రభుత్వం డిజిటల్ కనెక్టివిటీ ప్రాముఖ్యతను గుర్తించి.. అభివృద్ధికి బాటలు వేసింది. ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార్ మంగళం బిర్లా పేర్కొన్నారు. చిన్న చిన్న అవసరాలను సైతం గుర్తించి ఎన్నో అవకాశాలను అందిస్తుందని పేర్కొన్నారు. సాధికారత, సమ్మిళిత డిజిటల్ దేశం వైపు మమ్మల్ని నడిపించడానికి కృషిచేస్తామన్నారు.

# ఏం చేయాకున్నా కుక్కను కొట్టినట్లు కొట్టారు సందీప్ రెడ్డి

ఓయూ పోలీసులు నా దగ్గరికి వచ్చి పోలీస్ స్టేషన్ కి రావాలని పిలిచారు. ఎలాంటి నోటీసు లేకుండా నన్ను ఎందుకు పోలీస్ స్టేషన్ పిలుస్తున్నారని అడిగానని బాధితుడు సందీప్ రెడ్డి అన్నారు. నా భార్య ప్రెగ్నెంట్ కావడంతో హాస్పిటల్ కి వెళ్తున్నాను అని చెప్పాను.. లేదు ఇప్పుడే రావాలంటే పోలీసులు చెప్పారు. మా భార్యను ఇంట్లో దింపేసి పోలీసుల వెంబడి పోలీస్ స్టేషన్ కి వచ్చాను. పోలీస్ స్టేషన్ వచ్చాక ఓయు సిఐ చాలా అసభ్య పదజాలంతో మాట్లాడాడు. అలా ఎందుకు మాట్లాడుతున్నారని అడిగినందుకు నాపై దాడి చేశారు. 15 మంది పోలీసులు కలిసి కుక్కను కొట్టినట్టు నన్ను నా తమ్ముళ్లు ఇద్దరిని కొట్టారు. ఎందుకు తీసుకొచ్చారు రీసన్ చెప్పలేదు. పోలీసులు తప్పయింది అని చెప్పి మళ్ళీ ఇంటికి పంపిస్తున్నారు. అసలు నాపై ఎలాంటి ఫిర్యాదు రాకుండానే పోలీస్ స్టేషన్ పిలిచి కొట్టారు. నన్ను కొట్టిన పోలీసులపై అడిషనల్ డీసీపీ నరసయ్యకు ఫిర్యాదు చేశాను. వాళ్లపై చర్యలు తీసుకోకుంటే డీజీపీ వరకు వెళ్లి ఫిర్యాదు చేస్తానని అన్నారు.

# అస్సాంలో పట్టాలు తప్పిన రైలు..ప్రయాణికులు సురక్షితం






గువహటీ అస్సాం: అగర్తల-లోకమాన్య తిలక్ టెర్మినస్ ఎక్స్ప్రెస్ లుమ్డింగ్-బాదర్పూర్ హిల్ సెక్షన్లోని లుమ్డింగ్ డివిజన్ పరిధిలోని దిబాలాంగ్ స్టేషన్లో పట్టాలు తప్పింది. పవర్ కార్, ఇంజన్ సహా ఎనిమిది కోచ్లు పట్టాలు తప్పాయి. అయితే, ఎటువంటి ప్రాణనష్టం లేదా పెద్ద గాయాలు సంభవించలేదు. లుమ్ డింగ్ వద్ద హెల్ప్లైన్ నంబర్లు: 03674 263120 మరియు 03674 263126.

# దక్షిణాది కేంద్రంగా ప్రియాంక రాజకీయాలు

బెంగళూరు, అక్టోబరు 18, కాంగ్రెస్ పార్టీలో వారసులు కీలక బాధ్యతలు పంచేసుకున్నట్లుగా కనిపిస్తోంది. ఉత్తరాది బాధ్యతను రాహుల్ గాంధీ తీసుకుంటున్నారు. దక్షిణాది బాధ్యతను ప్రియాంక గాంధీ చేపట్టబోతున్నారు. కేరళలోని వయనాడ్ ఉపఎన్నికల బరిలో ఆమె నిలబడాలని నిర్ణయించుకున్నారు. పార్టీ కూడా అంగీకరించింది. ఇంత కాలం కుటుంబబాధ్యతల కారణంగా నేరుగా ఎన్నికల బరిలోకి దిగడానికి వెనుకాడుతూ వచ్చారు. వరుసగా మూడో సారి కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిన తర్వాత ఇక ఆమె కూడా నేరుగా రంగంలోకి దిగాల్సిన అవసరం ఏర్పడింది. ప్రియాంక కూడా రెడీ అయ్యారు. రాజీవ్ గాంధీ కుమార్తె రూపు రేఖల్లో ఇందిరాగాంధీలా ఉండే ప్రియాంకా గాంధీకి దేశవ్యాప్తంగా క్రేజ్ ఉంది. చాలా కాలంగా ఆమె పరోక్ష రాజకీయాల్లో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున ప్రచారాలు చేస్తున్నా నేరుగా ఎన్నికల బరిలోకి ఎప్పుడూ దిగలేదు. తాజాగా వాయనాడ్ ఉప ఎన్నికల బరిలో దిగాలని ప్రియాంక నిర్ణయించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ కూడా టిక్కెట్ ప్రకటించింది.కేరళలోని అద్భుతమైన ప్రకృతి టూరిజానికి కేంద్రమైన వాయనాడ్ లో ముస్లింల ప్రాబల్యం అధికం. అక్కడ గత రెండు సార్లు రాహుల్ గాంధీ గెలిచారు. ఈ సారి ఆయన సోనియా ఖాళీ చేసిన రాయ్ బరేలీ నుంచి కూడా గెలవడంతో వాయనాడ్ వదులుకున్నారు. ప్రియాంక గాంధీకి రాజకీయ ఆరంగేట్రానికి అది సేఫ్ సీటుగా భావించారు. వాయనాడ్ లో ప్రియాంక గాంధీ గెలవడం పెద్ద విషయం కాదు. దేశం అంతా మిత్రపక్షాలుగా ఉన్న కమ్యూనిస్టులు, కాంగ్రెస్ కేరళలో మాత్రం ప్రత్యర్థులు. అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ వాయనాడ్‌లో వరుసగా గెలుస్తూ వస్తోంది. పోటీ చేసిన రెండు సార్లు దాదాపుగా నాలుగు లక్షల మెజార్టీని రాహుల్ గాంధీకి ఇచ్చారు అక్కడి ప్రజలు. ఈ సారి ఉపఎన్నికల్లో కూడా ప్రియాంకా గాంధీనే విజయం సాధించే అవకాశం ఉంది. అయితే ఎంపీ అవడం ప్రియాంకా గాంధీకి పెద్ద విషయం కాదని.. అంతకు మించిన మిషన్‌తోనే ఆమె దక్షిణాదిలో అడుగు పెడుతున్నారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

వాయనాడ్ నుంచి ఎంపీగా గెలిచిన తర్వాత దక్షిణాది మొత్తం కాంగ్రెస్ పార్టీని చక్కదిద్దుకునే ప్రయత్నాలను ఆమె చేయనున్నారు. కాంగ్రెస్ పార్టీకి దక్షిణాది చాలా ముఖ్యం. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో నాలుగోసారి ఓడిపోకుండా ఉండాలంటే కర్ణాటక, తెలంగాణలో పార్టీని చక్కదిద్దుకోవాలి. ఏపీలో వచ్చిన అవకాశాల్ని వినియోగించుకోవాలి. కర్ణాటకలో అంతర్గత కుమ్ములాటలతో ఆ పార్టీ ఇబ్బంది పడుతోంది. తెలంగాణలో అంది వచ్చిన అవకాశాన్ని నిలబెట్టకోవడానికి తీవ్రంగా శ్రమించాల్సి రావొచ్చు. కేరళలోనూ కాంగ్రెస్‌కు ఆమె స్టార్ లీడర్ గా ఉంటారు. వయనాడ్ ఎంపీ హోదాలో ఇక ప్రియాంక ఆ ప్రయత్నాలు చేస్తారని అనుకోవచ్చు. కాంగ్రెస్ మరో సారి ఢిల్లీలో అధికారంలోకి రావాలంటే ప్రియాంకా గాంధీ ప్రయత్నాలు కూడా కీలకమే.

# తమిళ రాజకీయాల్లోకి జనసేనాని..?

చెన్నై, అక్టోబరు 18, (న్యూస్ పల్స్) ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేరు ఇటీవల రాజకీయ చర్చల్లో తెగ వినిపిస్తోంది. కేవలం రాష్ట్ర రాజకీయాలకే పరిమితం కాలేదు పవన్ పేరు.. దేశ రాజకీయాల్లో కూడా పవన్ పేరు ఇప్పుడు తీవ్ర చర్చకు వస్తున్న పరిస్థితి. దీనికి ప్రధాన కారణం పవన్ వైఖరని చెప్పవచ్చు. మరి ఇంతలా పవన్ కళ్యాణ్ అన్నింటా వైరల్ అయ్యేందుకు దారి తీసిన పరిస్థితులలో మొదటగా.. తమిళులపై ప్రేమ కురిపించడమే. ఒకరితో విభేదం, మరొకరితో సన్నిహితంగా ఉంటూ తమిళ రాజకీయాల్లో కూడా తన హవా కొనసాగిస్తున్నారు పవన్ కళ్యాణ్. అసలు డిప్యూటీ సీఎం పవన్ మదిలో ఏముంది ? ఎందుకు ఇంత తమిళులపై ప్రేమ కురిపిస్తున్నారనే ప్రశ్నలు ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి.డిప్యూటీ సీఎం పవన్ ఇటీవల సనాతన ధర్మ పరిరక్షణ కోసం ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే. దీనికి ఆజ్యం పోసింది మాత్రం తిరుమల లడ్డు వ్యవహారమే. దీక్ష చేపట్టిన పవన్.. తిరుమల శ్రీవారిని దర్శించి దీక్షను విరమించారు. అలాగే తిరుపతి వేదికగా సనాతన ధర్మ పరిరక్షణ కోసం వారాహి డిక్లరేషన్ ప్రకటించేందుకు వారాహి సభను సైతం నిర్వహించారు. ఈ సభలో పవన్ చేసిన ప్రసంగంకు తమిళనాట వేడెక్కిందని చెప్పవచ్చు. పవన్ తన ప్రసంగంలో తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ ను టార్గెట్ చేస్తూ.. సనాతనధర్మం గురించి గతంలో స్టాలిన్ చేసిన వ్యాఖ్యలపై ఘాటుగానే విమర్శించారు. అది కూడా తమిళంలో నేనున్నాను.. సనాతనధర్మ పరిరక్షణ కోసం.. ఎవరినైనా ఎదురిస్తాను అంటూ వార్నింగ్ ఇచ్చినట్లుగా పవన్ ప్రసంగం సాగిందఇక తమిళ సోషల్ మీడియా పవన్ ను ట్రోలింగ్ చేసే స్థాయికి వెళ్లిందంటే.. అక్కడ పవన్ వ్యాఖ్యల సెగ ఏ మేరకు తాకిందో చెప్పనవసరం లేదు. అలా చెప్పిన పవన్.. కొద్దిరోజులకు డీఎంకే బద్దశత్రువైన అన్నాడీఎంకే వ్యవస్థాపకులు ఎంజీఆర్ ను పొగుడుతూ.. ట్వీట్ చేశారు. ఇక డీఎంకే నుండి ట్వీట్ ల వర్షం కురిసి, ఏకంగా పవన్ ను ట్రోలింగ్ చేయగా, అందులోకి సినీనటుడు ప్రకాష్ రాజ్ కూడా ఎంటర్ అయ్యారు. ప్రకాష్ రాజ్, స్టాలిన్ కు మద్దతుగా ట్వీట్ లు చేస్తూ పవన్ టార్గెట్ చేశారు. ఇలా తమిళనాట పవన్ వ్యాఖ్యలు రచ్చ రచ్చకు దారి తీశాయి.ఇది ఇలా ఉంటే తాజాగా అన్నాడీఎంకే పార్టీ 53 వసంతాలు పూర్తి చేసుకోగా, పవన్ చేసిన ట్వీట్ తమిళ రాజకీయాల్లో చర్చకు దారి తీసింది. 53 వ వార్షికోత్సవం సందర్భంగా, పార్టీ నాయకత్వం, సభ్యులు, మద్దతుదారులకు నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. దీనిని 1972 అక్టోబర్ 17న పురాణ “పురాత్చి తలైవర్” తిరు ఎంజి రామచంద్రన్ స్థాపించారు. తమిళనాడులో అన్నాడీఎంకే వేగంగా బలీయమైన రాజకీయ శక్తిగా మారింది. ఎంజీఆర్ పేదల అభ్యున్నతికి లోతుగా కట్టుబడి ఉన్నారు, ఎవరూ ఆకలితో లేరని, ప్రతి వ్యక్తికి గౌరవంగా జీవించే హక్కు ఉందని భరోసా ఇచ్చారంటూ.. దివంగత ముఖ్యమంత్రి జయలలిత, అలాగే పన్నీర్ సెల్వం, ఇతర నేతలను కూడా ప్రశంసించారు.ఈ ట్వీట్ వెనుక, తమిళుల మైత్రికి పవన్ పాకులాడుతున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అలాగే ఇటీవల తమిళ నటుడు కార్తీ హైదరాబాద్ లో తన సినిమా సత్యం సుందరం ప్రమోషన్ వేదికలో పాల్గొన్నారు. అక్కడ యాంకర్ లడ్డు గురించి చేసిన వ్యాఖ్యలకు కార్తీ అడ్డుతగిలినట్లుగా ఆన్సర్ ఇచ్చారు. దీనితో కార్తీపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు పవన్. కార్తీ కూడా వెంటనే స్పందించి సారీ చెప్పేశారు. ఆ సమయంలో కూడా పవన్ ను టార్గెట్ చేస్తూ తమిళ సోషల్ మీడియా పవన్ తప్పు చేశారంటూ కోడై కూసింది. దీనితో పవన్ కూడా మళ్లీ వివరణ ఇచ్చుకున్నారు. అలా తమిళుల చేత కొంత వ్యతిరేక పవనాలు వీయించుకున్న పవన్.. ఆ పరిస్థితిని సద్దుమణిగించేందుకు ప్రయత్నిస్తున్నారంటూ కూడా పొలిటికల్ అనలిస్టులు తెలుపుతున్నారు.ఏదిఏమైనా ఏపీ డిప్యూటీ సీఎం గా ఉన్న పవన్.. అన్నాడీఎంకేకు మద్దతుగా నిలిచినప్పటికీ, తమిళనాట ఏదో స్కెచ్ వేస్తున్నారని, అందుకే అన్నాడీఎంకే మైత్రి కోసం పాకులాడుతున్నట్లు గాసిప్స్ ఊపందుకున్నాయి. మరి ఇది వాస్తవమో.. కాదో కానీ పవన్ ట్వీట్ మాత్రం రాజకీయ చర్చలకు దారితీసింది.

# 8 దేవస్థానాలలో ఆన్లైన్ సేవలు

హైదరాబాద్, అక్టోబరు 18,తెలంగాణ రాష్ట్రంలోని ముఖ్యమైన దేవాలయాల్లో సేవలను బుక్ చేయడం ఇప్పుడు మరింత సులభతరంగా మారింది. ఈ సేవలు ఆన్‌లైన్‌లో కూడా అందుబాటులో ఉండనున్నాయి. దీని ద్వారా భక్తులు ఇంటి వద్ద నుంచే తమ పూజలు, హాల్ బుకింగ్స్ వంటి అవసరాలను పూర్తి చేసుకోవచ్చు. రాష్ట్రంలోని యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం, వరంగల్‌లోని రుద్రేశ్వర ఆలయం (రామప్ప దేవాలయం), వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం, కాళేశ్వరం శివ ఆలయం వంటి ప్రసిద్ధ దేవాలయాల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి.అనేక ప్రసిద్ధ దేవాలయాలు ఇప్పుడు తమ సేవలను ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకునే సౌకర్యాన్ని అందిస్తున్నాయి. భక్తులు తమకు కావాల్సిన పూజలను లేదా వివాహాల కోసం హాల్‌లను ముందుగానే బుక్ చేసుకోవచ్చు. ఈ విధానం భక్తులకు చాలా సౌలభ్యంగా ఉంటుంది, ముఖ్యంగా శుభ ముహూర్తాల సమయంలో వివాహాల సంఖ్య ఎక్కువగా ఉండే కారణంగా, ఫంక్షన్ హాల్స్ కోసం పోటీ పెరుగుతుంది.ఈ సేవల కోసం ప్రత్యేక వెబ్‌సైట్లు ఏర్పాటు చేయబడ్డాయి, అక్కడ భక్తులు ఆలయాలకు వెళ్లకుండా ఆన్‌లైన్‌లో సేవలను బుక్ చేసుకోవచ్చు. పూజల రుసుములు, వివాహాల కోసం హాల్స్ ఖాళీగా ఉన్న తేదీలు వంటి వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి.సుందరాచలం శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయం వంటి దేవాలయాలు కూడా ఆన్‌లైన్ బుకింగ్‌ను ప్రారంభించాయని కథనం తెలియజేస్తుంది.ఆన్లైన్ బుకింగ్ అన్ని ౨ ంజూజూ టనీశ్రీతినీ ద్వారా చేసుకోవచ్చు ప్రసాదాలను సైతం ఇంటి వద్ద నుండే బుక్ చేసుకునే వెసలు బాటను కల్పించారు. దీంతోపాటు దేవస్థానం యొక్క చరిత్రను సైతం ఆన్లైన్లో తెలుసుకునే విధంగా యాప్ను తీర్చిదిద్దారు. మరోవైపు స్వామివారి సేవలకు సంబంధించిన వాటిని సైతం ఆన్లైన్ సదుపాయాన్ని కల్పించారు. సుప్రభాతం అభిషేకం సహస్రనామ అర్చన నిత్య కళ్యాణం తోపాటు 11 రకాల పూజలను ఆన్లైన్ సదుపాయాన్ని కల్పించారు.ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా 8 దేవస్థానాలలో ఆన్లైన్ సదుపాయాన్ని కల్పించారు. ఈ సదుపాయం మరో 39 ప్రధాన ఆలయాలకు సైతం విస్తరించనున్నారు. ఆన్లైన్లోనే టికెట్ కొనుక్కోవడం దానికి సంబంధించిన సాఫ్ట్వేర్ను దేవస్థానంలో అమర్చడం ద్వారా ఇంటి వద్ద నుండే దైవదర్శనం చేసుకోవడంతో పాటు స్వామివారి సేవలను పాల్గొనే సదుపాయాన్ని తీసుకొచ్చారు. మీసేవ కేంద్రాల వద్ద కూడా ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు.



# వ్యాపారం



## దీపావళికి టయోటా బహుమతి..




కార్ల తయారీ సంస్థ టొయోటా దీపావళి సందర్భంగా తన కస్టమర్ల కోసం ప్రత్యేకమైన ఆఫర్ ప్రకటించింది. కంపెనీ తన కాంపాక్ట్ ఎస్‌యూవీ టయోటా అర్బన్ క్రూయిజర్ టేజర్ పరిమిత ఎడిషన్‌ను భారతదేశంలో ప్రవేశపెట్టింది. ఖుంవతీ ఈ కొత్త ఎడిషన్ అక్టోబర్ 31 వరకు మాత్రమే మార్కెట్లో అందుబాటులో ఉంటుంది. ఇది అన్ని వాతావరణ పరిస్థితుల్లోనూ బాగా పనిచేసే గొప్ప ఎస్‌యూవీ. ఇందులో స్థల కొరత లేదు. అర్బన్ క్రూయిజర్ టేజర్‌కు భారతదేశంలో డిమాండ్ నిరంతరం పెరుగుతోంది. డిజైన్ నుండి పనితీరు వరకు కస్టమర్ నిరాశ చెందే ఛాన్స్ లేదు. టయోటా టేజర్ కొత్త ఎడిషన్‌లో ఇంటీరియర్‌తో పాటు ఎక్ట్సీరియర్‌లో కూడా కొత్త మార్పులు చేయబడ్డాయి. ఈ కొత్త మోడల్‌లో రూ.20,000 కంటే ఎక్కువ విలువైన టొయోటా యాక్సెసరీలను అందిస్తున్నారు. టయోటా టేజర్ ఎక్ట్సీరియర్‌లో మార్పులు చేయబడ్డాయి. హెడ్‌ల్యాంప్, ఫ్రంట్ గ్రిల్, సైడ్ మోల్డింగ్‌లు క్రోమ్‌తో అలంకరించబడ్డాయి. దీని సహాయంతో ఇది మరింత ప్రీమియంగా కనిపిస్తుంది. ఇది కాకుండా టేజర్ లోపలి భాగంలో డాక్ వైజర్‌లు, ఆల్-వెదర్ 3డి మ్యాట్‌లు, డోర్ ల్యాంప్స్ జోడించబడ్డాయి. ధర గురించి మాట్లాడితే.. టొయోటా టేజర్ లిమిటెడ్ ఎడిషన్ ఎక్స్-షోరూమ్ ధర రూ. 10.56 లక్షల నుండి మొదలై రూ. 12.88 లక్షల వరకు ఉంటుంది. ఈ ఎడిషన్ 1.0-లీటర్ టర్బో-పెట్రోల్ ఇంజన్‌తో మాత్రమే అందుబాటులో ఉంది. ఈ ఇంజన్ 5-స్పీడ్ మాన్యువల్, 6-స్పీడ్ టార్క్ కన్వర్టర్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ ఎంపికతో అందించబడింది. టయోటా టేజర్‌లో అమర్చబడిన ఈ ఇంజన్ 100 హెచ్‌పి శక్తిని అందిస్తుంది. ఈ వాహనం పనితీరు నగరం, హైవేలో మెరుగ్గా ఉంటుంది. అధిక ట్రాఫిక్‌లో కూడా ఈ కారు సులభంగా ప్రయాణిస్తుంది.

## ఇన్ఫోసిస్ లాభం 6,506 కోట్లు




దేశంలో రెండో అతిపెద్ద ఐటీ సేవలం సంస్థ ఇన్ఫోసిస్ విశ్లేషకుల అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను(జూలై-సెప్టెంబర్ మధ్యకాలంలో) రూ.6,506 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.6,212 కోట్ల లాభంతో పోలిస్తే 4.7 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. తొలి త్రైమాసికపు లాభంతో పోలిస్తే 2.2 శాతం పెరుగుదల కనిపించింది. సమీక్షకాలంలో కంపెనీ రూ.40,986 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఏడాది ప్రాతిపదికన ఆదాయంలో 4.2 శాతం వృద్ధి నమోదైంది. ఆదాయ అంచనాలో వృద్ధిని మరోసారి పెంచింది ఇన్ఫోసిస్. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తానికి తొలి త్రైమాసికంలో 3-4 శాతం మధ్యలో ఆదాయ వృద్ధి ఉంటుందని అంచనావేసిన సంస్థ..రెండో త్రైమాసికంలో దీనిని 3.75 శాతం నుంచి 4.50 శాతం మధ్యలో ఉంటుందని పేర్కొంది. జూన్ త్రైమాసికంలో 1-3 శాతం మధ్యలో ఉంటుందని గతంలో అంచనావేసింది. అతిపెద్ద ఒప్పందాలు కుదుర్చుకోవడం వల్లనే ఆదాయ అంచనాలను సవరిస్తున్నది సంస్థ. మరోవైపు, గత ఆరు త్రైమాసికాలుగా తగ్గుతూ వచ్చిన ఉద్యోగులు గత త్రైమాసికంలో పెరిగారు. సెప్టెంబర్ చివరినాటికి 2,500 మంది సిబ్బంది చేరడంతో మొత్తం 3,17,240కి చేరుకున్నారు. అలాగే ఉద్యోగుల వలసలు మాత్రం స్వల్పం గా పెరిగి 12.9 శాతానికి చేరుకున్నాయి.

## మెటా ఉద్యోగులపై వేటు




కరోనా సమయంలో టెక్నాలజీ రంగంలో ప్రారంభమైన ఉద్వాసనలు ఇంకా కొనసాగుతున్నాయి. టెక్, సోషల్ మీడియా దిగ్గజం మెటా మరోమారు తమ ఉద్యోగులపై వేటు వేస్తోంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, రియాలిటీ ల్యాబ్స్ కోసం పనిచేస్తున్న బృందాలతో సహా మెటా వర్స్ అంతటా తొలగింపులు చేపడుతున్నట్లు వెల్లడించింది. అయితే ఎంత మంది ఉద్యోగులపై వేటు వేసేది వెల్లడించలేదు. కాగా.. తొలగింపుల విషయమై ఇప్పటికే సదరు ఉద్యోగులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఇప్పటికే ఉద్వాసనకు గురైన కొందరు ఉద్యోగులు సామాజిక మాధ్యమాల వేదికగా పోస్టులు పెడుతున్నారు. ఇటీవల ఇంటెల్, సిస్కో, ఐబీఎం కంపెనీలు పెద్ద ఎత్తును సిబ్బందిని తొలగించాయి. ఈ ఏడాది ఆగస్టు నాటికి 422 కంపెనీలు ఏకంగా 1,36,000 మందిని తొలగించాయని అంచనా. మెటాలో ముఖ్యంగా నియామకాలు, లీగల్ ఆపరేషన్ పలు రంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులపై ఎక్కువగా ప్రభావం పడనుందని సమాచారం. ఇప్పటికే పలుసార్లు ఉద్యోగులను తొలిగించగా.. కరోనా నష్టాల బూచిని చూపి 2022లో ఏకంగా 11,000 మందిని రోడ్డున పడేసింది. ఇక గతేదాది రెండు విడతల్లోనూ సుమారు 10,000 మందిని తొలగించింది. తాజాగా మరోమారు ఉద్వాసనలకు సిద్ధం కావడంతో ఆ రంగం ఉద్యోగులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. కంపెనీ సామర్థ్యాన్ని మెరుగుపర్చడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. దీర్ఘకాలిక వ్యూహాత్మక లక్ష్యాలు, ప్రాంతీయ వ్యూహాల్లో మార్పులు చేస్తున్నామని మెటా అధికారిక ప్రతినిధి తెలిపారు. అందులో భాగంగానే ఈ తొలగింపులు చేపడుతున్నట్లు వెల్లడించారు. మెటా నుంచి ఉద్వాసన పలికిన ఉద్యోగులకు ప్రత్యామ్నాయ అవకాశాలు అందించేందుకు కంపెనీ ప్రయత్నం చేస్తుందన్నారు.

## పసిడి ధరలు పెరుగుదల కారణాలు



భారత్‌లో బంగారం ధరలు గురువారం చరిత్రలో తొలిసారిగా ఆల్‌టైమ్ హైకి చేరుకున్నది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో పది గ్రాముల బంగారం ధర రూ.76,899 వద్ద ట్రేడవుతున్నది. అయితే, బంగారం పెరుగుదలను కారణాలు అనేకం ఉన్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. ఇందులో ప్రధానంగా సెంట్రల్ బ్యాంకుల వైఖరి, బాండ్ ఈల్డ్‌లను తగ్గించడం, పెరిగిన భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కారణాలని పేర్కొంటున్నారు. కేడియా అడ్వైజరీ డైరెక్టర్ అజయ్ మాట్లాడుతూ బంగారం ధరలు ఆల్‌టైమ్ హైకి చేరుకునేందుకు సెంట్రల్ బ్యాంకుల దృక్పథం, బాండ్ ఈల్డ్‌ల తగ్గింపుతో బులియన్ మార్కెట్‌లో డిమాండ్ పెరిగి మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో బంగారం ధర రూ.76,899 ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయిని తాకిందన్నారు. ఫెడరల్ రిజర్వ్ ఈ ఏడాది మరోసారి వడ్డీ రేట్లను తగ్గించవచ్చని భావిస్తున్నారు. గత నెలలో వడ్డీ రేట్లలో కోత విధించిన విషయం తెలిసిందే. నవంబర్‌లోనూ 25 బేసిస్ పాయింట్లు కోత పెట్టే అవకాశం ఉందని అంచనా. ఇంకా అమెరికా అధ్యక్ష ఎన్నికలు, లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో మధ్యప్రాచ్యం ఉద్రిక్తతల కారణంగా బంగారం ధరలు పెరిగాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా బంగారం ధరలు పెరుగుతున్నాయని కొటక్ సెక్యూరిటీస్ కమోడిటీ రీసెర్చ్ ఏవీపీ కైనాట్ చైన్‌వాలా తెలిపారు. యూఎస్ ట్రెజరీ దిగుబడులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల మధ్య కామెక్స్‌లో బంగారం ధరలు పెరిగాయన్నారు. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు.. లెబనాన్‌లోని హిజ్బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ దాడుల తర్వాత కామెక్స్‌లో బంగారం 0.5శాతం పెరిగి ఔన్స్‌కు 2,691.30 వద్ద ముగిసిందని చెప్పారు. బంగారం అదే ట్రెండ్‌ను కొనసాగిస్తే ప్రారంభ సెషన్‌లో 2,700.60 డాలర్లకు చేరుకుందన్నారు. త్వరలో జరుగబోయే అమెరికా ఎన్నికలపై అనిశ్చితి, కీలక ఆర్థిక డేటా అంచనాల కారణంగా బంగారం ధరలు పెరుగుతున్నాయన్నారు.

## సెంట్రల్ బ్యాంక్ లాభాలు 51 శాతం వృద్ధి



ప్రభుత్వ రంగంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో 50.91 శాతం వృద్ధితో రూ.913 కోట్ల నికర లాభాలు సాధించింది. నికర వడ్డీ ఆదాయం, రద్దు చేసిన ఖాతాల రికవరీల్లో పెరుగుదల లాభాల వృద్ధికి ప్రధాన మద్దతును అందించాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.605 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.8,412 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం.. గడిచిన క్యూ2లో 9,849 కోట్లకు చేరినట్లు ఆ బ్యాంక్ రెగ్యూలేటరీ ఫైలింగ్‌లో వెల్లడించింది. క్రితం క్యూ2లో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 3,410 కోట్లకు పెరిగిందని తెలిపింది. 2023-24 ఇదే క్యూ2లో రూ.3,028 కోట్ల ఎన్ఐఐ నమోదయ్యింది. 2024 సెప్టెంబర్ ముగింపు నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 4.59 శాతానికి తగ్గాయి. గతేడాది ఇదే కాలం నాటికి 4.62 శాతం నిరర్థక ఆస్తులు చోటు చేసుకున్నాయి.

ప్రయివేటు రంగంలోని యాక్సిస్ బ్యాంక్ 2024-25 సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 18 శాతం వృద్ధితో రూ.6,918 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 9 శాతం పెరిగి రూ.13.483 కోట్లుగా నమోదయ్యింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 29 బేసిస్ పాయింట్లు తగ్గి 1.44 శాతంగా చోటు చేసుకున్నాయి.

## హ్యుందాయ్ ఐపీఓపై పెద్ద ఇన్వెస్టర్ల ఆసక్తి




దేశంలోని అతిపెద్ద ఐపీవో అయిన హ్యుందాయ్ మోటార్ ఇండియా ఐపీఓ ముగిసింది. హ్యుందాయ్ మోటార్ ఇండియా ఐపీవో పై పెట్టుబడిదారులలో పెద్దగా ఉత్సాహం కనిపించలేదు. ముఖ్యంగా రిటైల్ పెట్టుబడిదారులు ఈ ఇ్యూలో పెట్టుబడి పెట్టకుండా తప్పించుకున్నారు. అంటే రిటైల్ విభాగంలో అందించబడిన షేర్ల సంఖ్య నుండి సగం దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. అయితే, మూడు రోజుల తర్వాత, ఆటోమొబైల్ దిగ్గజం హ్యుందాయ్ మోటార్ ఇండియా యొక్క ఐపీవో మొత్తం 2.37 రెట్లు సబ్‌స్క్రైబ్ చేయబడింది. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల (క్యూఐబీ) కోసం కేటాయించిన షేర్లు 6.97 రెట్లు మాత్రమే సబ్‌స్క్రయిబ్ అయ్యాయి. అయితే, నాన్-ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు, రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి స్పందన కరువైంది. కంపెనీ నాన్-ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల పోర్షన్‌లోని 60 శాతం షేర్లు, రిటైల్ ఇన్వెస్టర్ల పోర్షన్‌లో 50 శాతం షేర్లకు మాత్రమే బిడ్‌లను అందుకుంది. దీంతో రిటైల్, నాన్-ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల వర్గాల నుండి దరఖాస్తు చేసుకున్న వారందికీ షేర్లు కేటాయించబడతాయి. హ్యుందాయ్ మోటార్స్ ఇండియా దేశంలోనే అతిపెద్ద ఐపీవోను తీసుకొచ్చింది. అయితే దీనికి ఇన్వెస్టర్ల నుంచి ఓ మోస్తరు స్పందన లభించింది. స్టాక్ మార్కెట్‌లో ఈ ఇష్యూ లిస్టింగ్ అక్టోబర్ 22న జరగవచ్చు. ఐపీవో కింద కంపెనీ షేర్ల ధరను రూ.1865-1960గా నిర్ణయించింది. ఐపీవో కోసం కోసం కంపెనీ 7 షేర్లను కలిపి ఒక లాట్ ను సెట్ చేసింది. రిటైల్ పెట్టుబడిదారులు కనీసం ఒక లాట్‌కు రూ. 13,720 వేలం వేయవలసి ఉంటుంది. హ్యుందాయ్ ఐపీవో గ్రే-మార్కెట్లో నిరంతరం క్షీణిస్తోంది. సబ్‌స్క్రిప్షన్ ముగిసిన తర్వాత, హ్యుందాయ్ మోటార్ ఇండియా ఐపీవో జీఎంపీ ధర రూ.5కి పడిపోయింది. దీని ప్రకారం, లిస్టింగ్ సమయంలో సంపాదన అంచనా చాలా తక్కువగా ఉంది. నిపుణులు కూడా దీనిని ప్రతికూలత కలిగించేలా ఉందని మాట్లాడుతున్నారు.మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఈ ఐపీవో వాల్యుయేషన్ చాలా ఖరీదైనదిగా కనిపిస్తోంది. ఈ ఐపీవో కొంచెం చౌకగా ఉండాలి. ఇది కాకుండా, కంపెనీ ఓఎఫ్ఎస్ ద్వారా షేర్లను విక్రయిస్తోంది. అంటే దాని ఐపీవో నుండి వచ్చే డబ్బు ప్రమోటర్లకు వెళుతుంది. కంపెనీ వృద్ధి, ఇతర విషయాల కోసం ఖర్చు చేయబడదు. దీనికి తోడు మార్కెట్‌లో నిరంతర క్షీణత కూడా ఒక కారణం. హ్యుందాయ్ ఇండియా ఈ ఐపీవో క్రింద ఎలాంటి కొత్త షేర్లను జారీ చేయలేదు.




# ఆరోగ్యం



## పుట్టబోయే బిడ్డ అవయవాలు ప్లాస్టిక్‌తో నిండిపోతే.!



ప్లాస్టిక్ కాలుష్యం పర్యావరణానికి ముప్పుగా పరిణమించింది. గ్రహం, మనుషుల ఆరోగ్యంపై ప్రభావం ఆందోళనలను రేకెత్తిస్తుంది. ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన మహాసముద్రాలు, ఆహారంలోకి చొరబడిన మైక్రో ప్లాస్టిక్స్, శ్వాస తీసుకుంటే బ్రెయిన్ లోకి వెళ్తున్న ప్లాస్టిక్ కణాలు.. రక్తం, గుండె చివరకు జననేంద్రియాల్లోనూ కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో శాస్త్రవేత్తలు, ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగం నుంచి దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.కాగా తాజా అధ్యయనం మరో బాంబు పేల్చింది. గర్భంలో ఉన్న బిడ్డకు తల్లి నుంచి ప్లాస్టిక్స్ చేరే అవకాశం ఉందని తెలిపింది. పాలిమైడ్ 12 అని పిలువబడే చిన్న ప్లాస్టిక్ కణాలు.. నవజాత శిశువుల గుండె, మెదడు, కాలేయం, ఊపిరితిత్తులు, మూత్రపిండాల్లోకి చేరుతాయని తెలిపింది. ఈ పరిశోధన గర్భధారణ సమయంలో పిండం అభివృద్ధిపై భయాన్ని.. తీసుకోవాల్సిన జాగ్రత్తలను హైలెట్ చేస్తుంది. సైన్స్ ఆఫ్ ది టోటల్ ఎన్విరాన్మెంట్ జర్నల్ లో ప్రచురించిన అధ్యయనం ప్రకారం.. ఈ ప్లాస్టిక్ కణాలు ప్లాసెంటల్ అవరోధాన్ని దాటుకుని, అభివృద్ధి చెందుతున్న పిండాన్ని హానికరమైన కాలుష్య కారకాలకు గురిచేస్తాయి. రట్జర్స్ హెల్త్ పరిశోధకులు చేసిన ప్రయోగంలో ఎలుకలను వారం రోజులపాటు ప్లాస్టిక్ కణాలకు బహిర్గతం చేశారు. తల్లి, పిండం మధ్య రక్త ప్రసరణలో కూడా వీటిని గుర్తించారు. బిడ్డ పుట్టిన రెండు వారాల తర్వాత పరిశీలించగా.. తల్లి మెదడు, మూత్రపిండాలు, గుండె, కాలేయంలో ఉన్న అవే ప్లాస్టిక్స్ నవజాత శిశువుల అవయవాల్లో గుర్తించారు. ఇవి బేబీ ఎదుగుదలపై భారీ ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని తెలిపారు. కాగా ప్లాస్టిక్ పొల్యూషన్ దీర్ఘకాలిక ఆరోగ్య ప్రభావంపై తీవ్ర ఆందోళనలను పెంచుతుంది.

## భోజనం చేశాక స్నానం చేస్తున్నారా?



ఇంటర్నెట్ డెస్క్: కొందరికి భోజనం చేశాక స్నానం చేసే అలవాటు ఉంటుంది. దీని వల్ల సేదతీరిన ఫీలింగ్ కలుగుతుందని చెబుతుంటారు. అయితే, ఈ అలవాటుతో కొన్ని సమస్యలు వచ్చే ఛాన్స్ ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వైద్యులు చెప్పే దాని ప్రకారం, జీర్ణవ్యవస్థ పనితీరును స్వయంచోదిత నాడీ వ్యవస్థ నియంత్రిస్తుంది. ఇందులో ప్రధాన శాఖ అయిన సహసహానుభూత నాడీ వ్యవస్థ నియంత్రణలో జీర్ణక్రియ ఉంటుంది. భోజనం చేసిన తరువాత ఈ నాడీ వ్యవస్థ క్రియాశీలకమైన జీర్ణక్రియ సాఫీగా సాగేలా చేస్తుంది. ముఖ్యంగా జీర్ణవ్యవస్థకు రక్తప్రసరణ పెంచి వేగంగా ఆహారం జీర్ణమయ్యేలా చేస్తుంది. అయితే, భోజనం తరువాత వెంటనే చేసే స్నానం ఈ ప్రక్రియ మొత్తాన్ని ప్రభావితం చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఒంటిపై పడే వేడి నీళ్ల కారణంగా శరీర ఉష్ణోగ్రత పెరుగుతుందని వైద్యులు చెబుతున్నారు. ఈ క్రమంలో శరీరాన్ని చల్లబరిచేందుకు చర్మంలోని రక్తనాణాలాల్లో రక్తప్రసరణ పెరుగుతుంది. అలా చర్మం, రక్తం ద్వారా శరీరంలోని వేడి బయటకు పోతుంది. ఈ క్రమంలో జీర్ణవ్యవస్థకు రక్తప్రసరణ తగ్గి అడ్డంకులు ఏర్పడతాయి. ఫలితంగా అన్నం అరగకపోయినట్టు ఉండటం, గ్యాస్ ఏర్పడటం వంటి పలు ఉదర సంబంధిత సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఈ అలవాటు దీర్ఘకాలంలో అనేక ఇతర సమస్యలకు దారి తీస్తుందని హెచ్చరిస్తున్నారు. భోజనం తరువాత వేడి నీటి స్నానం తాలూకు ప్రభావం నాడీవ్యవస్థపై కూడా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.ముఖ్యంగా జీర్ణక్రియ సాఫీగా సాగడంలో వేగస్ నాడి కీలక పాత్ర పోషిస్తుంది. జీర్ణవ్యవస్థకు రక్తసరఫరా తగ్గినప్పుడు వేగస్ నాడి కూడా జీర్ణక్రియపై పట్టు కోల్పోతుందని ఫలితంగా అనేక రకాల సమస్యలు తలెత్తుతాయని చెబుతున్నారు. దీర్ఘకాలంలో దీని వల్ల మాల్‌అబ్సార్ప్షన్ సిండ్రోమ్ వస్తుంది. శరీరం పూర్తిస్థాయిలో పోషకాలను గ్రహించలేక సమస్యలు మొదలవుతాయి. కాబట్టి, భోజనం తరువాత స్నానం చేద్దామనుకునే వారు కాస్త అప్రమత్తంగా ఉండాలని నిపుణులు చెబుతున్నారు.

## అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను ఫ్రిడ్జ్‌లో పెట్టడం మంచిదేనా!



అల్లం వెల్లుల్లి పేస్ట్.. ఈ మద్య కాలంలో వంటల్లో చాలా సాధారణం అయిపోయింది. మొదట్లో అల్లం వెల్లుల్లి పేస్ట్ ను మసాలా వంటల్లోనే ఉపయోగించేవారు. కానీ ఇప్పుడు అల్లం వెల్లుల్లి పేస్ట్ సాధారణ కూరల్లో కూడా ఉపయోగిస్తున్నారు. ఈ కారణంగా చాలామంది అల్లం వెల్లుల్లి పేస్ట్ ను పెద్ద మొత్తంలో తయారు చేసుకుని లేదా కొని ఫ్రిడ్జ్ లో నిల్వ చేస్తుంటారు. అయితే దీన్ని ఫ్రిడ్జ్ లో నిల్వ చేయడం మంచిదేనా? దీన్ని నిల్వ చేయడానికి సరైన పద్ధతి ఏంటి? అల్లాన్ని, వెల్లుల్లిని ఫ్రిజ్ లో పెడితే జరిగేదేంటి? టీ నుండి కూరలు వండటం వరకు అల్లం వాడతారు. చలికాలంలో అల్లం ఎక్కువగా తీసుకుంటారు. అయితే అల్లం చాలా రకాల ఆరోగ్య సమస్యలకు దివ్య ఔషధంలా పనిచేస్తుంది. అయితే అల్లాన్ని మార్కెట్ నుండి తీసుకురాగానే నేరుగా ఏదో ఒక కవర్ లో వేసి ఫ్రిడ్జ్ లో పెట్టేస్తుంటారు. అవసరమైనప్పుడు వాడుకోవడానికి తీసుకుని దాన్ని కడిగి వాడుతుంటారు. ఈ సందర్భాలలో కొన్ని సార్లు అల్లం కుళ్లిపోవడం కూడా గమనించవచ్చు. అయితే అల్లం అలా పాడవకుండా ఉండాలంటే మార్కెట్ నుండి తీసుకురాగానే అల్లాన్ని శుభ్రంగా కడగాలి. అల్లానికి మురికి, మట్టి పోయేదాక కడిగి ఆ తరువాత పొడి గుడ్డతో తుడవాలి. గాలికి ఆరబెట్టిన తరువాత గాలి చొరబడని కంటైనర్ లో ఒక కాగితం పెట్టి అందులో అల్లాన్ని ఉంచి ఫ్రిడ్జ్ లో పెట్టాలి. ఇలా చేయడం వల్ల అల్లం నెలల తరబడి కూడా పాడవకుండా నిల్వ ఉంటుంది. అల్లాన్ని ఫ్రిడ్జ్ లో ఉంచినట్టు చాలామంది వెల్లుల్లిని కూడా ఫ్రిడ్జ్ లో ఉంచుతారు. ముఖ్యంగా బిజీ లైఫ్ లో ఉన్నవారు కూరగాయలను తీరక దొరికినప్పుడు కట్ చేసి ఫ్రిడ్జ్ లో పెడుతుంటారు. ఉదయాన్నే వంట, టిఫిన్ చేయడానికి చాలా సులువుగా ఉంటాయని అనుకుంటారు. కానీ ఇలా కూరగాయలు ముందే కట్ చేసి పెట్టుకోవడం కానీ, వాటితో పాటు వెల్లుల్లిని ముందే ఒలిచి ఫ్రిడ్జ్ లో నిల్వ చేసుకోవడం కాదు. వెల్లుల్లిని ఫ్రిడ్జ్ లో ఉంచితే మొలకలు వస్తాయి. పైగా వాటిని సరిగా నిల్వచేయకపోతే పాలు, పెరుగు సహా అన్ని పదార్థాలకు వెల్లుల్లి వాసన పట్టేస్తుంది. కాబట్టి వెల్లుల్లిని ఫ్రిడ్జ్ లో పెట్టకపోవడం మంచిది.

## రోజూ గుప్పెడు బాదం తింటే..



నిత్యం బాదం తీసుకుంటే ఆరోగ్యానికి చాలా మంచిదని వైద్యులు చెబుతున్నారు. బాదంను సూపర్‌ఫుడ్ అని పిలుస్తారు. దీనిలో ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే పోషకాలు పుష్కలంగా ఉన్నాయి.విటమిన్ ఇ, ఫైబర్, ప్రొటీన్, ఖనిజాలు చాలా ఉంటాయి. ఇందులో ఉండే మోనోశాకరైడ్లు గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో ఉపయోగపడతాయి. గుప్పెడు బాదాన్ని మీ డైట్‌లో చేర్చుకుంటే. చురుగ్గా మెదడు.. నిత్యం కొన్ని బాదం పప్పులను మీ డైట్‌లో చేర్చుకుంటే మెదడు చురుగ్గా మారుతుంది. మెదడు పనితీరు మెరుగుపడుతుంది. ఆలోచన సామర్థ్యం, మానసిక స్థైర్యం పెరుగుతుంది. గుండెకు బలం.. బాదం ఈ కాలంలో ప్రతి రోజూ తీసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు అందుతాయి. ఇందులోని సంతృప్త కొవ్వులు తక్కువగా ఉండి, మోనోశాచురేటెడ్ కొవ్వులు ఎక్కువగా ఉంటాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి, యాంటీ ఆక్సిడెంట్ గా పనిచేస్తుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడటంలో సహకరిస్తుంది.మెదడు పనితీరు.. బాదంలోని విటమిన్ ఇ, యాంటీ ఆక్సిడంట్లు, ఒమేగా 3, ఫ్లాటీ యాసిడ్స్ తో సహా అన్ని పోశకాలు మెదడు పనితీరులో కీలకంగా పనిచేస్తాయి. తెలివి తేటలను పెంచడంలోనూ బాదం మెరుగ్గా పనిచేస్తుంది. రోగ నిరోధక శక్తి.. బాదంలో ఉండే విటమిన్లు, పోషకాలు జలుబుస ఫ్లూ వంటి లక్షణాలను దూరం చేయడంలో సహకరిస్తుంది. చాలా రకాల వ్యాధులతో పోరాడేందుకు శీతాకాలంలో రోగ నిరోధక వ్యవస్థను బలోపేతం చేసేందుకు సహకరిస్తుంది. బరువు తగ్గడంలోనూ.. క్యాలరీలు ఎక్కువగా ఉన్న బాదాన్ని తీసుకోవడం వల్ల బరువును తగ్గించడంలో సహకరిస్తుంది. బాదంలో ఫైబర్, ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు సంతృప్తిగా ఉన్నాయి. ఇవి అతిగా తినే అలవాటును తగ్గించడంలో, బ్యాలెన్స్ డైట్ తీసుకునే విధంగా ప్రోత్సహిస్తాయి. ఆకలిని నియంత్రించడంలో సహాయపడుతుంది.

జీర్ణక్రియ.. బాదం ఫైబర్ అధికంగా ఉండే ఆహారం. ఇది జీర్ణ క్రియకు సహకరిస్తుంది. మలబద్దకాన్ని తగ్గిస్తుంది. ఫైబర్ కంటెంట్ ఆరోగ్యకరమైన ప్రేగు కదలికలను ప్రోత్సహిస్తుంది. జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది. చర్మం నిగారింపు.. బాదంపప్పులో విటమిన్ ఇ, యాంటీఆక్సిడెంట్లు, చర్మాన్ని నిగారింపుతో, కాంతి వంతంగా ఉంచేందుకు సహకరిస్తాయి. మెరిసే చర్మం కావాలంటే రోజూ నాలుగు నుంచి ఆరు బాదం పప్పులను నీటిలో రాత్రి నానబెట్టి ఉదయాన్నే తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.

## చిన్నపిల్లలకు ఆయిల్ మసాజ్ చేస్తున్నారా!

పిల్లల సంరక్షణ చాలా బాధ్యతతో కూడుకుని ఉంటుంది. ముఖ్యంగా చిన్న పిల్లలు, అప్పుడే పుట్టిన పిల్లలు చాలా సున్నితంగా ఉంటారు. వారికి ఒక వయసు వచ్చేవరకు వారిని చాలా జాగ్రత్తగా హ్యాండిల్ చేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా పిల్లలకు స్నానం చేయించడం అమ్మమ్మలు, బామ్మల పర్యవేక్షణలో లేదా వారి చేతుల మీద జరుగుతూ ఉంటుంది. చాలా కాలం నుంచే చిన్న పిల్లలకు ఒళ్లంతా నూనెతో మసాజ్ చేసి ఆ తరువాత స్నానం చేయించడం జరుగుతోంది. ఇదే పద్ధతి మళ్లీ ఈ మద్య కాలంలో బేబీ మసాజ్ పేరిట కొత్త పుంతలు తొక్కుతోంది. పిల్లలకు మసాజ్ చేయడం కోసం కొబ్బరినూనె, ఆలివ్ నూనె, బాదం నూనె లేదా ఆవాల నూనె వంటివి ఉపయోగిస్తుంటారు. అసలు పిల్లలకు మసాజ్ చేయడం ఎంత వరకు మంచిది? పిల్లలకు మసాజ్ చేయడం వల్ల కలిగే ప్రయోజనాలేంటి? తెలుసుకుంటే..మసాజ్ అనేది శరీరంలో కండరాలను ఒత్తిడికి గురి చేసే ప్రక్రియ. ఇది శరీరంలో కండరాలను రిలాక్స్ చేస్తుంది. ఎముకలు, కీళ్లు మొదలైన వాటి ఆరోగ్యం మెరుగ్గా ఉండేలా చేస్తుంది. శరీర కణజాల అభివృద్ధికి దోహదపడుతుంది. మసాజ్ వల్ల కలిగే ప్రయోజనాలేంటంటే.. చిన్న పిల్లలకు మసాజ్ ఎన్నో ఏళ్ల కిందటి నుండి పెద్దలు చేస్తున్న ప్రక్రియనే అయినా.. నేటి కాలంలో వైద్య పరంగాను, పిల్లల సంరక్షణలో భాగంగానూ దీనికి ప్రాధాన్యత పెరిగింది. ముఖ్యంగా 2021లో జరిగిన పరిశోధనలలో పిల్లలకు మసాజ్ చేయడం వల్ల కింది ప్రయోజనాలు కలుగుతాయని స్పష్టం చేశారు.. పిల్లలకు మసాజ్ చేయడం వల్ల కండరాలు, ఎముకలు బలపడతాయి. దీని వల్ల పిల్లలు బలంగా ఉంటారు. మసాజ్ చేస్తే చేతులు, కాళ్లలో పట్టు పెరుగుతుంది. కాళ్లు చేతులు దృఢంగా మారతాయి. కాళ్లు చేతులలోనే కాకుండా శరీరం అంతా రక్తప్రసరణ మెరుగ్గా ఉంటుంది. మసాజ్ చేసిన తరువాత పిల్లలకు స్నానం చేయిస్తే హాయిగా నిద్ర పోతారు. ఇది పిల్లలలో నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తుంది. పిల్లలలో అలసట, ఒత్తిడి వంటివి తగ్గుతాయి. పిల్లలకు మసాజ్ చేయడం వల్ల శరీరంలో రక్త ప్రవాహం, ఆక్సిజన్ ప్రవాహం మెరుగవుతుంది. శ్వాస ఆరోగ్యం బలపడుతుంది. ఊపిరితిత్తుల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. గ్యాస్, ఉబ్బరం, కండరాల తిమ్మిరి, మలబద్దకం వంటి సమస్యలు పిల్లలలోనూ ఉంటాయి. పిల్లలకు మసాజ్ చేయడం వల్ల ఇవన్నీ తగ్గుముఖం పడతాయి.

## ఏ వయసులో దంతాలు బలహీనమవుతాయి..?



దంతాలు మానవ జీవితంలో అంతర్భాగం. నోటి ఆరోగ్యం మన మొత్తం ఆరోగ్యానికి సంబంధించినది. ఇది ఆరోగ్యానికి చాలా ముఖ్యమైన అంశం అయినప్పటికీ, చాలా మంది దంత పరిశుభ్రతపై పెద్దగా శ్రద్ధ చూపరు. రోజుకు రెండుసార్లు పళ్ళు తోముకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. కానీ, చాలా తక్కువ మంది మాత్రమే దీనిని అనుసరిస్తున్నారు. మీకు పంటి నొప్పి వచ్చినప్పుడు లేదా పరిస్థితి మీ అదుపులో లేనప్పుడు దంతవైద్యుని వద్దకు వెళ్లే బదులు, వారిని క్రమం తప్పకుండా సందర్శించడం , మంచి పరిశుభ్రత గురించి తెలుసుకోవడం మీ దంతాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి మీకు సహాయపడుతుంది. ముఖ్యంగా ఇటీవలి కాలంలో చాలా మందిలో దంత సమస్యలు పెరుగుతున్నాయి. కాబట్టి, పంటి నొప్పి, పుచ్చిపోవడం లేదా మరేదైనా సమస్య ఉన్నప్పుడు ఒక వ్యక్తి చిరాకు పడతాడు. ముఖ్యంగా కొన్ని వయసులలో దంతాలు చాలా సున్నితంగా ఉంటాయి. ప్రధానంగా 20 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్కులు దంత సమస్యలకు గురవుతారు. ఈ సమస్యలో పంటి నొప్పి, యాసిడ్ రియాక్షన్లు, క్షయం , ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి దీని వెనుక గల కారణాలు , దీనికి పరిష్కారం ఏమిటో తెలుసుకుందాం. సున్నితమైన దంతాల కారణాలు: సున్నితమైన దంతాలకు అత్యంత సాధారణ కారణం బలహీనమైన చిగుళ్ళు. బలహీనమైన చిగుళ్ళు దంత సమస్యలకు దారితీస్తాయి. దంతాలలో ఆమ్ల పదార్థాలు చేరడం: దంతాల ఎనామిల్, బలమైన బ్రషింగ్, ఆమ్ల ఆహారాలు , పానీయాలు దంతాలను దెబ్బతీస్తాయి. ఈ కారకాలన్నీ దంతాల నిర్మాణం సమస్యలను కలిగిస్తాయి. మీరు హార్డ్ బ్రష్ ఉపయోగిస్తుంటే ఈ సమస్య పెరుగుతుంది. కాబట్టి ఎల్లప్పుడూ మృదువైన బ్రష్‌ని ఉపయోగించండి. గట్టి బ్రష్ మీ దంతాలను అనేక విధాలుగా దెబ్బతీస్తుంది.

# సినిమా



## దర్శకుడిగా యువన్ శంకర్‌రాజా



దక్షిణాది చిత్ర పరిశ్రమలో ప్రముఖ సంగీత దర్శకుడిగా రాణిస్తున్న అతికొద్దిమంది దర్శకుల్లో యువన్‌శంకర్ రాజా ఒకరు. ప్రఖ్యాత సంగీత దర్శకుడు ఇళయరాజా వారసుడైన ఆయన 'ప్యార్ కాదల్' అనే చిత్రం ద్వారా నిర్మాతగా మారారు. అందులో హరీశ్ కళ్యాణ్ కథానాయకుడిగా నటించారు. ఆ తర్వాత విజయ్ సేతుపతి హీరోగా 'మామనిదన్' చిత్రాన్ని నిర్మించారు. ఈ రెండు చిత్రాలు కూడా మంచి విజయాన్ని సాధించాయి. తాజాగా ఆయన సంగీతాన్ని అందించిన 'గోట్' చిత్రం కమర్షియల్‌గా మంచి విజయాన్ని సాధించింది. ప్రస్తుతం మరికొన్ని సినిమాలకు ఆయన సంగీతాన్ని అందిస్తున్నారు. అయితే ఆయన త్వరలో ఓ సినిమాకు దర్శకత్వం వహించనున్నట్లుగా ప్రకటించారు. ఇటీవల ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తాను త్వరలో మెగా ఫోన్ పట్టనున్నట్లు వెల్లడించారు. తాను దర్శకత్వం వహించే చిత్రంలో నటుడు శింబును కథానాయకుడిగా ఎంపిక చేసినట్లు వివరించారు. నటుడు శింబు ప్రస్తుతం మణిరత్నం దర్శకత్వంలో కమలహాసన్ కథానాయకుడిగా నటించిన 'థగ్‌లైఫ్' చిత్రంలో ప్రధాన పాత్రను పోషించారు. అనంతరం కమల్‌హాసన్ తన రాజ్‌కమల్ ఫిలింస్ పతాకంపై నిర్మించనున్న చిత్రంలో కూడా శింబు నటించనున్నారు.

### ప్రేక్షకులకు కృతజ్ఞతలు

గోపీచంద్, దర్శకుడు శ్రీను వైట్ల కాంబోలో రూపొందిన చిత్రం 'విశ్వం'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, వేణు దోనేపూడి చిత్రాలయం స్టూడియోస్ పై నిర్మాత టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. దోనేపూడి చక్రపాణి సమర్పించారు. దసరా కానుకగా రిలీజైన ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించిన బ్లాక్‌బస్టర్ రెస్పాన్స్‌తో ఘన విజయాన్ని సాధించింది. ఈ సందర్భంగా మేకర్స్ దసరా బ్లాక్ బస్టర్ సక్సెస్ మీట్ నిర్వహించారు. హీరో గోపీచంద్ మాట్లాడుతూ,'ఈ సినిమాని ఇంత గొప్పగా ఆదరించిన ప్రేక్షకులు థ్యాంక్స్. ఇంత మంచి సక్సెస్ ఇచ్చినందుకు మీ అందరికీ ఎప్పుడూ రుణపడి ఉంటాను. ఈ సినిమా విషయంలో డైరెక్టర్‌ని బ్లైండ్‌గా నమ్మేశాను. చాలా మంచి రిజల్ట్ ఇచ్చారు. థియేటర్స్‌లో ప్రేక్షకుల నవ్వులు చూస్తుంటే చాలా హ్యాపీగా ఉంది. కామెడీ, యాక్షన్, ఎమోషన్ అన్ని సీన్స్‌ని చాలా బాగా ఎంజారు చేస్తున్నారు. ఇందులో చిన్న పాప అద్భుతంగా నటించింది. ఆ పాప సెంటిమెంట్ కూడా బాగా వర్క్ అవుట్ అయింది. వర్డ్ ఆఫ్ మౌత్ అని వింటా ఉన్నాను. కానీ ఈ సినిమాకి చూశాను. ప్రేక్షకులు ఓన్ చేసుకుంటే సినిమాని ఎంత దూరమైనా తీసుకెళ్తారని ఈ సినిమాతో నిరూపించారు' అని తెలిపారు. 'ఈ సినిమాతో వర్డ్ ఆఫ్ మౌత్ పవర్ ఏంటో తెలుసుకున్నాను. ఎందుకంటే ఈ సినిమా త్రీ టైమ్స్ హైయ్యర్ రెవెన్యూ సెకండ్ డే చేసింది. వీక్ డేస్‌లో కూడా అదే కంటిన్యూ అవుతుంది.

## కాంతార హీరోతో జై హనుమాన్ ?



2024 బ్లాక్ బస్టర్స్ లో ఒకటిగా సంచలన రికార్డులు నమోదు చేసిన హనుమాన్ కొనసాగింపు జై హనుమాన్ ఇంకా మొదలుకాని సంగతి తెలిసిందే. మొదటి భాగంలో హనుమంతుడిని గ్రాఫిక్స్ లో చూపించినట్టు కాకుండా ఈసారి ఎవరైనా పెద్ద హీరోతో చేయించాలనేది దర్శకుడు ప్రశాంత్ వర్మ ఆలోచన. తొలుత చిరంజీవి, రామ్ చరణ్ అంటూ ఏవో పేర్లు ప్రచారంలోకి వచ్చాయి కానీ నిజానికవి వట్టి పుకార్లే. తాజా లీక్ ప్రకారం కాంతార ఫేమ్ రిషబ్ శెట్టిని అంజనీ పుత్రుడిగా దాదాపు ఖరారు చేసుకున్నట్టు బెంగళూరు టాక్. ప్రస్తుతం కాంతార 2లో బిజీగా ఉన్న ఇతను ఇంకో ఆరేడు నెలలు అందుబాటులోకి వచ్చే పరిస్థితి లేదు. ఈ లోగా జై హనుమాన్ స్క్రిప్ట్, ప్రీ ప్రొడక్షన్ పనులతో పాటు మోక్షజ్ఞ డెబ్యూ మూవీని పూర్తి చేసే లక్ష్యంతో ఉన్నాడు ప్రశాంత్ వర్మ. దాని తర్వాతే జై హనుమాన్ మొదలుపెట్టాల్సి ఉంటుంది. రిషబ్ శెట్టి కథ విని సానుకూలంగా స్పందించాడని, సహజంగా దైవభక్తి మెండుగా ఉండే ఇతను కోరి మరీ అంత గొప్ప పాత్ర వస్తే నో చెప్పే ఛాన్స్ ఉండదని ఇన్ సైడ్ టాక్. మొదటి భాగం నిర్మించిన ప్రైమ్ షో కాకుండా ఈసారి మైత్రి మూవీ మేకర్స్ దీన్ని భారీ బడ్జెట్ తో నిర్మిస్తారని తెలిసింది. అధికారిక ప్రకటన ఇంకా రాలేదు కాబట్టి ఖరారుగా చెప్పలేం కానీ ఫిలిం నగర్ వర్గాల్లో న్యూస్ అయితే బలంగా ఉంది. కాంతారతో జాతీయ స్థాయిలో గుర్తింపు, మార్కెట్ తో పాటు జాతీయ అవార్డు సాధించుకున్న రిషబ్ శెట్టి నిజంగా హనుమంతుడిగా చేస్తే బెస్ట్ ఛాయస్ అవుతాడు. సీక్వెల్ కోసం ప్రశాంత్ వర్మ భారీ కాన్వాస్ సిద్ధం చేసుకున్నాడు.

## అఖిల్ తిరుపతి బ్యాక్ డ్రాప్.. రంగంలోకి నాగ్!



అక్కినేని అఖిల్ ఏజెంట్ డిజాస్టర్ వలన ఒక్కసారిగా స్లో అయ్యాడు. తదుపరి సినిమాపై ఇప్పటివరకు ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. కథలపై చర్చలు జరుపుతున్నా కూడా బయటకు చెప్పడం లేదు. ఇండస్ట్రీలో ఆనోట ఈనోట పడి లీక్ అవ్వడమే గాని సోషల్ మీడియాలో కూడా సౌండ్ చేయడం లేదు. ఆమధ్య కొత్త డైరెక్టర్ తోనే యూవీ క్రియేషన్స్ లోనే ఒక సినిమా చేయాలని అనుకున్నాడు. కానీ ఎందుకో మరి దానిపై సరైన క్లారిటీ ఇవ్వలేదు. ఇక మొన్నటివరకు పూరి జగన్నాథ్ కూడా అఖిల్ కోసం ప్రయత్నం చేయగా పెద్దగా ఆసక్తి చూపలేదని టాక్. ఇప్పుడు ఫైనల్ గా అఖిల్ ఓ చిన్న దర్శకుడికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అతడు మరెవరో కాదు.. కిరణ్ అబ్బవరంతో 'వినరో భాగ్యము విష్ణు కథ' అనే సినిమా చేసిన యువ దర్శకుడు మురళీ కిషోర్ అని తెలుస్తోంది. నాగార్జున స్వయంగా కథ విషయంలో నిర్ణయం తీసుకున్నారని టాక్. ఇది తిరుపతి బ్యాక్ డ్రాప్ లో ఒక పీరియడ్ డ్రామాగా తెరికక్కనుందట. ప్రాజెక్టు ఖర్చు విషయంలో అసలు రాజీ పడకూడదని స్వయంగా నాగ్ రంగంలోకి దిగుతున్నట్లు తెలుస్తోంది. హోమ్ ప్రొడక్షన్ అన్నపూర్ణ బ్యానర్ లోనే సినిమాను నిర్మించడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇక త్వరలోనే ఈ ప్రాజెక్టుపై అఫీషియల్ క్లారిటీ ఇవ్వనున్నారు. నాగ్ తలచుకుంటే అఖిల్ కోసం బడా దర్శకులను లైన్ లో పెట్టవచ్చు.

## నెగెటివిటీని జయించడానికి బన్నీ ప్లాన్



అల్లు అర్జున్ మీద ఈ మధ్య సోషల్ మీడియాలో బాగా నెగెటివిటీ పెరిగిపోవడాన్ని గమనించే ఉంటారు. కెరీర్ ఆరంభంలో అతణ్ని నెత్తిన పెట్టుకుని మోసిన మెగా అభిమానులే తనకు వ్యతిరేకంగా తయారయ్యారు. అందుకు ప్రధాన కారణం 'మెగా' గొడుగు నుంచి పక్కకు వెళ్లి సొంత బ్రాండును పెంచుకోవడానికి ప్రయత్నించే క్రమంలో అతడి చర్యలు, మాటలు మెగా అభిమానులకు రుచించకపోవడమే. అసలే బన్నీ విషయంలో మెగా అభిమానుల్లో ఓ వర్గం అసంతృప్తితో ఉంటే.. ఏపీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ అభ్యర్థి అయిన శిల్పా రవికి ప్రచారం చేసి ఆ అసంతృప్తిని ఇంకా పెంచాడు బన్నీ. వ్యక్తిగత స్నేహంతోనే తాను శిల్పా రవికి ప్రచారం చేశానని.. దీనికి రాజకీయాలకు సంబంధం లేదని బన్నీ వివరణ ఇచ్చుకున్నా కూడా మెగా ఫ్యాన్స్ శాంతించలేదు. అంతకంతకూ బన్నీ మీద వారిలో నెగెటివిటీ పెరిగిపోయింది. ఇటీవల ఓ ఈవెంట్లో బన్నీ మాట్లాడుతూ నాకు నచ్చితే ఎక్కడికైనా వెళ్తా అంటూ చేసిన కామెంట్‌తో ఈ నెగెటివిటీ పీక్స్‌కు చేరుకుంది. ఈ ప్రభావం 'పుష్ప-2' మీద పడుతుందేమో అన్న చర్చ కూడా నడుస్తోంది. 'పుష్ప-2' వచ్చినపుడు మా పవర్ చూపిస్తాం అంటూ మెగా అభిమానులే వార్నింగ్ ఇవ్వడం జరిగింది. దీంతో 'పుష్ప-2' మేకర్స్‌లో కొంత ఆందోళన నెలకొంది. ఐతే ఇగో పక్కన పెట్టి ఈ నెగెటివిటీని తగ్గించాల్సిన అవసరాన్ని అల్లు అర్జున్ గుర్తించినట్లు సమాచారం.

## రానా పట్టుబడితే రీమేక్ అవ్వాల్సిందే



ఏదైనా భాషలో హిట్టయిన సినిమాను వీలైనంత త్వరగా రీమేక్ చేసుకుంటేనే సేఫ్. లేదంటే సబ్ టైటిల్స్ పెట్టుకుని ఆడియన్స్ ఓటిటిలో చూసేస్తే ఉన్న థ్రిల్ కాస్తా తగ్గిపోతుంది. గాడ్ ఫాదర్, భీమ్లా నాయక్ లాంటి స్టార్ హీరోల చిత్రాలు అందుకే ఆశించినంత పెద్ద రేంజ్ కి వెళ్లలేకపోయాయి. 2021లో కోలీవుడ్ నుంచి మానాడు వచ్చింది. పెద్ద సక్సెస్. రేసులో వెనుకబడ్డ శింబుకి కొత్త లైఫ్ ఇచ్చింది. ముఖ్యంగా ఆర్టిస్టుగా ఎస్జె సూర్య పెద్ద స్థాయికి వెళ్లేందుకు దోహదపడింది. ఓటిటిలో తెలుగు డబ్బింగ్ తో పాటు అందుబాటులోకి వచ్చాక మన ఆడియన్స్ భారీ సంఖ్యలో చూశారు. అంత పెద్ద రీచ్ ఉంది దీనికి. మానాడు రీమేక్ హక్కులు సురేష్ సంస్థ ఎప్పుడో కొనుగోలు చేసింది. కానీ హీరో దర్శకుడు దొరక్క వాయిదా పెడుతూ వచ్చారు. సాయి ధరమ్ తేజ్, వరుణ్ తేజ్ ఇలా రెండు మూడు పేర్లు వినిపించాయి కానీ అవేవి కార్యరూపం దాల్చలేదు. ఒకదశలో రవితేజ దగ్గరకు కూడా వెళ్లిందన్నారు కానీ అదంతా పుకారు స్టేజి దగ్గరే ఆగిపోయింది. కట్ చేస్తే ఇప్పుడీ మానాడుని ముందు హిందీలో తీసే ప్లానింగ్ లో ఉన్నాడు రానా. ఆకాశవాణితో దర్శకుడిగా రుజువు చేసుకున్న అశ్విన్ గంగరాజుతో తెరకెక్కించే ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. హీరో ఎవరనేది ఇంకా తేలలేదు కానీ క్యాస్టింగ్ పనులు మొదలుపెట్టలేదట. మరి తెలుగులో తీస్తారా లేదానేది అనుమానంగానే ఉంది. టైం లూప్ కాన్సెప్ట్ ఆధారంగా ఒక సామాన్యుడికి, పోలీస్ ఆఫీసర్ కు మధ్య జరిగే పొలిటికల్ డ్రామాగా రూపొందిన ఈ థ్రిల్లర్ కి దర్శకుడు వెంకట్ ప్రభు.

## జపాన్‌లో ఆర్ఆర్ఆర్ మాస్ రికార్డు



థియేటర్లలో రిలీజై రెండేళ్లు దాటిపోయింది కాబట్టి ఏదో టీవీలో వచ్చినప్పుడో, యూట్యూబ్ లో క్లిప్పులు చూసినప్పుడో తప్ప ఆర్ఆర్ఆర్ ని ప్రేక్షకులు అదే పనిగా గుర్తుకు తెచ్చుకోవడం ఇప్పుడైతే లేదు. ఎన్ని రికార్డులు నమోదు చేసినా యాభై రోజుల తర్వాత ఓటిటిలో వచ్చేసిన ఈ ప్యాన్ ఇండియా గ్రాండియర్ ప్రపంచంలో ఒక చోట ఏడాదికి పైగానే ఆడుతోందంటే నమ్మడానికి కష్టంగా ఉన్నా ఇది అక్షరాలా నిజం. ఏదో ఫ్యాన్స్ డబ్బులిచ్చి బలవంతంగా ఆడించే వ్యవహారమని కొట్టి పారేయడానికి ఆడుతోంది ఏపీ, తెలంగాణలోని మారుమూల ఊళ్ళో కాదు. అసలు టాలీవుడ్డంటే ఏంటో తెలియని జపాన్ దేశంలో. జపాన్ లో 71 సంవత్సరాల చరిత్ర కలిగిన టుసాగుచి సాన్ సాన్ అనే థియేటర్లో ఆర్ఆర్ఆర్ 1 సంవత్సరం 9 నెలలుగా ఆడుతూనే ఉంది. రోజూ ఒకటి రెండు రెగ్యులర్ షోలతో ఏ రోజూ ఆపకుండా స్క్రీనింగ్ చేస్తూనే వచ్చారు. ఇంత సుదీర్ఘమైన రన్ తెచ్చుకున్న మొదటి ఇండియన్ మూవీగా ఆర్ఆర్ఆర్ అక్కడ సరికొత్త రికార్డు నమోదు చేసింది. ఈ సుదీర్ఘమైన పరుగుకు ఇప్పుడు ముగింపు పలకబోతున్నారు. ఇదే చివరి వారంగా యాజమాన్యం ప్రకటించింది. ఇంత ఆడినా రేపు శనివారం వేస్తున్న షోకు సంబంధించిన టికెట్లు అడ్వాన్స్ గా అన్నీ అమ్ముడుపోవడం అసలు ట్విస్టు. రాజమౌళి గ్రాండియర్ ని జపాన్ ఆడియన్స్ ఎంతగా సొంతం చేసుకున్నారో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఇండియాలో పట్టుమని వంద రోజులు ఆడటమే కలగా మారిన పరిస్థితిలో ఏకంగా నాన్ ఇంగ్లీష్ కంట్రీలో ఇలాంటి ఫీట్ సాధించడమంటే జక్కన్న మేజిక్ కాక మరేమిటి.



# క్రీడలు



## భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 450 స్కోరు చేయడం ఖాయం



న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో భారత్ 46 పరుగులకే ఆలౌటైన సంగతి తెలిసిందే. బెంగళూరు పిచ్ తొలుత బౌలింగ్‌కు అనుకూలంగా ఉంది. దీంతో కివీస్ పేసర్లు చెలరేగిపోయారు. టీమ్ఇండియాలో కేవలం రిషభ్ పంత్ (20), యశస్వి జైస్వాల్ (13) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. ప్రస్తుతం న్యూజిలాండ్ ఇప్పటికే దాదాపు 200ం ఆధిక్యం సాధించింది. దీంతో రెండో ఇన్నింగ్స్‌లో టీమ్ఇండియా భారీ స్కోరు చేస్తేనే టెస్టు ఓటమి నుంచి గట్టెక్కేది. ఈ క్రమంలో భారత మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. భారత్ రెండో ఇన్నింగ్స్‌లో కనీసం 450కి పైగా పరుగులు చేస్తుందని వ్యాఖ్యానించాడు. "మ్యాచ్ జరిగేకొద్దీ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా మారుతోంది. కివీస్ బ్యాటర్లు మెరుగ్గానే ఆడుతున్నారు. దీంతో రెండో ఇన్నింగ్స్‌లో భారత్ కనీసం 450కి పైగా పరుగులు చేస్తేనే గెలుపుపై ఆశలు ఉంటాయి. టీమ్ఇండియా సాధిస్తుందని భావిస్తున్నా. గతంలోనూ భారత్‌కు ఇలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి. 2001లో ఆసీస్ పైనే విజయఢంకా మోగించింది. ఫాలోఆన్‌లో పడి మరీ ద్రవిడ్, లక్ష్మణ్ అసామాన్యమైన పోరాటంతో ఆస్ట్రేలియాకు భారీ లక్ష్యం నిర్దేశించింది. ఆ తర్వాత బౌలర్లు చెలరేగిపోయారు. టీమ్ఇండియాను గెలిపించారు. ఇటీవల బంగ్లాపై కాన్పూర్ వేదికగా జరిగిన టెస్టులోనూ విజయం సాధించిన సంగతి తెలిసిందే. కివీస్‌తో తొలి ఇన్నింగ్స్‌లో 46 పరుగులు చేసినంత మాత్రాన అధైర్య పడక్కర్లేదు. అదంతా జరిగిపోయింది. ఇక రెండో ఇన్నింగ్స్ గురించి మాత్రమే ఆలోచించాలి" అని చోప్రా వెల్లడించాడు.

## టీమిండియా ఢమాల్
## 46పరుగులకే కుప్పకూలిన రోహిత్ సేన



న్యూజిలాండ్ పేసర్ల ముందు టీమిండియా బ్యాటర్లు తేలిపోయారు. సొంతగడ్డపై తక్కువ పరుగులకే ఆలౌట్ కావడం, టెస్టుల్లో మూడో అత్యల్ప స్కోర్‌కు టీమిండియా పరిమితమైంది. ఎం. చిన్నస్వామి స్టేడియం వేదికగా న్యూజిలాండ్‌తో గురువారం నుంచి ప్రారంభమైన తొలి టెస్ట్ రెండోరోజు టీమిండియా బ్యాటర్లు క్రీజ్‌లో కుదురుకునేందుకు పడరాని పాట్లు పడ్డారు. టాస్ గెలిచి ప్రత్యర్థి బౌలర్లను ఉతికారేయాలను కున్న కెప్టెన్ రోహిత్ శర్మ అంచనా తప్పింది. తొలిరోజు ఆట వర్షం కారణంగా పూర్తిగా తుడిచిపెట్టుకుపోగా.. రెండోరోజు కివీస్ బౌలర్లు చెలరేగారు. మ్యాట్ హెన్రీ(5/15), విలియం రూర్కే(3/22)ల ధాటికి టీమిండియా బ్యాటర్లు ఐదుగురు డకౌటయ్యారు.. దీంతో టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 46పరుగులకే కుప్పకూలింది. జైస్వాల్(13), పంత్(20) రెండంకెల స్కోర్ నమోదుచేయగా.. రోహిత్(2), కుల్దీప్(2), బుమ్రా(1), సిరాజ్(4నాటౌట్) సింగిల్ డిజిట్ పరుగులు చేశారు. ఇక కోహ్లి, సర్ఫరాజ్, కెఎల్ రాహుల్, జడేజా, అశ్విన్ డకౌట్ అయ్యారు. టీమిండియా ఇన్నింగ్స్ కేవలం 31.2ఓవర్లలోనే ముగిసింది. 36పరుగులకు 6వికెట్లు కోల్పోయిన టీమిండియా.. మరో 10 పరుగుల వ్యవధిలో చివరి నాలుగు వికెట్లను చేజార్చుకుంది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన న్యూజిలాండ్.. రెండోరోజు ఆట ముగిసే సమయానికి 3వికెట్ల నష్టానికి 186పరుగులు చేసింది. డెవాన్ కాన్వే(91) శతకానికి దగ్గర్లో ఔట్ కాగా.. కెప్టెన్ లాథమ్(15) బ్యాటింగ్‌లో రాణించారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 67పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఆ తర్వాత విల్ యంగ్ 33పరుగులు చేసి ఔటయ్యాడు. రచిన్ రవీంద్ర(22), డారెల్ మిచెల్(14)లు క్రీజులో ఉండగా.. న్యూజిలాండ్ ఇప్పటికే 134 పరుగుల ఆధిక్యం సాధించింది.

## ఆస్ట్రేలియాకు బిగ్ షాక్..
## ఫైనల్‌కు చేరిన సౌతాఫ్రికా



అన్నెకే బాష్- కెప్టెన్ లారా వోల్వార్డ్‌ల అద్భుతమైన ఇన్నింగ్స్‌తో దక్షిణాఫ్రికా ఎనిమిది వికెట్ల తేడాతో ఆరుసార్లు ఛాంపియన్ ఆస్ట్రేలియాను ఓడించి మహిళల టీ20 ప్రపంచ కప్‌లో ఫైనల్‌లోకి ప్రవేశించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 134 పరుగులు చేసింది. బాష్ అజేయ అర్ధ సెంచరీతో దక్షిణాఫ్రికా 17.2 ఓవర్లలో రెండు వికెట్లకు 135 పరుగులు చేసి లక్ష్యాన్ని సాధించింది. ఇప్పుడు ఆదివారం న్యూజిలాండ్- వెస్టిండీస్ మధ్య జరిగే రెండవ సెమీ-ఫైనల్ విజేతతో దక్షిణాఫ్రికా తలపడుతుంది. టైటిల్ కోసం బలమైన పోటీదారుగా భావించిన ఆస్ట్రేలియా ప్రయాణం సెమీ ఫైనల్స్‌తో ముగిసింది. గ్రూప్ దశలో అజేయంగా నిలిచిన ఆస్ట్రేలియా జట్టు అన్ని మ్యాచ్‌లు గెలిచి సెమీఫైనల్‌కు చేరుకుంది. ఆస్ట్రేలియాదే పైచేయి అని అనుకున్నారు. ఎందుకంటే మునుపటి ఏడు టీ20 ప్రపంచ కప్‌లలో ఆస్ట్రేలియా ఆరుసార్లు టైటిల్‌ను గెలుచుకుంది. ఫైనల్‌లో ఒకసారి ఓడిపోయింది. ఈ విధంగా ఈ విజయం దక్షిణాఫ్రికాకు చాలా పెద్దది. ఈ ఫార్మాట్‌లో ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాను దక్షిణాఫ్రికా గతంలో ఎన్నడూ ఓడించలేదు. దీంతో టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా వరుసగా 15 విజయాల పరంపర ముగిసి ఎనిమిదోసారి ఫైనల్‌లోకి అడుగుపెట్టాలన్న కల చెదిరిపోయింది. 2009 నుండి టోర్నమెంట్‌లోని మొత్తం తొమ్మిది సీజన్లలో ఆస్ట్రేలియా సెమీ-ఫైనల్ ఆడింది. లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో అన్నాబెల్ సదర్లాండ్ టాంజిమ్ బిట్జ్ బౌలింగ్‌లో దక్షిణాఫ్రికాకు తొలి దెబ్బను అందించింది. 15 పరుగుల వద్ద బ్రిట్జ్ ఔటయ్యాడు. అనంతరం బాష్, వోల్‌వోర్ట్‌లు రెండో వికెట్‌కు 96 పరుగులు జోడించారు. టీ20లో ఆస్ట్రేలియాపై ఏ వికెట్‌కైనా దక్షిణాఫ్రికా చేసిన అత్యధిక భాగస్వామ్యం ఇదే. అయితే సదర్లాండ్, వోల్వోర్ట్‌ను అర్ధ సెంచరీ చేయడానికి అనుమతించలేదు. తహ్లియా మెక్‌గ్రాత్‌కి క్యాచ్ ఇచ్చింది. 37 బంతుల్లో మూడు ఫోర్లు, ఒక సిక్సర్ సాయంతో 42 పరుగులు చేసి వోల్వోర్ట్ ఔటయ్యాడు. అయినప్పటికీ బాష్ తన ఇన్నింగ్స్‌ను కొనసాగించి జట్టును విజయతీరాలకు చేర్చాడు. బాష్ 48 బంతుల్లో ఎనిమిది ఫోర్లు, ఒక సిక్సర్ సాయంతో 74 పరుగులు చేసి నాటౌట్ గా వెనుదిరిగింది. చోలే ట్రైరోన్ ఒక పరుగు చేసి నాటౌట్ గా నిలిచింది.

## టెస్టుల్లో ఆ నంబర్
## విరాట్ కోహ్లీకి కలిసి రావడం లేదా..?



భారత్-న్యూజిలాండ్ ల మధ్య మూడు టెస్టుల సిరీస్‌లో తొలి మ్యాచ్ ఎట్టకేలకు నేటి నుంచి ప్రారంభమైంది. అక్టోబర్ 16న మొదటి రోజు జరగాల్సిన మ్యాచ్ రోజంతా వర్షం కురువడంతో టాస్ కూడా పడలేదు. రెండో రోజు బెంగళూరులో వాతావరణం అనుకూలంగా ఉండడంతో సమయానికి టాస్ వేశారు. కాగా, టీమిండియా బ్యాటింగ్‌కు దిగిన కొద్దిసేపటి కే వరుసగా వికెట్లు పడుతూ వచ్చాయి. భారత జట్టు 46 పరుగులకే ఆలౌట్ కావడం అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. భారత్ 34 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయింది. ఇందులో ఐదుగురు బ్యాట్స్‌మెన్ ఖాతా తెరవకుండానే ఔటయ్యారు. టెస్టు క్రికెట్‌లో భారత గడ్డపై టీమిండియా అత్యల్ప స్కోరు ఇదే కావడం గమనార్హం. 20 పరుగులతో ఇన్నింగ్స్ ఆడిన రిషబ్ పంత్ భారత జట్టులో హయ్యెస్ట్ స్కోరర్‌గా నిలిచాడు. యశస్వి జైస్వాల్ 13 పరుగులు చేశాడు. ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాట్స్‌మెన్‌లలో ఒకరైన విరాట్ కోహ్లీ కూడా ఖాతా తెరవకుండానే ఔట్ అయ్యి అభిమానులను తీవ్రంగా నిరాశపరిచాడు. అయితే విరాట్ కోహ్లీకి మూడో స్థానం కలిసి రావడం లేదనే చర్చ జరుగుతన్నది. ఇప్పటి వరకు మూడో నంబర్‌లో బ్యాటింగ్ వచ్చిన ప్రతీసారి కోహ్లీ పరుగులు చేయకుండానే వెనుదిరిగాడు. టాస్ గెలిచిన భారత కెప్టెన్ రోహిత్ శర్మ ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్నాడు. యశస్వి జైస్వాల్ తో కలిసి బ్యాటింగ్ కు దిగిన కెప్టెన్ రోహిత్ 16 బంతుల్లో కేవలం 2 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్ బాట పట్టాడు. ఆ తర్వాత బ్యాటింగ్ ఆర్డర్ మారింది. మెడ బిగుసుకుపోవడం వల్ల శుభ్‌మాన్ గిల్ ఈరోజు మ్యాచ్ ఆడడం లేదు. దీంతో విరాట్ కోహ్లీని మూడో స్థానంలో బ్యాటింగ్‌కు దిగాడు. అయితే కోహ్లీ జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందిస్తాడని అంతా భావించారు. కానీ కోహ్లీ 9 బంతులు ఎదుర్కొని ఒక్క పరుగు కూడా చేయకుండా వెనుదిరిగాడు. విరాట్ కోహ్లీకి సుధీర్ఘ కాలంగా టెస్టు మ్యాచ్ లు ఆడుతున్నాడు. కోహ్లీ ఎక్కువగా నాలుగో నంబర్‌లో బ్యాటింగ్ చేస్తున్నాడు. కానీ మూడో స్థానంలో ఆడేందుకు వచ్చిన ప్రతీసారి బ్యాటింగ్ లో విఫలమవుతున్నాడు. టెస్టుల్లో 29 సెంచరీలు సాధించిన విరాట్ కోహ్లి.. టెస్టు క్రికెట్‌లో నాలుగో ర్యాంక్‌లో ఒక సెంచరీతో పాటు హాఫ్ సెంచరీ కూడా చేయలేకపోయాడు. దీంతో కోహ్లీని మూడో స్థానంలో పంపడంలో నిర్ణయం ఎవరిదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కెప్టెన్ రోహిత్ శర్మ ఈ నిర్ణయం తీసుకున్నాడా లేక కోచ్ కోహ్లీని మూడో స్థానంలో పంపాడా? విరాట్ కోహ్లి స్వయంగా వచ్చి మూడో స్థానంలో బ్యాటింగ్‌కు దిగుతానని కోరాడా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

## రిషబ్ పంత్‌కు షాక్ ఇచ్చిన ఢిల్లీ క్యాపిటల్స్!



IPL 2025 మెగా వేలానికి ముందు పెద్ద న్యూస్ బయటకు వస్తోంది. నివేదికల ప్రకారం.. ఈ సీజన్‌లో రిషబ్ పంత్ ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గా ఉండడు. ఢిల్లీ జట్టు కొత్త కెప్టెన్ కోసం వెతుకుతోంది. ఈ రేసులో భారత ఆటగాడి పేరు ముందంజలో ఉంది. కెప్టెన్సీ ఒత్తిడి నుంచి విముక్తి పొందిన తర్వాత వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ మరింత రాణించగలడని ఢిల్లీ టీమ్ మేనేజ్‌మెంట్ అభిప్రాయపడుతున్నట్లు సమాచారం. గత సీజన్‌లో పంత్ కెప్టెన్సీలో ఢిల్లీ ప్రదర్శన మిశ్రమంగా ఉంది. ఢిల్లీ జట్టు 14 మ్యాచ్‌ల్లో ఏడింటిలో విజయం సాధించగా, అదే సంఖ్యలో మ్యాచ్‌ల్లో జట్టు ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. గతేడాది టోర్నీలో ఢిల్లీ ఆరో స్థానంతో ముగించింది. నిజానికి 'టైమ్స్ ఆఫ్ ఇండియా' వార్తల ప్రకారం.. ఐపీఎల్ 2025 లో రిషబ్ పంత్‌కు జట్టు కెప్టెన్సీని ఢిల్లీ క్యాపిటల్స్ ఇవ్వాలనుకోలేదు. ఢిల్లీ కొత్త కెప్టెన్ కోసం అన్వేషణలో ఉంది. పంత్ తర్వాత భారత ఆల్ రౌండర్ అక్షర్ పటేల్ కెప్టెన్సీ రేసులో ముందున్నాడు. జట్టు అక్షర్‌పై విశ్వాసం ఉంచకపోతే మెగా వేలంలో జట్టుకు బాధ్యత వహించే ఆటగాడిపై ఢిల్లీ బెట్టింగ్‌లు జరుపుతుంది. కెప్టెన్సీ లేకుండా పంత్ మెరుగైన ప్రదర్శన చేయగలడని ఢిల్లీ జట్టు నాయకత్వ బృందం అభిప్రాయపడింది.ఢిల్లీ క్యాపిటల్స్ చివరిసారిగా 2021లో ప్లేఆఫ్‌లోకి ప్రవేశించింది. ఆ తర్వాత మూడు సీజన్లలో ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేదు. 2020లో ఢిల్లీ ఫైనల్స్‌కు చేరుకున్నప్పుడు శ్రేయాస్ అయ్యర్ కెప్టెన్సీలో జట్టు ప్రదర్శన అత్యుత్తమంగా ఉంది. ఐపీఎల్ 2024లో ఢిల్లీ జట్టు, కెప్టెన్ పంత్ ఢిల్లీని ఉత్తమ స్థానంలో ఉంచలేకపోయారు. తాజాగా రిషబ్ పంత్ తన ట్విట్టర్ హ్యాండిల్‌లో ఓ పోస్ట్‌ను పంచుకున్నాడు. తాను వేలానికి వెళితే అమ్ముడుపోతానా లేదా అని..? ఒకవేళ అమ్ముడుపోతే తన పేరుకు ఎంత ధర పలకాలని అభిమానులను అడిగాడు పంత్. రిషబ్ ఈ పోస్ట్‌పై చాలా సమాధానాలు వచ్చాయి. అయితే, నివేదికలను విశ్వసిస్తే మెగా వేలానికి ముందు ఢిల్లీ క్యాపిటల్స్ పంత్‌ను కొనసాగించాలని నిర్ణయించుకుంది.

# జమ్మికుంట కాటన్ మార్కెట్ ను సందర్శించిన వరంగల్ సిసిఐ బ్రాంచ్ మేనేజర్



**జమ్మికుంట ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 18** జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటి, పరిధిలో గల మార్కెట్ యార్డ్, సీసీఐ కి నోటిఫైడ్ చేసి కేటాయించన జిన్నింగ్ మిల్లులను వరంగల్ సీసీఐ బ్రాంచ్ మేనేజర్ అర్జున్ ఎస్ దావే, జమ్మికుంట సీసీఐ సెంటర్ ఇంచార్జి చంద్రశేఖర్ తో కలిసి పరిశీలించారు.జిన్నింగ్ మిల్లుల యందు వెబ్రిడ్జి, ఫైర్ ఫైటింగ్ ఈక్వప్ మెంట్, ఇన్సూరెన్స్, అన్నీ సక్రమంగా ఉన్నాయా అని తనిఖీ చేయడం జరిగింది. అలాగే మార్కెటింగ్ శాఖ వారిచే సాఫ్ట్ వెర్ ఇన్స్టాలేషన్, మరియు కరీంనగర్ జిల్లా కలెక్టర్ చే (07) జిన్నింగ్ మిల్లులు నోటిఫైడ్ చేశారా అని పరిశీలించారు. అదేవిదంగా రైతులు మీరు పండించిన పత్తిని ఇంటి వద్దనే ఎండ బెట్టి, శుభ్రపరిచి తేమ శాతం 8% నుండి 12% వచ్చే విధంగా ఉండాలి అని అన్నారు. పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకొని వచ్చి అమ్ముకోగలరని తెలిపినారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలకు పత్తి తీసుక వచ్చే రైతులు తమ వెంట ఆధార్ కార్డు జిరాక్స్, పట్టా దార్ పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ తో అనుసంధానం చేసిన బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ తో అనుసంధానం ఉన్న మీ యొక్క సెల్ కి వచ్చే ఓటీపీ ఫోన్ మీ వెంట తప్పకుండ తీసుకొని రావాలని కోరారు. అతి త్వరలో సీసీఐ సెంటర్ కొనుగోలు కేంద్రాలని ప్రారంభం చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఆర్ మల్లేశం, మిల్లర్స్ అయిత శ్రీనివాస్, అర్తిదారులు, రైతులు మార్కెట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ముఖ్యమంత్రి యూనియన్ మినిస్టర్ టి అంజయ్య 38 వ వర్ధంది కి హాజరైన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 18 :** పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, యూనియన్ మినిస్టర్ టి అంజయ్య యొక్క 38వ వర్ధంతి కార్యక్రమానికి హాజరై నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా,ఆయన టి అంజయ్య సేవలను గుర్తు చేసుకున్నారు.ఆయన ముఖ్య మంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్రానికి చేసిన సేవలను,ఆయన యూనియన్ మినిస్టర్గా ఉన్న సమయంలో దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

# ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం

- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం
- మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ స్వరూప రాణి
- మహిళలు ఆర్థిక స్థిరత్వం సాధించాలి
- జమ్మికుంట మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ దేశిని స్వప్న



**జమ్మికుంట ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 18** జమ్మికుంట పట్టణంలోని కొండూరి కాంప్లెక్స్ వద్ద ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ స్వరూప రాణి జమ్మికుంట మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ దేశిని స్వప్న కోటి, మహిళా సంఘం సభ్యులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా స్వరూప రాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం కోటి మంది మహిళలను కోటీశ్వరలను చేయడంలో భాగంగా ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను ప్రారంభించినట్టు వెల్లడించారు. జమ్మికుంట పట్టణ పరిధిలో ఈ క్యాంటీన్ ను మరింత ముందుకు తీసుకెళ్లాలని మహిళా సంఘం సభ్యులకు సూచించారు. బ్యాంకు నిధులతో పాటు స్త్రీ నిధి మహిళా సంఘ సభ్యుల సెల్ఫ్ కాంట్రిబ్యూషన్ తో క్యాంటీన్లు ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు.

ప్రైమ్ ఏరియాలో హాస్పిటల్స్ కు సమీపాన ఉన్న ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ లో కస్టమర్లకు అన్ని రకాల సదుపాయాలతో.. నాణ్యత ప్రమాణాలు ఉన్న ఆహార పదార్థాలను అందించి మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు. మహిళా సంఘ సభ్యులకు గ్రూపుల వారీగా, వ్యక్తిగతంగా బ్యాంకర్ల సాయంతో నిధులను అందిస్తున్నట్టు వివరించారు. వ్యక్తిగతంగా రూ.2.25 నుంచి రూ. 3.5 లక్షల వరకు, గ్రూపుల వారీగా రూ. 40 లక్షల వరకు ఫండ్స్ ను అందించనున్నట్టు స్పష్టం చేశారు. గ్రూప్ యాక్టివిటీస్ లో భాగంగా ఫుడ్ ప్రాసెసింగ్, ఈవెంట్ మేనేజ్ మెంట్ వంటి వాటిని ప్రోత్సహిస్తున్నట్టు పేర్కొన్నారు. జమ్మికుంట పట్టణంలో గ్రూప్ యాక్టివిటీస్- 9 , వ్యక్తిగతంగా ప్రోత్సాహం-15 టార్గెట్ ను నిర్దేశించుకున్నట్టు చెప్పారు. మహిళా స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేయడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించినట్టు వెల్లడించారు. జమ్మికుంట మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ దేశిని స్వప్న కోటి మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర సర్కారు మహిళా సంఘాలను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నట్టు వెల్లడించారు. మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా బలోపేతం కావడానికి రుణాలను అందిస్తున్నట్టు తెలిపారు. మహిళా సంఘాలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మహిళా సంఘాలు ఏర్పాటు చేసే ఈ క్యాంటీన్ల ద్వారా ఆర్థికంగా నిలదుకపోవడంతో పాటు మరి కొంతమందికి ఉపాధి ఇచ్చే స్థాయికి మహిళా సంఘాలు ఎదుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో మెప్మా జిల్లా కోఆర్డినేటర్ శ్రీవాణి, ఇన్ చార్జి టీఎంసీ మానస, డిపిఓ సతీష్ , కౌన్సిలర్ సాయిని రమ, జమ్మికుంట మున్సిపల్ మేనేజర్ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మరణించిన కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకట స్వామి





చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ అక్టోబర్ 18 : చెన్నూరు నియోజకవర్గంలోని పెద్దపల్లి జాషువా నగర్ లో బొంకూరి సంతోష్ మరణించిన సందర్భంగా చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకట స్వామి వారి కుటుంబసభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా బొంకూరి సంతోష్ కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలిపారు.వారి కుటుంబానికి ఈ కష్టసమయంలో తమ మద్దతును అందించారు.

# ఎస్ సి/ఎస్ టి ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షులు గా పందు ఏకగ్రీవ ఎన్నిక





**సంగారెడ్డి అక్టోబర్ 18 ప్రజ బలం ప్రతినిధి:**జిల్లాలోని ఝరాసంగం మండల ఎస్ సి, ఎస్ టి ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లా అధ్యక్షులు చవాన్ సుభాన్ సింగ్ తెలిపారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ మండలం లోని అయ పాఠశాలలో పని చేస్తున్న ఎస్ సి ఎస్ టి ఉపాధ్యయులు ఈ సమావేశంలో పాల్గొన్నాడం జరిగింది. అనంతరం నూతన అధ్యక్షులు గా పందుని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అలాగే గౌరవ అధ్యక్షులుగా బేగరి శివచందర్, మండల ప్రధాన కార్యదర్శిగా ధర్మ రాథోడ్, కోశాధికారి నారాయణ, మహిళ కార్యదర్శి కృష్ణవేణి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి చవాన్ సుభాన్ సింగ్, పెద్దాపురం దుర్గయ్య, తెలిపారు. ఈ కార్ర్యమంలో కుర్రి చంద్రశేఖర్, బిట్టు వసంత్ కుమార్ లు తదితరులు పాల్గొన్నారు.
లిఈ సందర్బంగా అధ్యక్షులు పందు మాట్లాడుతూ నా పై నమ్మకం ఉంచి నాన్ను ఎన్నుకోన్న జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి మరియు ఎస్ సి, ఎస్ టి ఉపాధ్యాలందరికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను అన్నారు.

# గ్రూప్ 2,3 పరీక్షల పై చీఫ్ సెక్రెటరీ శాంతి కుమారి సమీక్ష





తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్ 2,3 పరీక్షల పై సచివాలయం నుండి చీఫ్ సెక్రెటరీ శాంతి కుమారి, %u+రాజ% చైర్మన్ మహేందర్ రెడ్డి, సభ్యులు తన కార్యాలయం నుండి శుక్రవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతోఈ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ వీడియో కాన్ఫరెన్సుకు మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు కార్యాలయము నుండి జిల్లారెవెన్యూ అధికారి హరిప్రియ హాజరయ్యారు. నవంబరు 17, 18 తేదిలలో నిర్వహించనున్న గ్రూప్ 3 పరీక్షకు గాను జిల్లాలో 118 పరీక్షా కేంద్రాలలో 71,356 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని డిఆర్ఓ తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిబంధనల మేరకు జిల్లాలో 7 స్ట్రాంగ్ రూంలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.

# రైల్వేలకు మహర్దశ

సికింద్రాబాద్, అక్టోబరు 18, తెలంగాణలో రైల్వే లైన్ల అభివృద్ధిపై భారత రైల్వే దృష్టిపెట్టింది. గడిచిన పదేళ్లలో రైలుమార్గాల విస్తరణ, విద్యుదీకరణ, మూడో లైన్ పనులు చేస్తోంది. కొత్త రైలు మార్గాలను కూడా ప్రతిపాదించింది. హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం మూడు రైల్వే స్టేషన్లతోపాటు కొత్తగా చర్లపల్లి రైల్వే టెర్మినల్ కూడా అందుబాటులోకి వస్తుంది. అయినా రైళ్ల రద్దీకి అనుగుణంగా జంక్షన్లు లేవు. ఈ నేపథ్యంలో ప్రస్తుత రద్దీ, భవిష్యత్‌లో పెరగనున్న రైళ్లను దృష్టిలో ఉంచుకుని మరో రైల్వే జంక్షన్ ఏర్పాటు చేయాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు?నడికుడి మార్గంలో నల్గొండ జిల్లా సరిహద్దులో ఉన్న విష్ణుపురం రైల్వే స్టేషన్‌ను రైల్వే జంక్షన్‌గా మార్చాలని దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించిందిఇదిలా ఉంటే.. దామచర్ల మండలం వీర్లపాలెం వద్ద 20 వేల మెగావాట్ల సామర్థ్యంలో తెలంగాణలోనే అతిపెద్ద థర్మల్ విద్యుత్ పస్లాంటును నిర్మిస్తున్నారు. దీనికి సమీపంలోనే విష్ణుపురం రైల్వే స్టేషన్ ఉంది. యాదాద్రి థర్మల్ ప్లాంట్‌కు ప్రతీరోజు 21 వ్యాగన్ల బొగ్గు పెద్దపల్లి జిల్లా రామగుండం నుంచి సరఫరా చేయాల్సి ఉంటుంది. జాన్‌పహాడ్ మార్గంలో ప్రస్తుతం ఉన్న రైల్వే లైన్‌కు అదనంగా మరో లైన్ నిర్మిస్తున్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని విష్ణుపురం స్టేషన్‌ను జంక్షన్‌ను చేయాలని అధికారులు ప్రతిపాదించారు.రైల్వే జంక్షన్ ఏర్పాటు చేయాలంటే.. మూడు రైలు మార్గాలు ఒకేచోట కలవాలి. విష్ణుపురం వద్ద గుంటూరు?బీబీనగర్ రైల్వేలైన్ మార్గం ఒక్కటే ఉంది. దీనిని రెండు వరుసలుగా విస్తరిస్తున్నారు. మిర్యాలగూడ?గుంతకల్లు రైల్వేలైన్ సైతం త్వరలోనే అందుబాటులోకి రానుంది. ఈ మార్గంలో రైల్లు నడిపితే రద్దీ పెరుగుతుంది. విష్ణుపురం రైల్వే స్టేషన్ రద్దీగా మారుతుంది. ఇక గుంటూరు?జాన్‌పహాడ్ లైను, వీర్లపాలెం థర్మల్ ప్లాంటు ట్రైన్ మార్గాలు సైతం ఇక్కడే కలుస్తాయి. ఈ నేపథ్యంలో ఇక్కడే జంక్షన్ ఏర్పాటు చేయాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం రైల్వే లైన్ల నిర్మాణం జరుగుతోంది. త్వరలోనే జంక్షన్‌కు అవసరమైన విద్యుత్, రైల్వే సురక్షిత సౌకర్యాలు కల్పించనున్నారు.రైలు ప్రమాదాల నివారణకు భారత రైల్వే సంస్థ ఇటీవలే కవచ్ టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చింది. ఈ టెక్నాలజీని కూడా విష్ణుపురం జంక్షన్‌లో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. యాదాద్రి థర్మల్ ప్లాంటుకు 5 కిలోమీటర్ల మేర రైల్వేలైన్ ఏర్పాటు చేస్తున్నారు. దీనికి అనుసంధానంగా రైల్వే జంక్షన్‌లో అవసరమైన పనులు జరిపించాలని రైల్వే అధికారులు నిర్ణయించారు.

# గ్రూప్-2,3 పరీక్షల నిర్వహణ పకడ్బంధీగా చేపట్టాలి

## టి.జి.పి.ఎస్.సి. చైర్మన్ మహేందర్ రెడ్డి



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 18 :** రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న గ్రూప్-2,గ్రూప్-3 పరీక్షల నిర్వహణ పకడ్బంధీగా చేపట్టాలని టి.జి.పి.ఎస్.సి. చైర్మన్ మహేందర్ రెడ్డి అన్నారు.శుక్రవారం హైదరాబాద్ లోని తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయం నుండి ఇతర కమిషన్ సభ్యులు, ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులతో గ్రూప్ పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టి.జి.పి.ఎస్.సి. చైర్మన్ మాట్లాడుతూ గ్రూప్ పరీక్షల నిర్వహణ పకడ్బంధీగా చేపట్టాలని,ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగే విధంగా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలని తెలిపారు.గ్రూప్-2 పరీక్షలు డిసెంబర్15, 16 తేదీలలో,గ్రూప్-3 పరీక్షలు నవంబర్17, 18 తేదీలలో నిర్వహించడం జరుగుతుందని, అధికారులు పరీక్షా కేంద్రాలు,స్ట్రాంగ్ రూములను గుర్తించి ఏర్పాటు చేయవలసిన వసతులు,చర్యలపై పూర్తి వివరాలతో నివేదికలు అందించాలని ఆదేశించారు.జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ... గ్రూప్-2, 3 పరీక్షల కొరకు జిల్లాలో 48 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, దాదాపు 15 వేల మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు.ఆయా పరీక్ష కేంద్రాలలో అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా త్రాగునీరు,నిరంతర విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు, ర్యాంపులు, ఇతర మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.పరీక్షల నిర్వహణ కొరకు ప్రత్యేక అధికారులను నియమించి తగు చర్యలు తీసుకుంటామని, ప్రశ్నాపత్రాల భద్రతకు పోలీసు శాఖ సమన్వయంతో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేసి భద్రతా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.జిల్లాలో గ్రూప్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేలా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)సబావత్ మోతిలాల్, పోలీస్ నోడల్ అధికారి సుందర్రావు,ఆర్.సి. నరేందర్రెడ్డి సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్-3 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

### వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ వెల్లడి

### జిల్లాలో మొత్తం 49 పరీక్షా కేంద్రాలను సందర్శించి వసతి సదుపాయాలను పరిశీలించారన

### .....జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



**సంగారెడ్డి అక్టోబర్ 18 ప్రజ బలం ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీ.జీ.పీ.ఎస్.సీ) ద్వారా నవంబర్, డిసెంబర్ నెలల్లో నిర్వహించనున్న గ్రూప్-3 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతున్నామని జిల్లాకలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. నవంబర్ 17, 18 తేదీలలో జరిగే గ్రూప్-3 పరీక్షలు, డిసెంబర్ 15, 16 తేదీలలో నిర్వహించనున్న గ్రూప్-2, గ్రూప్-3 రాత పరీక్షలను పురస్కరించుకుని రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఎం.మహేందర్ రెడ్డి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లు, పోలీస్ అధికారులు, నోడల్ ఆఫీసర్లు, ప్రాంతీయ సమన్వయకర్తలతో పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 5.50 లక్షల మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్న దృష్ట్యా ఇప్పటినుండే పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎలాంటి లోటుపాట్లకు ఆస్కారం లేకుండా, ప్రశాంత వాతావరణంలో సాఫీగా పరీక్షలు జరిగేలా చూడాలన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ, జిల్లా లో గ్రూప్ -3 పరీక్షలకు 17వేల మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని , అభ్యర్థులకు మొత్తం 49 పరీక్షా కేంద్రాలను గుర్తించడం జరిగిందని, ఇప్పటికే అధికారులు ఈ కేంద్రాలను సందర్శించి వసతి సదుపాయాలను పరిశీలించారని అన్నారు. గ్రూప్-3 పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు, ఇతర మెటీరియల్ ను కట్టుదిట్టమైన బందోబస్తు మధ్య భద్రపరిచేందుకు రెండు స్ట్రాంగ్ రూంలను ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. త్వరగా స్ట్రాంగ్ రూమ్ లకు సంబంధించిన పూర్తి వివరాలను సమర్పిస్తామని, పరీక్షా కేంద్రాల వివరాలను కూడా ఆన్లైన్ ద్వారా పంపిస్తామని అన్నారు. ఎక్కువ సంఖ్యలో అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా సిబ్బందిని నియమిస్తామని, అవసరమైతే ఇతర శాఖల సహకారం తీసుకుంటామని తెలిపారు. ఎలాంటి అవాంతరాలు తావులేకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నామని అన్నారు. వీడియో కాన్ఫరెన్సులో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గ్రూప్ పరీక్షల నిర్వహపై చీఫ్ సెక్రెటరీ శాంతి కుమారి సమీక్ష



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అక్టోబర్ 18:**తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్ 2,3 పరీక్షల పై సచివాలయం నుండి చీఫ్ సెక్రెటరీ శాంతి కుమారి, %u ఉూాజ% చైర్మన్ మహేందర్ రెడ్డి, సభ్యులు తన కార్యాలయం నుండి శుక్రవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతోఈ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు.

ఈ వీడియో కాన్ఫరెన్సుకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు కార్యాలయము నుండి జిల్లారెవెన్యూ అధికారి హరిప్రియ హాజరయ్యారు. నవంబరు 17, 18 తేదిలలో నిర్వహించనున్న గ్రూప్ 3 పరీక్షకు గాను జిల్లాలో 118 పరీక్షా కేంద్రాలలో 71,356 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని డిఆర్ఓ తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిబంధనల మేరకు జిల్లాలో 7 స్ట్రాంగ్ రూంలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.

# మునిపల్లి గ్రామాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ శ్రీ చెన్నూరి రూపేష్

### మునిపల్లి మండలంలోని రౌడీలు, కేడిలు మరియు సస్పెక్ట్ లను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ.

### విలేజ్ విజిటింగ్స్ చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండాలి..

### యస్.హెచ్.ఒ. లకు ఎస్పీ పలు సూచనలు.



సంగారెడ్డి అక్టోబర్ 18 ప్రజ బలం ప్రతినిధి: వార్షిక తనిఖీలలో భాగంగా గురువారం రాత్రి రోజున, సంగారెడ్డి జిల్లా, మునిపల్లి పోలీసు స్టేషన్ తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ. అనంతరం రాత్రి 10 గంటలకు మునిపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీలు, కేడిలు మరియు సస్పెక్ట్ ల ఇండ్ల వద్దకు ఎస్పీ నేరుగా వెళ్ళి తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ.. ప్రస్తుతం వారి జీవన విధానం, వారు చేస్తున్న పని/ఉద్యోగం గురించి అడిగి తెలుసుకున్నారు. గతంలో చేసిన తప్పులను తిరిగి పునరావృతం చేయకుండా సత్:ప్రవర్తన కలిగి సాధారణ జీవన విధానాన్ని కలిగి ఉండాలని సూచించారు. సత్:ప్రవర్తన కలిగి ఉన్నట్లయితే హిస్టరీ షీట్లను తీసివేయడం జరుగుతుందన్నారు. అనంతరం మునిపల్లి గ్రామాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ యువతతో మాట్లాడారు. యువత చెడు వ్యసనాలను అలవాటు చేసుకోవద్దని, విద్యావంతులు ఇతరులకు మార్గదర్శకంగా ఉండాలని సూచించారు. చదువు పూర్తయిన అనంతరం జాబ్ ట్రయల్స్ చేస్తూ, కలిసి చదువుకొని, ఉద్యోగం సాధించి ఆదర్శంగా ఉండాలని అన్నారు. గ్రామాలలో గ్రంథాలయాల ఏర్పాటుకు గ్రామ పెద్దలు సహకరించాలని సూచించారు. గంజాయి, నిషేదిత ఇతర మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా వుండాలని, గ్రామ రక్షణ, దొంగతనాల నివారణకు సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఈ విలేజ్ విజిటింగ్ లో ఎస్పీ వెంబడి అదనపు ఎస్పీ ఎ.సంజీవ రావ్, కొండాపూర్ ఇన్స్పెక్టర్స్ చంద్రయ్య మరియు మునిపల్లి ఎస్ఐ లు ఉన్నారు.



**సికింద్రాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** కీర్తి శేషులు మాజీ ముఖ్య మంత్రివర్యులు టి. అంజయ్య గారి 38 వ వర్ధంతి సందర్భంగా లూంబిని పార్క్ వద్ద వున్న వారి విగ్రహం వద్ద నివాళ్లు అర్పించిన రాంశెట్టి నరేందర్ పీసీసీ స్పోకెస్ పర్సన్. అంజయ్య గారి మనవుడు అభిషేక్ రెడ్డి. బద్దం సతీష్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు.అశోక్ కుమార్. రాధా కృష్ణ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

# ఈ నెల 19న మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేత

## మిషన్ భగీరథ మంచిర్యాల డివిజన్ ఈ.ఈ.కె.మధుసూదన్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి అక్టోబర్18 :** మంచిర్యాల జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో ఈ నెల 19న మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేయడం జరుగుతుందని మిషన్ భగీరథ మంచిర్యాల డివిజన్ ఈ.ఈ కె. మధుసూదన్ ఒక ప్రకటనలో తెలిపారు. మిషన్ భగీరథ-గ్రిడ్ మంచిర్యాల పరిధిలోని వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లో తలెత్తిన నిర్వహణ సమస్య కారణంగా మంచిర్యాల, చెన్నూర్ నియోజకవర్గాలలో నీటి సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, దండేపల్లి,లక్షెట్టిపేట, మంచిర్యాల,మందమర్రి, భీమారం,హాజీపూర్, కోటపల్లి,చెన్నూర్ మండలాలు,మంచిర్యాల, చెన్నూర్,మందమర్రి,నస్పూర్, క్యాతనపల్లి,చెన్నూర్, మున్సిపాలిటీలలో ఈ నెల 19న నీటి సరఫరా నిలిపివేయడం జరుగుతుందని,ప్రజలు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

# ఫుట్ పాత్ లపై హైడ్రా గురి...

హైదరాబాద్, అక్టోబరు 18, హైదరాబాద్ మహానగరం?లో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు ట్రాఫిక్ విభాగంతో కలిసి పని చేయాలని నిర్ణియించింది హైడ్రా. ట్రాఫిక్ సమస్యకు ఫుట్పాత్ల ఆక్రమణ కూడా ఓ కారణంగా భావిస్తున్న హైడ్రా.. ప్లాన్ ఆఫ్ యాక్షన్ సిద్ధం చేసింది. త్వరలోనే ఆపరేషన్ ఫుట్ పాత్ను స్టార్ట్ చేయనుంది. ఈ మేరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్, ట్రాఫిక్ కమిషనర్ విశ్వప్రసాద్ సమావేశమయ్యారు. ట్రాఫిక్ సమస్య సహా ఫుట్పాత్ ఆక్రమణలపై చర్చించారు. ఎక్కడెక్కడ ఫుట్పాత్లు ఆక్రమణలకు గురయ్యాయో గుర్తించి, ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వనున్నారు. ఆ తర్వాత బుల్డోజర్లతో వెళ్లి కూల్చేయనున్నారు. కేవలం ఫుట్పాత్పై ఆక్రమణలే కాదు.. ఆ ప్లేస్లో ప్రభుత్వానికి చెందిన ఎలాంటి షాపులున్నా, ఏమాత్రం ఆలోచించకుండా కూల్చేయనున్నారు.ఫుట్పాత్ల ఆక్రమణల తొలగింపుతో పాటు డీఆర్ఎఫ్ బృందాలకు ట్రాఫిక్ నియంత్రణపై శిక్షణ ఇప్పించాలని హైడ్రా నిర్ణయం తీసుకుంది. హైడ్రాకు చెందిన డీఆర్ఎఫ్ బృందాలకు ట్రాఫిక్ నియంత్రణపై శిక్షణ ఇప్పించాలని నిర్ణయం తీసుకున్నారు. భారీ వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలు లేని సమయంలో ట్రాఫిక్ నియంత్రణకు ట్రాఫిక్ పోలీసులతో కలసి హైడ్రా డీఆర్ఎఫ్ బృందం కలిసి పని చేసేలా ఏర్పాట్లు చేయాలని వారు సమావేశంలో చర్చించారు.రెండు విభాగాలు కలసి పని చేయాలని, ముఖ్యమైన సమయాల్లో హైడ్రా డీఆర్ ఎఫ్ సిబ్బంది కూడా రంగంలోకి దించి ట్రాఫిక్ను క్లియర్ చేసే విధంగా తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. వర్షం పడినప్పుడు వరద నీరు (వాటర్ లాగింగ్) చేరే ప్రాంతాల్లో తక్షణ చర్యలు చేపట్టి నీటిని తొలగించేందుకు డీఆర్ఎఫ్ బృందాలతో ట్రాఫిక్ పోలీసులు కలిసి పని చేస్తాయని అధికారులు తెలిపారు. వెంటనే నీరు తొలిగించేలా హార్సు పవర్ ఎక్కువ ఉన్న మోటర్ల వినియోగంచనున్నట్లు వెల్లడించారు. ఆ నీటిని ఎక్కడకు తోడాలనేదానిపై చర్చ జరిగినట్లు చెప్పారు. శాశ్వత పరిష్కారానికి క్షేత్ర స్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై దృష్టి పెట్టినట్లు, వరద కాలువలు, పైపుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించడం, కొత్త లైన్లను వేసి వరదకు శాశ్వత పరిష్కారం చూపడం వంటివి చేస్తామని వారు తెలిపారు.వర్షం పడినప్పుడు వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని డిసైడ్ అయ్యారు. తక్షణమే నీరు తొలిగించేలా హైపవర్ మోటర్లను వినియోగించాలని నిర్ణయించారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com